



# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు

ప్రైవేటు, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో **25 శాతం ఉచిత ప్రవేశాలు**
- పకడ్బందీగా అమలు చేసేందుకు కమిటీ

12


# అమరావతి వికాసం.. రైతు సంక్షేమం

- 'అమరావతి సంగమం' నిర్మాణానికి రూ.759.79 కోట్ల పరిపాలనా ఆమోదం
- పోలీసు శాఖకు రూ.324 కోట్లతో 4,760 కొత్త వాహనాలు
- 'ఏపీ పౌల్ట్రీ అభివృద్ధి విధానం 2025-29'కి పచ్చజెండా
- పొగాకు, తోతాపురి మామిడి రైతులకు చేయూత: మార్క్‌ఫెడ్ ద్వారా నిధుల సమీకరణకు గ్రీన్‌సిగ్నల్
- 'జలజీవన్ మిషన్' పనులకు రూ.4,053 కోట్లు మంజూరు
- మంగళగిరిలో అదనపు కోర్టు, రాజమహేంద్రవరం ఈఎస్ఐ ఆసుపత్రి అప్‌గ్రెడేషన్‌కు ఓకే
- ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన మంత్రిమండలి సమావేశంలో కీలక నిర్ణయాలు

*ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధ్యక్షతన రాష్ట్ర సచివాలయంలో గురువారం మంత్రి మండలి సమావేశం జరిగింది. ఇందులో వ్యవసాయం, మౌలిక వసతులు, ఇంధన శాఖలతో పాటు రాజధాని అమరావతి అభివృద్ధికి సంబంధించి పలు కీలక ప్రతిపాదనలకు ఆమోద ముద్ర వేసింది. తోతాపురి మామిడి రైతులకు మద్దతు ధర కల్పించేందుకు మార్క్‌ఫెడ్‌కు రూ.281 కోట్ల నిధుల ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. పొగాకు రైతులకు నేరుగా నగదు బదిలీ ద్వారా రూ.94 కోట్ల ఆర్థిక సాయం అందించే ప్రతిపాదనకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. మత్స్యరంగంలో కేజ్ కల్చర్‌ను ప్రోత్సహించేందుకు వీలుగా 'రిజర్వాయర్ కేజ్‌కల్చర్ పాలసీ' ముసాయిదాను ఆమోదించింది. రాజధాని అమరావతిలోని శాఖమూరులో స్టేట్ పబ్లిక్ లైబ్రరీ, ఆడిటోరియం, గుడ్ గవర్నెన్స్ సంస్థలతో కూడిన 'అమరావతి సంగమం' నిర్మాణానికి రూ.759.79 కోట్ల నిధుల కేటాయింపునకు పరిపాలనా అనుమతి లభించింది. పోలీసు శాఖకు రూ.324 కోట్లతో 4,760 కొత్త వాహనాలు సమకూర్చాలని నిర్ణయించింది. 'ఏపీ పౌల్ట్రీ అభివృద్ధి విధానం 2025-29'కి పచ్చజెండా ఊపింది. 'జలజీవన్ మిషన్' పనులకు రూ.4,053 కోట్లు మంజూరు చేసింది. మంగళగిరిలో అదనపు కోర్టు, రాజమహేంద్రవరం ఈఎస్ఐ ఆసుపత్రి అప్‌గ్రెడేషన్‌కు ఓకే చేశారు.*



సీఎంకు మంత్రుల 'స్టాండింగ్ ఒవేషన్'





## 'స్థానిక' సమరానికి సమాయత్తం కావాలి

- ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపు
- మంత్రులు, జోనల్ పరిశీలకులతో సమీక్ష
- బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు ఇచ్చి తీరుతామని స్పష్టీకరణ

అమరావతి (చైతన్యరథం): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ యంత్రాంగం పూర్తిస్థాయిలో సమాయత్తం కావాలని తెలుగుదేశం పార్టీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పిలుపునిచ్చారు. గురువారం ఆయన అమరావతిలో మంత్రులు, జోనల్ పరిశీలకులతో కీలక సమావేశం నిర్వహించారు. ఈ భేటీలో రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేష్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. ఇటీవల వెలిగొండ ఫేజ్-1, పోలవరం ఎడమ కాల్వను విజయవంతంగా ప్రారంభించిన సీఎం చంద్రబాబును నేతలు అభినందించారు.

సీఎం చంద్రబాబు మాట్లాడుతూ... "గత అసెంబ్లీ ఎన్నికల కంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో మనం మరింత మెరుగైన స్ట్రైక్ రేట్ సాధించాలి. కూటమిగా స్థానిక ఎన్నికలను ఎదుర్కొనడం టీడీపీకి ఇదే మొదటిసారి. ఎట్టి పరిస్థితుల్లోనూ కూటమి భాగస్వామ్య పక్షాల మధ్య ఎలాంటి వ్యత్యాసాలు, గ్యాప్ రాకూడదు. ఎన్డీఏ పార్టీలతో పూర్తి సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలి. స్థానిక పరిస్థితులకు అనుగుణంగా సరైన నిర్ణయాలు తీసుకుంటాం" అని పేర్కొన్నారు.



అభ్యర్థుల ఎంపిక ప్రక్రియలో యువతకు, మహిళలకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంటుందని సీఎం స్పష్టం చేశారు. ప్రజలు, కార్యకర్తల ఆమోదంతో పాటు నాయకుల పనితీరు ఆధారంగానే టికెట్ల కేటాయింపు ఉంటుందన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు కచ్చితంగా 34 శాతం రిజర్వేషన్లు ఇచ్చి తీరుతామని సీఎం చంద్రబాబు పునరుద్ఘాటించారు. "అవసరమైతే 34 శాతానికి మించి సీట్లు ఇస్తామే తప్ప, ఒక్క శాతం కూడా తగ్గించే ప్రసక్తే లేదు. బీసీ రిజర్వేషన్లను అడ్డుకోవడానికి కొందరు కోర్టులను ఆశ్రయించారు. 'సర్' ప్రక్రియ పూర్తి కాకుండా ఎన్నికలు నిర్వహించకూడదని ప్రతిపక్ష గొడ్డలి పార్టీ కోర్టుకు వెళ్లి కుతంత్రాలు పన్నుతోంది. రాష్ట్రానికి కేంద్ర నిధులు రాకుండా అడ్డుకోవడమే వారి ముఖ్య ఉద్దేశం" అని విమర్శించారు. కాగా పార్టీ నాయకత్వ పటిమను పెంపొందించేందుకు ఈ నెల 7, 8 తేదీల్లో మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో 'లీడర్‌షిప్ ట్రైనింగ్ కాంక్లేవ్' నిర్వహిస్తున్నట్టు చంద్రబాబు వెల్లడించారు.

## అక్టోబరు నుంచి కొత్త పింఛన్లు: మంత్రి లోకేష్

అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ దశలవారీగా కొత్త పింఛన్లు మంజూరు చేయనున్నట్లు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ వెల్లడించారు. సచివాలయంలో గురువారం కేబినెట్ భేటీకి ముందు ఆయన నేతృత్వంలో మంత్రుల కీలక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలు ముఖ్యాంశాలపై లోకేష్ దిశానిర్దేశం చేశారు. పింఛన్ల కోసం వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు క్షుణ్ణంగా పరిశీలిస్తూ అర్హులందరికీ త్వరితగతిన లబ్ధి చేకూర్చాలని అధికారులను, మంత్రులను ఆదేశించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు, నాయకులు పూర్తిస్థాయిలో సమాయత్తం కావాలని లోకేష్ పిలుపునిచ్చారు. అన్ని స్థానాల్లోనూ కూటమి అభ్యర్థుల ఘన విజయమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. అక్టోబరు నాటికి స్థానిక ఎన్నికల ప్రక్రియ ముగుస్తుందని, ఎన్నికలు వాయిదాపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. కోర్టులో పెండింగ్‌లో ఉన్న అంశాలను కూడా త్వరితగతిన పరిష్కరించి అన్ని స్థానాల్లోనూ ఎన్నికలు నిర్వహించేలా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటోందన్నారు. మొదట పురపాలక (మున్సిపల్) ఎన్నికలు, ఆ తర్వాత ఎంపీటీసీ, జడ్పీటీసీ, అనంతరం పంచాయతీ ఎన్నికలు వరుసగా జరుగుతాయని



షెడ్యూల్ సరళిని వివరించారు. స్థానిక ఎన్నికలు వాయిదాపడితే కేంద్ర ఫైనాన్స్ కమిషన్ నిధులు నిలిచిపోయి రాష్ట్రానికి తీవ్ర నష్టం జరుగుతుందనే దురుద్దేశంతోనే ప్రతిపక్షం కోర్టు కేసులతో కుట్రలు చేస్తోందని మండిపడ్డారు. విద్యా శాఖను లక్ష్యంగా చేసుకుని వైసీపీ తప్పుడు ప్రచారాలు చేస్తోందని, అలాంటి కుట్రలపై నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వం చెప్పిన మాట వినని అధికారులు, ప్రభుత్వం లేదా మంత్రులకే చెడ్డపేరు తెచ్చేలా వ్యవహరించే అధికారుల విషయంలో ప్రత్యామ్నాయ చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇటీవల కొన్ని సమస్యలు కేవలం అధికారుల అలసత్వం, నిర్లక్ష్యం వల్లే తలెత్తాయని అభిప్రాయపడ్డారు. వైద్య ఆరోగ్య రంగంలో చిన్న పొరపాటు జరిగినా సోషల్ మీడియా వేదికగా ప్రభుత్వంపై ట్రోలింగ్ చేస్తూ బురదజల్లే యత్నాలు చేస్తున్నారని, ఇలాంటి దుష్ప్రచారాలపై మంత్రులు తక్షణం స్పందించాలని కోరారు. టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడిపై గత ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించి, అన్యాయంగా నిర్బంధించి మూడేళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఈ నెల 9న రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని లోకేష్ పిలుపునిచ్చారు.

### మైనింగ్ రంగంలో ఆదాయం పెంపే లక్ష్యం

9

- జిల్లాల వారీగా నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలి
- గనులు, భూగర్భ వనరుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర
- మంగళగిరిలో డైరెక్టరేట్ కార్యాలయం ప్రారంభం

### నడింపాలెంలో కేంద్ర యోగా, ప్రకృతి వైద్య పరిశోధన సంస్థ

- రూ.100 కోట్లు.. 100 పడకలతో ఏర్పాటు
- కేంద్రం నుంచి అధికారికంగా సమాచారం
- రూ.9.94 కోట్లతో త్వరలో ప్రాథమిక పనులు
- వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్

12

### పర్యాటకరంగ అభివృద్ధికి ప్రణాళికలు

- ఏడాదంతా పర్యాటక శోభ ఉట్టిపడేలా ఉత్సవాలు
- 27న 'వరల్డ్ టూరిజం డే'
- వినూత్న కార్యక్రమాలు, ఈవెంట్లు నిర్వహించాలి
- జిల్లాల ప్రతిపాదనల అమలుకు కార్యాచరణ
- అధికారులకు మంత్రి కందుల దుర్గేష్ ఆదేశం

9

చైతన్యరథం



# అమరావతి వికాసం... రైతు సంక్షేమం

- **'అమరావతి సంగమం' నిర్మాణానికి రూ.759.79 కోట్ల పరిపాలనా ఆమోదం**
- **పోలీసు శాఖకు రూ.324 కోట్లతో 4,760 కొత్త వాహనాలు**
- **'ఏపీ పౌల్ట్రీ అభివృద్ధి విధానం 2025-29'కి పచ్చజెండా**
- **పొగాకు, తోతాపురి మామిడి రైతులకు చేయూత: మార్క్‌ఫెడ్ ద్వారా నిధుల సమీకరణకు గ్రీన్‌సిగ్నల్**
- **'జలజీవన్ మిషన్' పనులకు రూ.4,053 కోట్లు మంజూరు**
- **మంగళగిరిలో అదనపు కోర్టు, రాజమహేంద్రవరం ఈఎస్ఐ ఆసుపత్రి అప్‌గ్రేడేషన్‌కు ఓకే**
- **ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన మంత్రిమండలి సమావేశంలో కీలక నిర్ణయాలు**




అమరావతి (చైతన్యరథం): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర సచివాలయంలో గురువారం 1393వ (56వ) క్యాబినెట్ సమావేశం జరిగింది. ఇందులో పలు అంశాలకు సంబంధించి తీసుకున్న నిర్ణయాలను సమాచార, పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు వివరించారు.

పల్నాడు జిల్లా మాచర్ల మండలం అచ్చమ్మకుంట గ్రామంలో కొత్తగా వెటర్నరీ డిస్పెన్సరీ ఏర్పాటుకు ఆమోదం. ఇందుకోసం వైఎస్సార్ కడప జిల్లా ఒంటిమిట్ట ఏరియా వెటర్నరీ ఆసుపత్రి నుంచి ఒక వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ పోస్టును, స్థానిక రైతు సేవా కేంద్రం నుంచి ఒక యానిమల్ హజ్బెండ్రీ అసిస్టెంట్ పోస్టును రెగ్యులర్ ప్రాతిపదికన సర్దుబాటు చేయడంతో పాటు ఆఫీస్ సబార్డినేట్ పోస్టును అవుట్ సోర్సింగ్ పద్ధతిలో భర్తీ చేసేందుకు పరిపాలనా అనుమతి మంజూరు. ఈ డిస్పెన్సరీ నిర్వహణకు ఏటా రూ.21,13,441 వ్యయం కానుంది. ఈ నిర్ణయం వల్ల అచ్చమ్మకుంటతో పాటు 5 కిలోమీటర్ల పరిధిలోని మరో ఐదు గ్రామాల పరిధిలో ఉన్న సుమారు 12,648 పశువులు, కోళ్లకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయి. తద్వారా జిల్లాలో పశు సంరక్షణ, ఉత్పత్తి గణనీయంగా పెరగనున్నాయి.

2026-27 మార్కెటింగ్ సీజన్‌లో తోతాపురి మామిడికి మద్దతు ధర అమలు చేసేందుకు అవసరమైన నిధులను వర్కింగ్ క్యాపిటల్/స్వల్పకాలిక రుణాల ద్వారా సమీకరించుకునేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార మార్కెటింగ్ సమాఖ్య లిమిటెడ్‌కు అనుమతి పొడిగించారు.

2026 సీజన్‌లో 94 మిలియన్ కిలోల తక్కువ రకం, నాణ్యత లేని పొగాకు కొనుగోలుకు సంబంధించి ధరల లోటు భర్తీ మద్దతుగా కిలోకు రూ.10 చొప్పున పొగాకు రైతులకు నేరుగా నగదు బదిలీ ద్వారా అందించేందుకు మార్క్‌ఫెడ్‌కు రూ.94 కోట్ల నిధులను సమకూర్చే ప్రతిపాదనకు ఆమోదం.

కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో రూ.624.88 లక్షల విలువైన 78 వరద నష్ట పునరుద్ధరణ పనులకు పరిపాలనా ఆమోదం ఇస్తూ ఆయా జిల్లాల కలెక్టర్లు, జిల్లా మేజిస్ట్రేట్లు తీసుకున్న చర్యను ధ్రువీకరించే ప్రతిపాదనకు ఆమోదం.

గుంటూరు జిల్లా మంగళగిరిలో అదనపు జిల్లా & సెషన్స్ జడ్జి కోర్టు ఏర్పాటుకు గతంలో జీవో (G.O. Ms. No. 6, తేదీ: 23.01.2023) ద్వారా అనుమతి ఇచ్చారు. అయితే ఇతర కోర్టుల నుంచి సిబ్బంది పోస్టులను బదిలీ చేసే అవకాశం లేదని హైకోర్టు రిజిస్ట్రార్ (అడ్మినిస్ట్రేషన్) స్పష్టం చేయడంతో పాటు అదనపు జిల్లా, సెషన్స్ కోర్టు కేడర్ నిబంధనల ప్రకారం రెగ్యులర్ నియామకాలకు ప్రతిపాదించారు. దీనిపై రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఐటీ, ఎలక్ట్రానిక్స్-కమ్యూనికేషన్స్, ఆర్టీజీ శాఖ మంత్రి విజ్ఞప్తి మేరకు మంగళగిరి అదనపు జిల్లా & సెషన్స్ జడ్జి కోర్టు సజావుగా పనిచేసేందుకు అవసరమైన సిబ్బంది, రికరింగ్, నాన్-రికరింగ్ బడ్జెట్ అంశాలను పరిగణలోకి తీసుకుంటూ మొత్తం 21 రెగ్యులర్ పోస్టులను మంజూరు చేసేందుకు ఆమోదం.

రాజమహేంద్రవరంలోని ఈఎస్ఐ ఆసుపత్రిని 50 పడకల నుంచి 100 పడకలకు అప్‌గ్రేడ్ చేసేందుకు, అందుకు అవసరమైన వైద్య, పారా మెడికల్ సిబ్బంది కేడర్ బలాన్ని మంజూరు చేసేందుకు చేసిన ప్రతిపాదనకు ఆమోదం.

అమరావతిలోని టైప్-B, C, D & E LPS రోడ్లకు సిమెంట్ కాంక్రీట్ పేవ్‌మెంట్లకు బదులుగా బిటుమినస్ (ఫ్లెక్సిబుల్) పేవ్‌మెంట్లను నిర్మించే ప్రతిపాదనకు ఆమోదం. న్యూఢిల్లీకి చెందిన CRRI, చీఫ్ ఇంజనీర్ల బోర్డు సిఫార్సులకు లోబడి, IRC:37-2018 ప్రమాణాల ప్రకారం 5 MSA డిజైన్ ట్రాఫిక్ లోడింగ్ కోసం 30 మి.మీ. (BC) + 50 మి.మీ. (DBM) + 250 మి.మీ. (WMM) + 150 మి.మీ. (GSB) పేవ్‌మెంట్ క్రస్ట్‌తో వీటిని రూపకల్పన చేయనున్నారు. APCRDA అథారిటీ తీర్మానం నెం.702/2026కు అనుగుణంగా దీనిపై తదుపరి చర్యలు చేపట్టేందుకు ADCL చైర్‌పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్‌కు అధికారం కల్పించారు.

అమరావతి రాజధాని నగరంలో కొత్త భూ కేటాయింపులకు సంబంధించి మంత్రుల బృందం 29వ సమావేశంలో చేసిన సిఫార్సులను, APCRDA అథారిటీ తీర్మానం (నెం.708/2026, తేదీ: 27.08.2026)ను ఆమోదించే ప్రతిపాదనకు ఆమోదం. ఇందుకు అనుగుణంగా అమరావతి ల్యాండ్ అలాట్‌మెంట్ నిబంధనలు-2017 ప్రకారం తదుపరి చర్యలు చేపట్టేందుకు APCRDA కమిషనర్‌కు అధికారం కల్పించింది.

అమరావతిలోని శాకమూరు వద్ద ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పబ్లిక్ లైబ్రరీ, ఆడిటోరియం, గ్లోబల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గుడ్ గవర్నెన్స్‌లతో కూడిన 'అమరావతి సంగమం' నిర్మాణానికి ఐటమ్ రేట్ కాంట్రాక్ట్/EPC మోడ్-2 కింద GST, ఇతర నిబంధనలతో కలిపి మొత్తం రూ.759.793 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టేందుకు పరిపాలనా ఆమోదం. ఈ ప్రాజెక్టుకు DPL నుంచి రూ.310.080 కోట్లు, APHRDI నుంచి రూ.277.949 కోట్లు, APCRDA నుంచి రూ.171.764 కోట్ల చొప్పున నిధుల సమీకరణ నిబద్ధతతో అమలు చేయనున్నారు. అథారిటీ తీర్మానం నెం.699/2026కు అనుగుణంగా దీనిపై తదుపరి చర్యలు తీసుకునేందుకు APCRDA కమిషనర్‌తో పాటు AGICL మేనేజింగ్ డైరెక్టర్‌కు అధికారం కల్పించారు.

అమరావతి మీదుగా ఎర్రుపాలెం-నంబూరు నూతన బ్రాడ్‌గేజ్ రైల్వే లైన్ నిర్మాణానికి 100 మీటర్ల బఫర్‌తో పాటు క్యాపిటల్ సిటీ సరిహద్దు నుంచి ఇన్నర్ రింగ్ రోడ్ వరకు గ్రిడ్ రోడ్ల విస్తరణతో కూడిన ఇన్నర్ రింగ్ రోడ్ ఏర్పాటుకు, రైతుల అభ్యర్థన మేరకు ల్యాండ్ పూలింగ్ స్కీమ్ చేపట్టేందుకు ఏపీసీఆర్‌డీఏ కమిషనర్‌కు అధికారం కల్పించేందుకు ఆమోదం. ఈ మేరకు గుంటూరు జిల్లా కంతేరు గ్రామంలో 974.00 ఎకరాలు, తాడికొండ మండలం పరిధిలో 5,238.50 ఎకరాలు... మొత్తం 6,212.50 ఎకరాల భూమిని ల్యాండ్ పూలింగ్ ద్వారా సమీకరించేందుకు అనుమతి మంజూరు చేసింది.

చిత్తూరు జిల్లా పూతలపట్టు మండలం వావిల్ తోట గ్రామంలో సర్వే నెం.824/20లో 18.20 ఎకరాల భూమిని పారిశ్రామిక పార్క్ ఏర్పాటు కోసం ఎకరానికి రూ.28,75,000/- చెల్లింపుపై, సాధారణ నిబంధనలకు లోబడి ఏపీఐఐసీకి బదిలీ చేసేందుకు చేసిన ప్రతిపాదనకు ఆమోదం.

చిత్తూరు జిల్లా గుడుపల్లె మండలం పోగురుపల్లె గ్రామంలో సర్వే నెం.254 తదితరాల్లో 50.56 ఎకరాల భూమిని పారిశ్రామిక పార్క్ ఏర్పాటు కోసం చెల్లింపు ప్రాతిపదికన, సాధారణ నిబంధనలకు లోబడి ఏపీఐఐసీకి బదిలీ చేసేందుకు చేసిన ప్రతిపాదనకు ఆమోదం.

మార్కాపురం జిల్లా మార్కాపురం మండలం గోగులదిన్నె గ్రామంలో సర్వే నెం.90లో 20.01 ఎకరాల భూమిని కొత్త సమీకృత కలెక్టరేట్ కాంప్లెక్స్, ఇతర జిల్లా కార్యాలయాల నిర్మాణం కోసం రెవెన్యూ శాఖకు ఉచితంగా, సాధారణ నిబంధనలకు లోబడి బదిలీ చేసేందుకు చేసిన ప్రతిపాదనకు ఆమోదం.

చిత్తూరు జిల్లా విజయపురం మండలం కోసలనగరం గ్రామంలో సర్వే నెం.266/1బి తదితరాల్లో 17.13 ఎకరాల భూమిని కోసలనగరం పారిశ్రామిక పార్కుకు అప్రోచ్ రోడ్డు ఏర్పాటు కోసం చెల్లింపు ప్రాతిపదికన, సాధారణ నిబంధనలకు లోబడి ఏపీఐఐసీకి బదిలీ చేసేందుకు చేసిన ప్రతిపాదనకు ఆమోదం.

చిత్తూరు జిల్లా చిత్తూరు రూరల్ మండలం తెనబండ గ్రామంలో సర్వే నెం.290/3బి/3 తదితరాల్లో 10.33 ఎకరాల భూమిని పారిశ్రామిక పార్క్ ఏర్పాటు కోసం ధర చెల్లింపు ప్రాతిపదికన, సాధారణ నిబంధనలకు లోబడి ఏపీఐఐసీకి బదిలీ చేసేందుకు చేసిన ప్రతిపాదనకు ఆమోదం.

వైఎస్సార్ కడప జిల్లా దువ్వూరు (గ్రామం, మండలం)లో సర్వే నెం.1453/2లో 25.00 ఎకరాల భూమిని ఏపీ ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ-2024 మేరకు పీఎం-కుసుమ్ ఫీడర్ లెవల్ సోలరైజేషన్ పథకం కింద సోలార్ పవర్ ప్రాజెక్ట్ ఏర్పాటు కోసం లీజు ప్రాతిపదికకు బదులుగా మార్కెట్ విలువ చెల్లింపుపై NREDCAP వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌కు

(తరువాయి 3లో..)

# అమరావతి వికాసం... రైతు సంక్షేమం

(2వ పేజీ తరువాయి.. )

బదిలీ చేసేందుకు చేసిన ప్రతిపాదనకు ఆమోదం.

ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రూరల్ మండలం వేమవరం గ్రామంలో LPM నం.163లో 2.81 ఎకరాలు, LPM నం.721లో 7.31 ఎకరాలు, మొత్తం 10.12 ఎకరాల ప్రభుత్వ భూమిని AP Economic Cities Promotion and Development Corporation Ltd. (APEDCO)కు కేటాయించేందుకు ఆమోదం. JET CITYలో ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ ఏర్పాటు కోసం ఈ భూమిని చెల్లింపు ప్రాతిపదికన, ప్రభుత్వం నిర్దేశించిన సాధారణ నిబంధనలు, ఇతర షరతులకు లోబడి కేటాయించేందుకు అనుమతి మంజూరు చేసింది.

క్రియాశీల కాలువ ప్రాంతం, హైడ్రాలిక్ నిర్వహణ జోన్, తప్పనిసరి 20 అడుగుల నీటిపారుదల రైట్-ఆఫ్-వే బఫర్‌ను మినహాయిస్తూ కాలువ నీటి ప్రవాహ సామర్థ్యం, నిర్వహణ హక్కులకు పూర్తి రక్షణ ఉండేలా జాయింట్ కమిటీ సిఫార్సుల మేరకు... మొత్తం 62.70 ఎకరాల్లో 22.31 ఎకరాల భూమి వర్గీకరణను "కెనాల్ పోరంబోకు" నుంచి "ఏ.డబ్ల్యూ.డ్రై"గా మార్చేందుకు, అర్హులైన నిరుపేద లబ్ధిదారులకు ఇంటి స్థల పట్టాలు జారీ చేసేందుకు చేసిన ప్రతిపాదనకు ఆమోదం. జాయింట్ కమిటీ సిఫారసుల మేరకు, మొత్తం 62.70 ఎకరాల్లో క్రియాశీల కాలువ ప్రాంతం, హైడ్రాలిక్ ఆపరేషనల్ జోన్, తప్పనిసరి 20 అడుగుల ఇరిగేషన్ రైట్ ఆఫ్ వే బఫర్ ప్రాంతాలను మినహాయించి, 22.31 ఎకరాల భూమిని కెనాల్ పోరంబోకు నుంచి Alternate Wetting and Dryingగా వర్గీకరణ మార్చేందుకు ఆమోదం. కాలువ నీటి ప్రవాహ సామర్థ్యం, నిర్వహణ హక్కులకు ఎలాంటి ఆటంకం కలగకుండా రక్షణ చర్యలు కొనసాగిస్తూ, అర్హులైన పేద లబ్ధిదారులకు ఇంటి స్థల పట్టాలు జారీ చేసేందుకు అనుమతి మంజూరు చేసింది.

ఏపీ జెన్‌కో సీలేరు కాంప్లెక్స్‌లోని విద్యుత్ కేంద్రాలకు Fire NOC పొందేందుకు ఆంధ్రప్రదేశ్ అగ్నిమాపక సేవల శాఖకు చెల్లించాల్సిన Fire Precautionary Fee నుంచి మినహాయింపు కల్పించేందుకు ఆమోదం. ఈ మినహాయింపును మంగళగిరి AIIMS, అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల భవనాలు, కేంద్ర ప్రభుత్వ సంస్థలకు వర్తిస్తున్న విధానానికి సమానంగా APGENCO సీలేరు కాంప్లెక్స్ విద్యుత్ కేంద్రాలకు వర్తింపజేయాలని నిర్ణయించింది.

APTRANSCO సంస్థ వీ/ం పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ నుంచి తీసుకున్న మధ్యకాలిక రుణం తిరిగి చెల్లింపునకు పూచీగా, PFCకు అనుకూలంగా రూ.950.00 కోట్ల మేర ప్రభుత్వ హామీని కొన్ని షరతులతో ఇచ్చేందుకు చేసిన ప్రతిపాదనకు ఆమోదం.

G.O.Ms.No.62, ఇంధన శాఖ, 28.07.2025 ద్వారా M/s RVR ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు కేటాయించిన 800 MW అవుకు పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్ట్ కేటాయింపును రద్దు చేసే ప్రతిపాదనకు ఆమోదం.

AP Integrated Clean Energy Policy-2024 కింద అనంతపురం జిల్లాలోని కనేకల్, బొమ్మనహాల్ మండలాల్లో 300 మెగావాట్ల Wind-Solar Hybrid ప్రాజెక్టులో కేటాయించిన 180 మెగావాట్ల విండ్, 120 మెగావాట్లు/172 MWp DC సోలార్ సామర్థ్యాల్లో 28 మెగావాట్ల మేర విండ్, సోలార్ విద్యుత్ సామర్థ్యాలను పరస్పరం మార్పిడి చేసుకునేందుకు M/s. Ganeko Three Energy Pvt. Ltd.కు అనుమతి మంజూరు చేయడానికి ఆమోదం.



APPDCL, PFC, REC నుంచి పొందిన రూ.500 కోట్ల చొప్పున మధ్యకాలిక రుణాలకు సంబంధించి PFCకు రూ.500 కోట్లు, RECకు రూ.550 కోట్ల చొప్పున కార్పొరేట్ హామీలను జారీ చేసేందుకు APGENCO మేనేజింగ్ డైరెక్టర్‌కు అంగీకారం తెలిపే ప్రతిపాదనకు ఆమోదం. APPDCL సంస్థ PFC, REC సంస్థల నుంచి పొందిన రూ.500 కోట్ల చొప్పున మధ్యకాలిక రుణాలకు భద్రతగా, ఏపీ జెన్‌కో మేనేజింగ్ డైరెక్టర్ ద్వారా PFCకి రూ.500 కోట్లకు, RECకి రూ.550 కోట్లకు కార్పొరేట్ గ్యారంటీలు జారీ చేసేందుకు అనుమతి ఇవ్వాలని కేబినెట్ ఆమోదించింది. ఈ గ్యారంటీలను నిర్దేశిత నిబంధనలు, షరతులకు లోబడి జారీ చేయడానికి సమ్మతి తెలిపింది.

పోలవరం హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్టులోని E&M, H&M పనులకు సంబంధించి Price Variation లెక్కింపునకు NHPC విధానాన్ని పరిగణలోకి తీసుకోవాలన్న M/s. Megha Engineering & Infrastructure Limited (MEIL) అభ్యర్థనకు ఆమోదం. ఈ మేరకు GST మినహాయించి రూ.472.86 కోట్లు, GSTతో కలిపి రూ.557.97 కోట్ల ధర వ్యత్యాస మొత్తాన్ని NHPC విధానం ప్రకారం పరిగణించేందుకు అనుమతి మంజూరు చేసింది.

ఆంధ్రప్రదేశ్ "పౌల్ట్రీ అభివృద్ధి విధానం 2025-2029" ముసాయిదాకు ఆమోదం. ఏపీలో పౌల్ట్రీ రంగాన్ని మరింత బలోపేతం చేసి, రైతుల ఉత్పత్తి వ్యయాలను తగ్గించడం, ఆధునిక Environment Controlled Poultry Shedsను ప్రోత్సహించడం, వ్యాధుల పర్యవేక్షణ-నివారణ, బయోసెక్యూరిటీని మెరుగుపరచడం, గ్రామీణ/బ్యాక్‌యార్డ్ పౌల్ట్రీని అభివృద్ధి చేయడం, పౌల్ట్రీ ఉత్పత్తుల ప్రాసెసింగ్-విలువ ఆధారిత ఉత్పత్తులను ప్రోత్సహించడం, మార్కెట్, ఎగుమతి అవకాశాలను విస్తరించడం లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ పౌల్ట్రీ డెవలప్‌మెంట్ పాలసీ 2026-29కు ఆమోదం. ఈ పాలసీ ద్వారా పౌల్ట్రీ ఉత్పత్తి వ్యవస్థను మరింత ఆధునికీకరించి, బయోసెక్యూరిటీ ప్రమాణాలను పెంపొందించడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి, అదనపు ఆదాయ అవకాశాలు మెరుగుపడనున్నాయి. గుడ్లు, కోళ్ల మాంసం లభ్యత, వినియోగం పెరగడంతో పాటు ప్రాసెసింగ్, కోల్డ్‌చైన్ మౌలిక వసతులు, విలువ ఆధారిత ఉత్పత్తులు, ఎగుమతులకు ప్రోత్సాహం లభిస్తుంది. పాలసీలో వివిధ అంశాల కింద మొత్తం రూ.657.18 కోట్ల మేర ఆర్థిక ప్రోత్సాహకాలను సూచించారు. ఇందులో వడ్డీ రాయితీ, Environment Controlled Poultry Sheds కోసం మూడేళ్లలో రూ.120 కోట్లు పశుసంవర్ధక శాఖ బడ్జెట్ కేటాయింపుల నుంచి, నిధుల లభ్యత, మంజూరుకు లోబడి వినియోగించేందుకు గుర్తించారు. ఈ పాలసీ ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలకు వర్తిస్తుంది. అయితే ఆయా భాగాలకు నిర్దేశించిన అర్హతలు, మార్గదర్శకాలు, ఆర్థిక పరిమితులు, సాధ్యాసాధ్యాలకు లోబడి ప్రయోజనాలు అందుతాయి. పౌల్ట్రీ ఫారాల తప్పనిసరి రిజిస్ట్రేషన్ ద్వారా ఫారాల ట్రేసబిలిటీ, వ్యాధుల పర్యవేక్షణ, బయోసెక్యూరిటీ నిబంధనల అమలు మెరుగుపడటంతో పాటు వ్యాధుల వ్యాప్తి సమయంలో పశుసంవర్ధక శాఖ వేగంగా స్పందించేందుకు వీలుకలుగుతుంది. గ్రామీణ కుటుంబాల కోసం మదర్ పౌల్ట్రీ యూనిట్లు, గ్రామీణ/బ్యాక్‌యార్డ్ పౌల్ట్రీ కార్యకలాపాలను ప్రోత్సహిస్తూ NLM, SERP, PMEGP తదితర కార్యక్రమాలతో అనుసంధానం చేయనున్నారు. అయితే పాలసీ కింద ప్రయోజనాలు అన్ని పౌల్ట్రీ రైతులకు స్వయంచాలకంగా అందవు. రిజిస్ట్రేషన్, అర్హత, ధ్రువీకరణ, నిర్దేశిత ఆర్థిక పరిమితులు, సంబంధిత మార్గదర్శకాలు మరియు బడ్జెట్ లభ్యత ఆధారంగా ప్రోత్సాహకాలు మంజూరు చేయబడతాయి.

గ్రామీణ నీటి సరఫరా పథకాల పనుల్లో కాంట్రాక్టు/నిర్మాణ సంస్థల జవాబుదారీతనాన్ని నిర్ధారించేందుకు, పారదర్శకమైన "కాంపిటీటివ్ బిడ్డింగ్‌ను" ప్రోత్సహించేందుకు, దీర్ఘకాలిక నిర్వహణను పటిష్టం చేసేందుకు వీలుగా ఆపరేషన్-మెయింటెనెన్స్ విధానంలో తగిన సవరణలు చేస్తూ డిఫెక్ట్ లయబిలిటీ పీరియడ్‌ను హేతుబద్ధీకరించే ప్రతిపాదనకు ఆమోదం. దీని ప్రకారం సింగిల్ విలేజ్ స్కీమ్‌లకు 2 సంవత్సరాల డిఫెక్ట్ లయబిలిటీ పీరియడ్, మల్టీ విలేజ్ స్కీమ్‌లకు (MVS/BWS) 2 సంవత్సరాల డిఫెక్ట్ లయబిలిటీ పీరియడ్‌తో పాటు 10 సంవత్సరాల పనితీరు ఆధారిత నిర్వహణ వర్తిస్తుంది. ఈ విధానం అమలు ద్వారా గ్రామీణ కుటుంబాలు, పట్టణ స్థానిక సంస్థలు, పరిశ్రమలకు నిరంతరం పరిశుభ్రమైన, సురక్షితమైన తాగునీరు అందుబాటులోకి వస్తుంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజారోగ్యం, పారిశుధ్య పరిస్థితులు మెరుగుపడటంతో పాటు రాష్ట్రంలో నూతన పరిశ్రమల స్థాపనకు అనుకూల వాతావరణం ఏర్పడి అదనపు ఉపాధి అవకాశాలు లభిస్తాయి. తాగునీటి సేకరణ కోసం వెచ్చించే సమయం ఆదా కావడం వల్ల ప్రజల పనివేళలు సద్వినియోగమై తలసరి ఆదాయం పెరుగుతుంది. గ్రామాల్లో ఆరోగ్యకరమైన, చైతన్యవంతమైన సామాజిక సంబంధాలు బలపడతాయి.

జల్‌జీవన్ మిషన్ (జేజేఎం 2.0) నిర్దేశించిన గడువులోగా గ్రామాల్లో అసంపూర్తిగా ఉన్న మౌలిక సదుపాయాల పనులను పూర్తి చేసి, "హర్ ఘర్ జల్" లక్ష్యాన్ని వేగవంతం చేసేందుకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. ఇందులో భాగంగా మొత్తం రూ.4,053.85 కోట్ల అంచనా వ్యయంతో 13,252 పనులను పునరుద్ధరిస్తూ, పునర్వ్యవస్థీకరణతో పాటు పరిపాలనా ఆమోదం మంజూరు చేశారు. దీనిలో సింగిల్ విలేజ్ స్కీమ్స్ కింద ఉన్న 13,247 పనులను గ్రామాలవారీగా హేతుబద్ధీకరించి రూ.3,046.11 కోట్లతో 7,439 పథకాలుగా, మల్టీ విలేజ్ స్కీమ్స్ కింద 334 గ్రామాలకు ప్రయోజనం చేకూరేలా రూ.1,007.74 కోట్లతో ఐదు పథకాలను చేపట్టనున్నారు. పనుల హేతుబద్ధీకరణ నేపథ్యంలో... గతంలో ?1,811.81 కోట్ల వ్యయంతో 2,943 పనుల మంజూరుకు ఇచ్చిన G.O.Ms.No.94 (తేదీ: 22.07.2026) ఉత్తర్వులను రద్దు చేశారు. దీనివల్ల రాష్ట్ర ఖజానాపై ఆర్థిక భారం తగ్గనుంది. ఈ పథకాల ద్వారా గ్రామీణ కుటుంబాలు, పట్టణ స్థానిక సంస్థలు, పరిశ్రమలకు స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులోకి వస్తుంది. ప్రజారోగ్యం, పారిశుధ్యం మెరుగుపడటంతో పాటు పరిశ్రమల స్థాపనకు వీలు కలిగి కొత్త ఉద్యోగావకాశాలు ఏర్పడతాయి. తాగునీటి కోసం వెచ్చించే సమయం ఆదా కావడం వల్ల ప్రజల తలసరి ఆదాయం పెరుగుతుంది. సమాజంలో సత్సంబంధాలు బలపడతాయి.

చిత్తూరు జిల్లా గుండుపల్లె మండలం పోగురుపల్లె గ్రామంలో సర్వే నెం.196/1 తదితరాల్లో 8.65 ఎకరాల మేత భూమి (గ్రేజింగ్ గ్రౌండ్ పోరంబోకు)ను ఏపీ పంచాయతీరాజ్ చట్టం, 1994లోని సెక్షన్ 58(2) కింద ఉపసంహరించి, పారిశ్రామిక పార్క్ ఏర్పాటు కోసం ఆ భూమి వర్గీకరణను "గ్రేజింగ్ గ్రౌండ్ పోరంబోకు" నుంచి అసెస్డ్ వేస్ట్ డ్రైగా మార్చే విధంగా దానిని ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకునేందుకు చేసిన ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది.

రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, అత్యవసర స్పందన, వీఐపీ భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, మాదకద్రవ్యాల నిరోధక చర్యల కోసం పోలీస్ శాఖ ప్రస్తుతం దాదాపు 10,500 వాహనాలను వినియోగిస్తోంది. అయితే వాహనాలు పాతబడిపోవడం, నిరంతర వినియోగంలేని కారణంగా పెద్ద సంఖ్యలో నిరుపయోగంగా మారాయి. 2022 నుంచి ఇప్పటివరకు 2,556 వాహనాలను తుక్కుగా గుర్తించి పక్కన పెట్టగా, కేంద్ర రవాణా-జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ నిబంధనల ప్రకారం మరో ఐదేళ్లలో 4,281 వాహనాలు కాలం చెల్లనున్నాయి. ఈ కొరత పోలీస్ శాఖ పనితీరు, అత్యవసర సేవలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఈ సమస్యను అధిగమించడానికి ఆంధ్రప్రదేశ్ స్టేట్ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ ద్వారా కొత్తగా 4,760 పోలీసు వాహనాల కొనుగోలుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం మంగళగిరిలోని SBI-SME బ్రాంచి నుంచి రూ.324.20 కోట్ల టర్మ్ లోన్‌ను ప్రభుత్వ పూచీకత్తుతో సేకరించేందుకు, ప్రభుత్వం మంజూరు చేసే వాయిదాల ద్వారా ఆ రుణాన్ని తిరిగి చెల్లించే ప్రతిపాదనకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. సమావేశంలో రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ సంచాలకుడు కేఎస్ విశ్వనాథన్ పాల్గొన్నారు.






# రాష్ట్రంలో ఒక్క ఎకరం కూడా ఎండిపోకూడదు

**ఎల్‌నినో దృష్ట్యా రైతులు ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలి : మంత్రి మండలి సమావేశంలో సీఎం ఆదేశం**





అమరావతి (చైతన్యరథం): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర సచివాలయంలో గురువారం జరిగిన మంత్రిమండలి సమావేశంలో పలు అంశాలపై తీసుకున్న నిర్ణయాలను సమాచార, పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారధి మీడియాకు వివరించారు. అనంతరం ఆయన ఎల్‌నినో అంశంపై మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావాన్ని తగ్గించి ప్రజలకు తాగునీటికి ఇబ్బంది తలెత్తకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని, రైతులకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవడంతో పాటు ఆరుతడి పంటల సాగువైపు అన్నదాతలు దృష్టిసారించే విధంగా చైతన్యవంతులను చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారని వివరించారు. రాష్ట్రంలో ఒక్క ఎకరం కూడా పంట నష్టపోకూడదని, ఏ ఒక్క ఎకరంలో పంట కూడా ఎండిపోకూడదని మంత్రులు, అధికారులకు సీఎం స్పష్టం చేశారన్నారు. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో సాధారణ వర్షపాతం కంటే తక్కువ వర్షపాతం నమోదైందని, ఇప్పటి వరకు 52శాతం తక్కువ వర్షపాతం నమోదైందని మంత్రి పార్థసారథి వివరించారు. దేశంలోనే తక్కువ వర్షపాతం నమోదైన రాష్ట్రాల్లో మన రాష్ట్రం మొదటి రెండు స్థానాల్లో ఉందన్నారు. సాధారణ వర్షపాతం నమోదైతే ఈపాటికి దాదాపు 90 శాతం భూమి సాగులోకి వచ్చేదని, కాని ఈ ఏడాది ఇప్పటిదాకా కేవలం 60-65 శాతం మాత్రమే సాగులోకి వచ్చిందంటే పరిస్థితి తీవ్రతకు అద్దంపడుతోందన్నారు. రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ఎల్‌నినో ప్రభావాలను రైతులకు వివరిస్తూ, వారికి పంట మార్పిడిపై తగు సూచనలు, సలహాలు అందించాలని ముఖ్యమంత్రి ఆదేశించారన్నారు. ఆరుతడి పంటలవైపు రైతులు మొగ్గుచూపేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకోసం ప్రభుత్వం 90వేల కిలోల ఆరుతడి పంటల విత్తనాలను పంపిణీ కోసం సిద్ధం చేయాలని సీఎం ఆదేశించారన్నారు. విత్తనాల సబ్సిడి కోసం రూ.90 కోట్ల ఆర్థిక సాయానికి ముఖ్యమంత్రి ఆమోదం తెలిపారన్నారు.

పశు రక్షణలో భాగంగా పశుగ్రాసం కొరతను అధిగమించేందుకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారన్నారు. జీ రామ్ జీ భాగస్వామ్యంతో పశుగ్రాస పెంపకం చేపట్టేలా చర్యలు తీసుకోనున్నామన్నారు. ఉద్యాన పంటలను సైతం కోపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఉద్యాన పంటల సాగుకు నీటి సరఫరా ఎంతో అవసరమని, వాటిని కాపాడుకోవడానికి అవసరమైతే జీ రామ్ జీ పనుల ద్వారా సమీప చెరువుల నుంచి కాలువలు ద్వారా నీటిని తరలించడం లేదా బిందు సేద్యంపై అవగాహన పెంచి అందుకు అవసరమైన సహకారం అందించాలని ముఖ్యమంత్రి సూచించారన్నారు.

జిల్లాల్లో ఉన్న అగ్రికల్చర్ యూనిర్సిటీలు, కాలేజీల అధ్యాపకులతో రైతులకు తక్కువ నీటివనరులతో లాభదాయక పంటల సాగుపై అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. వరి సాగుకు ఎక్కువ పరిమాణంలో సాగునీరు అవసరం ఉంటుందని, కానీ ఎల్‌నినో ప్రభావంతో సాగునీరు అందని స్థితి నెలకొందన్న విషయాన్ని వరి సాగు రైతులకు స్పష్టంగా వివరించి ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు మళ్లించేలా చర్యలు తీసుకోవడం ద్వారా ఫలితం ఉంటుందన్నారు.

ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో తాగునీటి కష్టాలు తప్పేలా లేవని, రాష్ట్రవ్యాప్తంగా 14,829 హ్యాబిటేషన్లు ఉన్నాయి. నివాస ప్రాంతాల వారీగా ప్రపోజల్స్ సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారని మంత్రి పార్థసారథి తెలిపారు. ప్రజలందరికీ తాగునీరు సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని, ఇందుకోసం ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారని వివరించారు. అవకాశం ఉన్న ప్రాంతాల్లో బోర్లు వేయడం లేదా ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేయడం వంటి తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైతే ఇతర రాష్ట్రాల నుంచి ట్యాంకర్లను అద్దె ప్రాతిపదికన తీసుకురావాలన్న ఆలోచన చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావాన్ని వివరిస్తూ కేంద్రానికి లేఖలు రాయాలని, కేంద్రానికి ఎప్పటికప్పుడు పరిస్థితిని వివరిస్తూ ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంద న్నారు. వాతావరణ ఆధారిత భీమాను చేయడంలో మన రాష్ట్రం దేశంలోనే 6వ స్థానంలో ఉందని, కరువు నిధులు ఎక్కువగా రాష్ట్రానికి అందేలా కృషి చేస్తున్నామన్నారు. కేంద్రం, రాష్ట్ర, జీ రామ్ జీ నిధుల అనుసంధానంతో కరువు పరిస్థితులను గట్టేక్కాలే ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోందన్నారు.

తిరుపతి నుంచి ఎన్ఐఈఎల్ఐటీ (నేషనల్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) సంస్థను తరలించడం లేదని, కొందరు చేస్తున్న దుష్ప్రచారంలో వాస్తవం ఎంతమాత్రం లేదన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగాల్లో మన రాష్ట్రాన్ని మరింత బలోపేతం చేసే దిశగా అమరావతిలో క్వాంటం ఏఐ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నామని, మన రాష్ట్రంలో మూడు యూనివర్సిటీల ఏర్పాటుకు అనుమతి లభించిందని మంత్రి పార్థసారధి వివరించారు.

# కాణిపాకం బ్రహ్మోత్సవాలకు రండి

**ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్‌లకు ఆలయ కమిటీ ఆహ్వానం**





*అమరావతి (చైతన్యరథం): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 14 నుంచి అక్టోబరు 4 వ తేదీ వరకు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్‌లకు ఆలయ కమిటీ ఆహ్వానం పలికింది. పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, దేవదాయ శాఖ కమిషనరు రామచంద్రమోహన్, కాణిపాకం ఆలయ చైర్మన్ సురేంద్రబాబు గురువారం సచివాలయంలో సీఎంను కలిసి ఉత్సవాలకు రావాలని ఆహ్వానం పలికారు. చంద్రబాబుకు ఆలయ పండితులు వేదాశీర్వచనం పలికి స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్‌ను ఉండవల్లిలోని ఆయన నివాసంలో కలిసి ఆహ్వాన పత్రిక ఇచ్చారు. మంత్రికి ఆలయ పండితులు వేదాశీర్వచనం ఇచ్చి స్వామివారి ప్రసాదాలను అందజేశారు.*

## నిత్యావసరాల ధరల నియంత్రణకు

# మార్కెట్ ఇంటర్వెన్షన్ చర్యలు

- రూ.35కే కిలో ఉల్లిపాయలు అందించేందుకు నిర్ణయం
- 1.20 లక్షల మెట్రిక్ టన్నుల కందులు కేటాయించాలని కేంద్రానికి విజ్ఞప్తి
- పామాయిల్‌ను సబ్సిడీ ధరలకు అందించేలా చర్యలు
- 10వేల మెట్రిక్ టన్నుల కేఎన్ఎం రకం బియ్యం సేకరణకు ఆదేశం
- సామాన్యులపై ధరల భారం పడకుండా పటిష్ట చర్యలు చేపట్టాలి
- మంత్రివర్గ ఉప సంఘం సమావేశంలో నిర్ణయం





అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల నేపథ్యంలో వినియోగదారులపై భారం పడకుండా చేపట్టాల్సిన మార్కెట్ ఇంటర్వెన్షన్ చర్యలపై మంత్రివర్గ ఉప సంఘం గురువారం రాష్ట్ర సచివాలయంలో సమావేశమైంది. ఇందులో పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పాల్గొన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్న నేపథ్యంలో ఇప్పటికే అమలు చేస్తున్న బియ్యం మార్కెట్ ఇంటర్వెన్షన్ కార్యక్రమానికి అదనంగా ఉల్లిపాయలు, కందిపప్పు, పామాయిల్‌పై తక్షణం మార్కెట్ ఇంటర్వెన్షన్ చర్యలు చేపట్టాలని మంత్రివర్గ ఉప సంఘం నిర్ణయించింది. ధరల పెరుగుదల ప్రభావం సామాన్య ప్రజలపై పడకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించింది. రాష్ట్రవ్యాప్తంగా మార్కెట్ ఇంటర్వెన్షన్ చర్యలను సమర్థవంతంగా అమలు చేసేందుకు అవసరమైన కీలక నిత్యావసర వస్తువుల కేటాయింపుపై కేంద్ర ప్రభుత్వంతో పౌరసరఫరాల శాఖ నిరంతరం సమన్వయం చేసుకోవాలని మంత్రులు సూచించారు.

**కిలో ఉల్లిపాయలు రూ.35కే**

వినియోగదారులకు కిలో ఉల్లిపాయలను రూ.35కే అందించాలని మంత్రివర్గ ఉప సంఘం నిర్ణయించింది. ఇందుకు అవసరమైన ఉల్లిపాయల నిల్వలను రాష్ట్రానికి కేటాయించే అంశాన్ని చీజజఖీ దృష్టికి తీసుకెళ్లాలని సూచించింది. కేంద్రం నుంచి కేటాయించిన నిల్వలను రాష్ట్రవ్యాప్తంగా వినియోగదారులకు అందుబాటులోకి తీసుకురానున్నారు. 1.20 లక్షల మెట్రిక్ టన్నుల కందుల కేటాయింపునకు విజ్ఞప్తి చేస్తూ కందిపప్పు ధరల నియంత్రణకు కూడా మార్కెట్ ఇంటర్వెన్షన్ చేపట్టాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా 1.20 లక్షల మెట్రిక్ టన్నుల కందులను రాష్ట్రానికి కేటాయించాలని కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖను కోరారు. వాటిని ప్రాసెసింగ్ చేసి రైతుబజార్లు, ప్రత్యేక కౌంటర్ల ద్వారా సరసమైన ధరలకు కందిపప్పుగా వినియోగదారులకు అందించేందుకు చర్యలు చేపట్టాలని నిర్ణయించారు.

**పామాయిల్‌ను సబ్సిడీ ధరలకు అందించేలా చర్యలు**

పామాయిల్ ధరల పెరుగుదలను నియంత్రించేందుకు తక్షణ మార్కెట్ ఇంటర్వెన్షన్ చేపట్టాలని మంత్రివర్గ ఉప సంఘం నిర్ణయించింది. చీజజఖీ ద్వారా పామాయిల్ సేకరించే అవకాశాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించింది. చీజజఖీతో సమన్వయం చేసుకుని అవసరమైన పామాయిల్‌ను సమకూర్చి వినియోగదారులకు సబ్సిడీ ధరలకు అందించేలా చర్యలు చేపట్టాలని సూచించింది.

**651 ప్రత్యేక కౌంటర్ల ద్వారా బియ్యం విక్రయాలు**

బియ్యం ధరల పెరుగుదలను కట్టడి చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 651 ప్రత్యేక కౌంటర్లు, రైతు బజార్ల ద్వారా మార్కెట్ ఇంటర్వెన్షన్ కార్యక్రమం అమలు చేస్తున్నారు. ఇప్పటివరకు సుమారు 10,163 క్వింటాళ్ల బియ్యాన్ని విక్రయించగా... దాదాపు లక్ష మంది వినియోగదారులు ప్రయోజనం పొందారు. వినియోగదారులు ఎక్కువగా ఇష్టపడే కేఎన్ఎం రకం బియ్యాన్ని నెల్లూరు జిల్లాలోని రైస్‌మిల్లర్ల నుంచి 10వేల మెట్రిక్ టన్నులు సేకరించాలని మంత్రివర్గ ఉప సంఘం అధికారులను ఆదేశించింది. ఈ బియ్యాన్ని ప్రత్యేక కౌంటర్ల ద్వారా సరసమైన ధరకు విక్రయించడం ద్వారా పెద్ద మొత్తంలో బియ్యాన్ని బహిరంగ మార్కెట్‌లో అందుబాటులోకి తీసుకురావడంతో పాటు వినియోగదారులకు ధరల భారం నుంచి ఉపశమనం కల్పించాలని నిర్ణయించింది. ఉల్లిపాయలు, కందిపప్పు, పామాయిల్, బియ్యం సహా నిత్యావసర వస్తువుల ధరలు, నిల్వలు, సరఫరాను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, కృత్రిమ కొరతకు అవకాశం లేకుండా సంబంధిత శాఖలన్నీ సమన్వయంతో పనిచేయాలని మంత్రివర్గ ఉప సంఘం స్పష్టం చేసింది. సామాన్య ప్రజలకు నిత్యావసరాలు అందుబాటు ధరల్లో లభించేలా అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించింది. సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# స్థానిక సమరానికి ఎన్డీఏ 'సమన్వయ' వ్యూహం

అమరావతి (చైతన్యరథం): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను పురస్కరించుకుని గురువారం జరిగిన ఎన్డీఏ సమన్వయ కమిటీ ప్రతినిధుల సమావేశం అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. ఇందులో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, మంత్రి సత్యకుమార్, జనసేన ముఖ్య నేత నాదెండ్ల మనోహర్, మంత్రి నిమ్మల రామానాయుడు పాల్గొన్నారు. ఎన్నికల సన్నద్ధత, భాగస్వామ్య పార్టీల మధ్య సమన్వయం, క్షేత్రస్థాయిలో కూటమి బలోపేతం వంటి ప్రధాన అంశాలపై నేతలు ఈ భేటీలో విస్తృతంగా చర్చించారు. స్థానిక పోరులో ఎన్డీఏ అభ్యర్థులను ఘన విజయం వైపు నడిపించేందుకు అవసరమైన పక్కా కార్యాచరణను నేతలు రూపొందించారు. క్షేత్రస్థాయిలో నాయకులు, శ్రేణుల మధ్య సంపూర్ణ సమన్వయం ఉండాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా గ్రామ, మండల స్థాయిల్లో కూటమి భాగస్వామ్యపక్షాలు ఐక్యంగా పనిచేస్తూ వ్యూహాత్మకంగా ముందుకు సాగాలని నిర్ణయించారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు విస్తృతంగా వివరించాలని నేతలు పిలుపునిచ్చారు. స్థానిక ప్రజా సమస్యలను పసిగట్టి, వాటి తక్షణ పరిష్కారానికి చొరవ చూపుతూ ప్రజల్లో మమేకం కావాలని సూచించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను ఒక యజ్ఞంలా భావించి, భాగస్వామ్య పార్టీల మధ్య ఐక్యతను మరింత పటిష్టం చేసుకుంటూ క్లీన్ స్వీప్ చేయడమే లక్ష్యంగా శ్రేణులు పనిచేయాలని నేతలు స్పష్టం చేశారు.



చైతన్యరథం

# అక్షర ఆంధ్రకు అద్భుత ఫలితాలు

- మంత్రి నారా లోకేష్ సమర్థతకు నిదర్శనం
- రెండేళ్లలో అక్షరాస్యత 82.1 శాతానికి పెరుగుదల
- 25 లక్షల మందికి అక్షర జ్ఞానం అభినందనీయం
- మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ప్రశంసలు






అమరావతి(చైతన్యరథం): రాష్ట్రంలో ప్రతి పౌరుడికి అక్షర జ్ఞానం అందించాలనే సంకల్పంతో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో చేపట్టిన అక్షర ఆంధ్ర కార్యక్రమం అద్భుత ఫలితాలను సాధిస్తోందని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. ప్రతి ఇంటా అక్షరం, ప్రతి చేతిలో జ్ఞానం ప్రతి పౌరుడి జీవితంలో వెలుగు అనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం చేస్తున్న కృషి ద్వారా ఆంధ్రప్రదేశ్‌ను సంపూర్ణ అక్షరాస్యత కలిగిన రాష్ట్రం గా నిలబెట్టడమే తమ ప్రభుత్వ సంకల్పమని స్పష్టం చేశారు. ఒక రాష్ట్ర అభివృద్ధికి భవనాలు, మౌలికవసతులు మాత్రమే కొలమా నం కాదు..సామాన్య పౌరుడి చేతిలో ఉన్న అక్షరమే నిజమైన అభివృద్ధికి కొలమానమని వివరించారు. గత రెండేళ్లలో రాష్ట్ర అక్షరాస్యత రేటు 72.6 శాతం నుంచి 82.1 శాతానికి పెరగడం, జాతీయ సగటు 80.9 శాతాన్ని అధిగమించడం రాష్ట్ర విద్యా రంగంలో సాధించిన గణనీయమైన పురోగతికి నిదర్శనమని పేర్కొన్నారు. అక్షర ఆంధ్ర కార్యక్రమం ద్వారా 11 ప్రభుత్వ శాఖలను సమన్వయం చేసి కేవలం రెండేళ్లలోనే 25 లక్షల మందికి అక్షర జ్ఞానం అందించడం అభినందనీయమన్నారు. విద్యా రంగంలో ప్రచారానికి కాకుండా క్షేత్రస్థాయిలో ఫలితాలకు ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వం ముందుకుసాగుతోందని తెలిపారు. పాఠశాల విద్యలో కూడా అనేక సానుకూల మార్పులు చోటు చేసుకున్నాయని వివరించారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల హాజరు 98.97 శాతానికి, విద్యార్థుల హాజరు 85.41 శాతానికి పెరగడంపై హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థి వరుసగా మూడు రోజులు పాఠశాలకు గైర్హాజరైతే ఉపాధ్యాయులు తల్లిదండ్రులను సంప్రదించి కౌన్సెలింగ్ ఇచ్చే విధానం విద్యార్థుల డ్రాప్‌అవుట్‌ను తగ్గించేందుకు దోహదపడుతుందని చెప్పారు.

### ఆటిజం పిల్లలకు 125 ప్రత్యేక కేంద్రాలు

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యారంగంలో విస్తృతంగా వినియోగిస్తూ ఏఐ ద్వారా ఉపాధ్యాయులకు కృత్రిమ మేధపై శిక్షణ అందించడం అభినందనీయం. ఆటిజం ఉన్న పిల్లల కోసం రాష్ట్రవ్యాప్తంగా 125 ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేయడం ద్వారా సమ్మిళిత విద్యకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలి పారు. రాబోయే రోజుల్లో కూడా అక్షర ఆంధ్ర కార్యక్రమాన్ని మరింత వేగంగా ముందుకు తీసుకెళ్లేందుకు స్పష్టమైన కార్యాచ రణ ప్రణాళిక సిద్ధం చేశారని తెలిపారు. 2027 మార్చి నాటికి మరో 25 లక్షల మందిని, సెప్టెంబర్ 2027 నాటికి మరో 27 లక్షల మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దడం ద్వారా మొత్తం 52 లక్షల మందికి అక్షర జ్ఞానం అందించాలనే లక్ష్యం ఎంతో గొప్ప దని ప్రశంసించారు. సెప్టెంబర్ 2027 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను 100 శాతం సంపూర్ణ అక్షరాస్యత కలిగిన రాష్ట్రంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకుసాగుతోందని తెలిపారు. మంత్రు లు, ప్రజాప్రతినిధులు, కలెక్టర్లు, ప్రజాసంఘాలు, స్వచ్ఛంద సంస్థ లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు ఇలా సమాజం లోని అన్ని వర్గాలను భాగస్వాములను చేస్తూ సాగుతున్న ఈ అక్షర ఆంధ్ర అక్షర యజ్ఞం దేశానికే ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.

# ఎంపీ మాగుంట వ్యాఖ్యల్లో తప్పేముంది

- జగన్‌రెడ్డి నిజస్వరూపాన్ని బయటపెట్టారు
- అందుకే ఆయనపై వ్యక్తిగతంగా దాడులు
- వెలిగొండ పనుల పేరుతో దోచుకున్నారు
- జాతికి అంకితమంటూ మోసగించారు
- సిడాప్ చైర్మన్ దీపక్‌రెడ్డి ఆగ్రహం



మంగళగిరి(చైతన్యరథం): జగన్‌రెడ్డి నిజస్వరూపం బయట పడుతుందనే భయంతోనే ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి చేసిన వ్యాఖ్యలపై వైసీపీ నాయకులు వ్యక్తిగత దాడులకు దిగుతున్నారని సిడాప్ చైర్మన్ దీపక్‌రెడ్డి మండిపడ్డారు. గురువా రం టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వ హించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంపీ మాగుంట అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా ఆయ నను విమర్శించడం గొడ్డలిపార్టీ రాజకీయ బలహీనతకు నిదర్శనం. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న మాగుంటవంటి సీనియర్ నాయకుడిని గౌరవించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరికీ ఉంది. వెలిగొండ ప్రాజెక్టు విషయంలో జగన్‌కు ఇనాగరేషన్.. చంద్ర బాబుకు ఇంప్లిమెంటేషన్.జగన్‌కు పబ్లిసిటీ అయితే.. చంద్రబాబుకు ప్రొడక్టివిటీ. జగన్ ప్రభుత్వం ఐదేళ్ల అధికారంలో ఉండి ఎన్నికల ముందు శిలాఫలకం వేసి ప్రాజెక్టును జాతికి అంకితం చేశామని ప్రజలను మోసంచేసింది. కానీ ప్రాజెక్టులో కీలకమైన పనులు పెండింగ్‌లో ఉండగా ఏ విధంగా ప్రాజెక్టును పూర్తి చేశామని చెబుతారని మంత్రి నిమ్మల రామానాయుడు ప్రశ్నించారు. ఈ ప్రశ్నకు వైసీపీ సమాధానం చెప్పలేకపోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చంద్రబాబు, మంత్రి నిమ్మల రామానాయుడు వెలిగొండ పనులను వేగ వంతం చేసి పెండింగ్ పనులు, నిర్వా సితుల సమస్యల పరిష్కరించారు. మూడు దశాబ్దాలుగా ప్రకాశం జిల్లా ప్రజలు ఎదురుచూస్తున్న వెలిగొండ కలను సాకారం చేశాం. ఎంపీ మాగుంట కుటుంబంపై వైసీపీ చేస్తున్న ప్రచారం కూడా రాజకీయ దుష్ప్రచారమే.మాగుంట కుటుంబానికి వైఎస్ఆర్ ముఖ్యమంత్రి కాక ముందే రాజకీయ నేపథ్యం ఉంది. ఐదుసార్లు ఎంపీగా ప్రజలకు ప్రాతినిధ్యం వహించిన మాగుంటను వ్యక్తిగతంగా దూషించడం జగన్ దిగజారుడు రాజ కీయాలకు నిదర్శనమని ధ్వజమెత్తారు.

### గత ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలు నష్టపోయారు

రెడ్డి సామాజికవర్గాన్ని జగన్ రాజకీ యంగా ఉపయోగించుకున్నారనే మాగుంట వ్యాఖ్యలను కూడా ఆ వర్గం ఆలోచించాలి. జగన్‌కు అండగా నిలిచిన రైతులు, కాంట్రాక్టర్లు, వ్యాపారులు, ప్రజా ప్రతినిధులకు ఆయన పాలనలో ఎంత న్యాయం జరిగిందో ప్రశ్నించుకోవాలి. రెడ్లు మాత్రమే కాదు.. బీసీలు, ఎస్సీలు, ఎస్టీ లు, మైనారిటీలు సహా అన్ని వర్గాల ప్రజలు గత పాలనలో మోస పోయారు. 2024 ఎన్నికల్లో వైసీపీ 11 స్థానాలకు పరిమితం కావడం ప్రజల తీర్పుకు నిదర్శనం. రూ.10వేల కోట్లు వెలిగొండ ప్రాజెక్టుకు ఖర్చు అయితే జగన్ పెట్టింది రూ.841కోట్లు పెట్టారు. అంటే 8 శాతం పనులు చేసి వెలిగొండ పూర్తి చేశానని తప్పుడు సమాచారం ఇస్తూ ప్రజలను మోసం చేస్తున్నారు. కాలువలను తవ్వేసి సొమ్ము చేసుకున్నారు. డబ్బులు ఎక్కడ మిగులు తాయో ఆ పనులు మాత్రమే చేసి వెలిగొండ పనుల పేరుతో దోచుకు న్నారు. లైనింగ్ పనులు చేయలేదు. నిర్వా సితులకు పరి హారం ఇవ్వలేదు. టీబీఎం మిషన్ తొలగించలేదు.మిగతా ఏ పనులు చేయకుండా సాక్షిలో వెలిగొండ మాక్రెడిట్ అంటూ తప్పుడు ప్రచారాలు చేసుకుంటు న్నారని మండిపడ్డారు.

### వెలిగొండ కలను చంద్రబాబు సాకారం చేశారు

రూ.3,400 కోట్ల ఖర్చు చేసి చంద్ర బాబు నీళ్లు ఇచ్చారు. 30ఏళ్ల కళను చంద్రబాబు సాకారం చేశారు. ఆనందం తో ఎమ్మెల్యేలు,ప్రజలు నృత్యాలు చేశారు. చంద్రబాబు ప్రభుత్వంమాత్రమే వెలిగొండ పూర్తి చేసింది. ప్రకాశం జిల్లాలో వైసీపీకి మనుగడ లేదు. అందుకే మాగుంటపై దిగజారి మాట్లాడుతున్నారు. దేశంలోనే దిగజారుడు రాజకీయాలకు జగన్ నిదర్శ నం. ఐదు సార్లు ఎంపీగా గెలిచి ప్రజల మన్ననలు పొందిన మాగుంటపై తిట్లతో రాజకీయం చేయడం ఎంతవరకు కరెక్ట్. ఎంపీనే కాదు ఆయన వయసుకైనా గౌవరం ఇవ్వాలని గొడ్డలి పార్టీకి అనిపించడం లేదు. ఇటువంటి వాళ్లని రాజకీయాల్లో ఉండే అర్హతే లేదు.. ఆ పార్టీనే పూర్తిగా రాజకీయాల నుంచి తరిమికొట్టాలని పిలుపు నిచ్చారు.

# జగన్‌రెడ్డికి క్రెడిట్ చోరీ జబ్బు ముదిరింది

**స్త్రీశిశు సంక్షేమ మంత్రి గుమ్మడి సంధ్యారాణి**



అమరావతి(చైతన్యరథం): జగన్‌కు ఇతరుల పనులకు క్రెడిట్ తీసుకునే జబ్బు ముదిరిందని మంత్రి గుమ్మడి సంధ్యారాణి వ్యాఖ్యానించారు. ఈ వ్యాధికి వైద్యం చేసే డాక్టర్ కూడా లేరు.. తొలి బాధితుడు జగన్‌రెడ్డేనని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ప్రభుత్వం ఏ కార్యక్రమం చేపట్టినా ఉదయం అవి నీతి అంటూ ఆరోపణలు.. అదే పనిని సాయంత్రానికి తన ఘనతగా ప్రచారం చేసుకోవడం వారికి అలవాటుగా మారిందని మండిపడ్డారు. ముందుగా ఆయన మాట్లాడే తీరు మార్చుకోవాలి.. లేదంటే మందుల మోతాదు పెంచు కోవాలని సూచించారు. వెలిగొండ ప్రాజెక్టు, అల్లూరి సీతారామరాజు విమానాశ్రయం, గూగుల్ ప్రాజెక్టు ఇలా అన్నింటినీ తన ఖాతాలో వేసు కుంటూ ప్రతీ అభివృద్ధి కార్యక్రమం తన వల్లే జరిగిందన్నట్లు చెప్పు కుంటుంటే ప్రజలు నవ్వుకుంటున్నారని తెలిపారు. జగన్ హయాంలో ప్రభుత్వ ఆస్తులను కొల్లగొట్టడం, తాకట్టు పెట్టడం, ధ్వంసం చేయడమే ఘనత. జగన్ చెప్పుకునే ఇలాంటి ఘనతలు కూటమి ప్రభుత్వానికి ఏమాత్రం అవసరం లేదు. బాధ్యతారహిత వ్యాఖ్య లతో రాష్ట్ర ప్రతిష్ఠ దెబ్బతింటోందనే ఆవేదన ఉందని తెలిపారు.

# పోలవరం కాలువలో లీకేజీలు దుష్ప్రచారమే

**పనులన్నీ నాణ్యతతో జరిగాయి**

**ఇరిగేషన్ శాఖ ఇంజనీర్ వివరణ**

అమరావతి(చైతన్యరథం): ముఖ్య మంత్రి చంద్రబాబు ప్రతిష్టాత్మకంగా చేపట్టి పూర్తిచేసి నీటిని విడుదల చేసిన పోలవరం ఎడమ ప్రధాన కాలువలో కొన్ని చోట్ల లీకేజీ ఉందనే ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని.. అదంతా దుష్ప్రచారమేనని ఇరిగేషన్‌శాఖ ఇంజి నీరింగ్ ఇన్ చీఫ్ కొట్టిపడేశారు. పోల వరం ఎడమ ప్రధాన కాలువ పనులన్నీ నాణ్యతతో పూర్తి చేసినట్లు వివరణ ఇచ్చారు. ఇటీవల పూర్తయిన కాంక్రీట్ ఆక్విడెక్ట్ వద్ద నిర్వహిస్తున్న గ్రౌటింగ్ పనులపై ఇలా తప్పుడు ప్రచారం చేయ డం కరెక్టు కాదని తెలిపారు. కొత్తగా నిర్మించిన కాంక్రీట్ ఆక్విడెక్ట్‌లలో అంచులు, జాయింట్ల వద్ద నీటి సీపేజ్ (లీకేజీ) కనిపించే అవకాశాలను పరి శీలించిన తర్వాత సాధారణంగా గ్రౌటింగ్ పనులు చేపడతారని పేర్కొ న్నారు. ట్రయల్ రన్ అనంతరం జాయి ంట్లలో ఉండే గాలి ఖాళీలను పూర్తిగా మూసివేసేందుకు గ్రౌటింగ్ నిర్వహిస్తా రని తెలిపారు. ప్రస్తుతం నిర్వహిస్తున్నది ఆక్విడెక్ట్‌కు తొలి ట్రయల్ రన్‌తోపాటు తుది పరీక్ష కూడా కావడంతో ఇంజి నీర్లు గ్రౌటింగ్ పనులను పూర్తి చేసే దిశగా పనిచేస్తున్నారని వెల్లడించారు. దాని ద్వారా భారీ పరిమాణంలో నీరు ప్రవహించే కారణం గా నీటి ప్రవాహం అనంతరం మాత్రమే జాయింట్ల పరి స్థితిని పూర్తిగా అంచనా వేసి తుది గ్రౌటింగ్ పనులు నిర్వహించడం సాధారణ ప్రక్రియ అని వివరించారు.

# లాజిస్టిక్స్, ఏవియేషన్ రంగాల్లో పెట్టుబడులు

- రాష్ట్రంలో రూ.300 కోట్లతో శ్రీక్షేత్ర ప్రతిపాదనలు
- భోగాపురం, కర్నూలు, విజయవాడ విమానాశ్రయాల్లో ఎంఆర్‌వో కేంద్రాలకు మెల్‌స్టార్ ఏవియేషన్ ఆసక్తి
- ప్రభుత్వం సహకరిస్తుందని మంత్రి జనార్దన్‌రెడ్డి హామీ
- పూర్తిస్థాయి ప్రతిపాదనలతో ముందుకురావాలని సూచన



అమరావతి(చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్‌లో లాజిస్టిక్స్, ఏవియేషన్ రంగాల్లో పెట్టుబడులకు ప్రముఖ సంస్థలు ఆసక్తి చూపుతున్నాయని రాష్ట్ర పెట్టుబడులు, మౌలిక సదుపాయాలశాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి తెలిపారు. సచివాలయంలోని తన శాఖ కార్యాలయంలో గురువారం శ్రీక్షేత్ర లాజిస్టిక్స్ సంస్థ డైరెక్టర్ వివేక్ అగర్వాల్, ప్రతినిధుల బృందం మంత్రిని కలిసి రాష్ట్రంలో పెట్టు బడుల అవకాశాలపై చర్చించింది. రాష్ట్రంలోని వివిధ పోర్టుల్లో సరుకు నిర్వహణను మరింత సమర్ధవంతంగా నిర్వహించేందుకు, రైల్వే లింక్డ్ మల్టీ మోడల్ లాజిస్టిక్స్ హబ్‌లను అభివృద్ధి చేసేందుకు ఆసక్తి వ్యక్తం చేశారు. సుమారు 30 ఏళ్ల అనుభవం, రూ.1,500 కోట్ల టర్నోవర్ కలిగిన శ్రీక్షేత్ర లాజిస్టిక్స్ సంస్థ సుమారు రూ.300 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపిందని మంత్రి జనార్దన్‌రెడ్డి తెలిపారు. పూర్తి స్థాయి ప్రతిపాదనలతో ముందుకు వస్తే ప్రభుత్వం తరపున అవసరమైన అన్ని విధాల సహకారం అందిస్తామని సంస్థ ప్రతినిధులకు హామీ ఇచ్చారు. రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, గుజరాత్ రాష్ట్రాల్లో లాజిస్టిక్స్ రంగంలో ఆ సంస్థ సేవలందిస్తోంది. ఏపీలో పోర్టులు, రైల్వే కనెక్టివిటీ, మల్టీ మోడల్ లాజిస్టిక్స్ హబ్‌ల అభివృద్ధికి అవకాశాలను పరిశీలిస్తోంది. కాగా లాజిస్టిక్స్ రవాణా ఖర్చులను తగ్గించడం తో పాటు రాష్ట్రంలో రవాణా, మౌలికవసతులు, లాజిస్టిక్స్ రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏపీ లాజిస్టిక్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్‌పై సంస్థ ప్రతినిధులు ప్రశంసల వర్షం కురిపించారు. పెట్టుబడుల ఆకర్షణ కు కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న విధానపరమైన నిర్ణయాలు, అందిస్తున్న ప్రోత్సాహకాలను అభినందించారు.

### ఏపీలో ఏవియేషన్ రంగానికి భారీ అవకాశాలు

అదేవిధంగా మెల్‌స్టార్ ఏవియేషన్ సంస్థ డైరెక్టర్ తరుణ్ కశ్యప్ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని కలిసి రాష్ట్రంలో ఏవియేషన్ రంగంలో పెట్టుబడుల అవకాశాలపై చర్చించారు. కర్నూలు విమానాశ్రయంలో ఏర్పాటు చేస్తున్న మెల్‌స్టార్ ఏవియేషన్ లెర్నింగ్ అకాడమీలో పైలట్ శిక్షణ కేంద్రం పురోగతిని సంస్థ ప్రతినిధులు వివరించారు. ఈ శిక్షణ కేంద్రానికి విద్యార్థుల నుంచి మంచి స్పందన లభిస్తోందని తెలిపారు. విజయవాడ విమానాశ్ర యంలో ఎయిర్ క్రాఫ్ట్ మెయింటెనెన్స్ ఇంజనీరింగ్ శిక్షణ కార్యక్రమాలను ఏర్పాటు చేసేందుకు సంస్థ ఆసక్తి వ్యక్తం చేసింది. అంతేకాకుండా భోగాపురం, కర్నూలు, విజయవాడ విమానాశ్ర యాల్లో పూర్తిస్థాయి మెయింటెనెన్స్, రిపేర్ అండ్ ఓవరాల్ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చింది. రాష్ట్రంలో ఏవియేషన్ రంగం వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో విమానాశ్రయాల విస్తరణతో పాటు ఎంఆర్ఓ, ఏఎంఈ, పైలట్ శిక్షణ వంటి అనుబంధ రంగాల్లో భారీ ఉపాధి అవకాశాలు ఏర్పడతాయని మంత్రి తెలిపారు. ముఖ్యంగా స్థానిక యువతకు నైపుణ్య శిక్షణతో పాటు విమానయాన రంగంలో పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు లభించే అవకాశం ఉందని చెప్పారు. పూర్తి స్థాయి ప్రతిపాదనలతో ముందుకురావాలని మెల్‌స్టార్ ఏవియేషన్ ప్రతినిధులను కోరారు. ఆంధ్రప్రదేశ్‌లో ఏవియేషన్ రంగ అభివృద్ధికి, అవసరమైన మౌలికవసతుల కల్పనకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని స్పష్టం చేశారు.

# విద్యుత్ సరఫరాకు ప్లాంట్లను సిద్ధం చేయాలి

- ఎల్‌నినో ప్రభావంతో వినియోగం బాగా పెరిగింది
- థర్మల్, హైడల్ కేంద్రాల్లో అప్రమత్తంగా ఉండాలి
- ఉత్పత్తికి ఇబ్బంది లేకుండా బొగ్గు నిల్వలు తప్పనిసరి
- విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్



అమరావతి(చైతన్యరథం): ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరుగుతున్న నేపథ్యంలో దాని కి అనుగుణంగా ఉత్పత్తి, సరఫరా వ్యవస్థలను పూర్తి స్థాయిలో సన్నద్ధం చేయాలని ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధికారులను ఆదేశించారు. సచివాలయంలో విద్యుత్‌శాఖ అధి కారులతో గురువారం నిర్వహించిన సమీక్షలో ప్రస్తుత డిమాండ్, ఉత్పత్తి సామర్థ్యం, ప్లాంట్ల పనితీరు, భవిష్యత్తు అవసరాలపై మంత్రి చర్చించారు. ఎల్‌నినో ప్రభావంతో ఉష్ణోగ్రతలు పెరగడం, ఫలితంగా గృహ, వాణిజ్య, వ్యాపార, పారిశ్రామికరంగాల్లో విద్యుత్ వినియోగం పెరుగుతున్న విషయాన్ని ప్రస్తావించారు. గతంలో రోజుకు సగటున 218 మిలియన్ యూనిట్లుగా ఉన్న విద్యుత్ వినియోగం ప్రస్తుతం 275 మిలియన్ యూనిట్లకు పైగా చేరిన నేపథ్యంలో పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా ఉత్పత్తి ప్లాంట్లు సిద్ధంగా ఉంచాలని సూచించారు. అన్ని రంగాల విద్యుత్ అవసరాలను పరిగణనలోకి తీసుకుని సరఫరా ప్రణాళికలను రూపొందించాలని ఆదేశించారు. అంతరాయాలకు అవకాశం లేకుండా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా జరిగేలా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు.డిమాండ్ పెరిగే సమయాల్లో ఎక్కడా సరఫరా సమస్యలు తలెత్తకుండా ఉత్పత్తి, పంపిణీ, సరఫరా వ్యవస్థలను సమన్వయంతో నిర్వహించాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు.

### విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో సాంకేతిక లోపాలకు తావివ్వొద్దు

థర్మల్, హైడల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు. పెరిగిన డిమాండ్‌కు అనుగుణంగా తగినంత విద్యుత్ అందుబాటులో ఉండాలంటే ఉత్పత్తి ప్లాంట్లలో సాంకేతిక లోపాలు తలెత్తకుండా ముందస్తు నిర్వహణ చేపట్టాలని సూచించారు. అవసరమైన మరమ్మతులు, నిర్వహణ పనులను సకాలంలో పూర్తి చేసి ఉత్పత్తి కేంద్రాల కార్యాచరణ సామర్థ్యాన్ని పెంచాలని స్పష్టం చేశారు. అదే విధంగా థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలకు బొగ్గు సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రతి ఉత్పత్తి ప్లాంట్‌లో కనీసం 15 రోజులకు సరిపడా బొగ్గు నిల్వలు అందుబాటులో ఉండేలా నిరంతరం పర్యవేక్షించాల న్నారు. బొగ్గు సరఫరా, నిల్వలు, వినియోగంపై అధికారులు ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహించాలని సూచించారు.

### భవిష్యత్తు అవసరాలకు పునరుత్పాదక విద్యుత్

ప్రస్తుత డిమాండ్‌ను తీర్చడంతో పాటు రాష్ట్ర భవిష్యత్తు విద్యుత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తిని మరింత పెంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సౌర, ఇతర పునరుత్పాదక ఇంధన వనరుల ద్వారా విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచేందుకు అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేయాలని ఆదేశించారు. అదే విధంగా పీఎం సూర్యఘర్ పథకాన్ని మరింత ఎక్కువ మంది వినియోగించుకునేలా చూడాల న్నారు. ఈ సమీక్షలో జెన్‌కో ఎండీ ఎస్.నాగలక్ష్మి, ట్రాన్స్ కో జేఎండీ సూర్యసాయి ప్రవీణ్ చంద్, పలువురు ఇంధన శాఖ అధికారులు పాల్గొన్నారు.

# టీటీడీ డిప్యూటీ ఈవో లోకనాథం అరెస్ట్

తిరుపతి(చైతన్యరథం): టీటీడీ డిప్యూటీ ఈవో లోకనాథంను ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు. ఆదాయానికి మించి ఆస్తుల కేసులో లోకనాథంను గురువారం ఉదయం అధికారులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఏసీబీ కార్యాలయానికి తరలించారు.

బుధవారం లోకనాథం నివాసంలో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించిన విషయం తెలిసిందే. లోకనాథం నివాసంతో పాటు బంధువుల ఇళ్లలోనూ తనిఖీలు నిర్వహించారు. తిరుపతి డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఐదు బృందాలుగా ఏర్పడి సోదాలు చేపట్టారు. ఈ దాడుల్లో సుమారు రూ.5 కోట్ల విలువైన అక్రమ ఆస్తులను ఏసీబీ గుర్తించింది. 2 కిలోల బంగారం, 6.5 కిలోల వెండి, రూ.12.50 లక్షల నగదు లభ్యమైంది.

భార్య, కుమారుడి పేర్లతో ఇళ్లు, స్థలాలు ఉన్నట్లు ఏసీబీ గుర్తిం చింది. నిన్న ఉదయం నుంచి చేపట్టిన సోదాలు ముగియడంతో ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు.

# ఇంటింటికీ తెలుగుదేశం-99.85 లక్షలు



- 39వ రోజూ విజయవంతంగా కార్యక్రమం
- నేటితో కోటి మార్కును చేరుకోనున్న శ్రేణులు

అమరావతి(చైతన్యరథం): కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించడంతోపాటు వారి సమస్యలు, అభిప్రాయాలను నేరుగా తెలుసుకునేందుకు తెలుగుదేశం పార్టీ నిర్వహిస్తున్న "ఇంటింటికీ తెలుగుదేశం - 2026" కార్యక్రమం 39వ రోజూ విజయవంతంగా కొనసాగింది. రాష్ట్ర వ్యాప్తంగా గురువారం 1,32,987 లక్షల ఇళ్లను టీడీపీ నాయకులు, కార్యకర్తలు సందర్శించడంతో మొత్తం సందర్శనలు 99.85 లక్షలకు చేరుకున్నాయి.దీంతో కార్యక్రమం కోటి ఇళ్ల మైలురాయికి చేరువైంది.ఇంటింటి పర్యటనల్లో కూటమిప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల వివరాలను ప్రజలకు వివరిస్తున్నారు. అదే సమయంలో ఆయా కుటుంబాల సమస్యలు, స్థానిక అవసరాలు, ప్రభుత్వ పథకాలపై వారి అభిప్రాయాలను తెలుసుకుంటున్నారు. ప్రజల నుంచి వచ్చే సూచనలు, సమస్యలను సంబంధిత ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లేలా పార్టీ శ్రేణులు పనిచేస్తున్నాయి. ప్రజలతో నేరుగా మమేకమవుతూ ప్రభుత్వం -ప్రజల మధ్య వారధిగా 'ఇంటింటికీ తెలుగుదేశం-2026' కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు.

# నేపాల్‌లో ప్రవాసీయుడి గల్లంతు

అమరావతి(చైతన్యరథం): కైలాస మానస సరోవర యాత్రకు వెళ్లి నేపాల్ జలప్రళయంలో గల్లంతైన తమ ఆత్మీయుల ఆచూకీ కోసం వారం రోజులుగా ఎదురు చూస్తున్న కుటుంబాల ఆశలు సన్నగిల్లుతున్నాయి. గుర్తుపట్టలేని స్థితిలో లభ్యమైన అనేక మృతదేహాలకు భారతీయ అధికారులు నేపాల్ విదేశీ వ్యవహారాల శాఖ సహాయంతో డీఎన్ఏ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇందుకు సంబంధించిన నమూనలను సేకరించి పంపిస్తున్నారు. ఈ క్రమంలో ఖతర్‌లో పని చేస్తూ సరోవర యాత్రకు వెళ్లిన కృష్ణా జిల్లా పెనమలూరు మండలానికి చెందిన చొప్పరపు రమేశ్‌బాబు కుటుంబం కూడా ఆశలు వదులు కోగా, ఖతర్‌లోని అతని మిత్రులు కూడా నిరాశ చెందుతున్నారు. రమేష్‌బాబు ఫోన్ చేయకపోవడంతో అతని గురించి ఎలాంటి సమాచారం లభించలేదు. రమేశ్ బాబు పిల్లలు సాయి అఖిల్, అలేఖ్యల డీఎన్ఏ నమూనాలను అధికారులు సిద్ధం చేసి నేపాల్‌లోని అధికారులకు పంపిస్తున్నారు.

# వైసీపీ నాయకుల కబ్జా పర్వంపై ఫిర్యాదులు

- బతుకుదెరువు కోసం వలస వెళితే ఆక్రమణ
- తప్పుడు పత్రాలతో తండ్రి ఆస్తి కాజేసిన సవతి తల్లి
- వృద్ధాప్యాన్ని ఆసరాగా చేసుకుని భూ కబ్జా యత్నం
- ప్రజావినతుల్లో న్యాయం చేయాలని బాధితుల గోడు
- అర్జీలు స్వీకరించిన మండలి చీఫ్ విప్ అనూరాధ,
- ఏపీ వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి



మంగళగిరి(చైతన్యరథం): టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం ప్రజావినతుల స్వీకరణ కార్యక్రమంలో సమస్యలపై బాధితులు గోడు వెళ్లబోసుకున్నారు. ముఖ్యంగా వైసీపీ నేతల భూకబ్జాలను వివరిస్తూ కన్నీరు పెట్టుకున్నారు. తిరుపతి జిల్లా తొట్టంబేడు మండలం చియ్యవరం గ్రామానికి చెందిన సాయమ్మ తన సమస్యను వివరిస్తూ తన మామ, మేనత్త కాశీ అలిమేలమ్మ లు తమకున్న ఆస్తిని బతికున్నప్పుడే తన పేరిట రిజిస్టర్డ్ వీలు నామా రాసి ఇచ్చారు. ఆ ఆస్తి పరిధిలోని సర్వే నెంబర్ 120/6లో గల 74 సెంట్ల వ్యవసాయ భూమిని గ్రామస్తులైన వైసీపీ నాయకులు కంచి రవి, కాశి దేవేంద్ర, ఊపేటి శ్రీనులు రాజకీయ బలంతో అక్రమంగా కబ్జా చేశారు. తన నిస్సహాయతను ఆసరాగా చేసుకుని బెదిరింపులకు దిగుతూ భూమిలోకి అడుగుపెట్టనివ్వడం లేదు. ఈ అక్రమ ఆక్రమణపై గత నాలుగేళ్లుగా తొట్టంబేడు తహశీల్దార్, ఆర్డీవో, కలెక్టర్ కార్యాలయాల్లో పదుల సంఖ్యలో అర్జీలు సమర్పించినా పట్టించుకోలేదు. వారిపై చర్యలు తీసుకుని తమ సమస్యను పరిష్కరించాలని శాసనమండలి చీఫ్ విప్ పంచుమర్తి అనూరాధ, ఏపీ వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ మర్రెడ్డి శ్రీనివాసరెడ్డిలకు వినతిపత్రం ఇచ్చారు.

## అక్రమంగా భూమి రిజిస్ట్రేషన్

తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం అచ్చిపాలెం గ్రామానికి చెందిన బొగ్గల్ల కృష్ణకుమారి గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తండ్రి లేట్ బొగ్గల్ల బుల్లయ్యకు దేవరపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 34/2లో 0.85 సెంట్లు, సర్వే నెంబర్ 200-ఏలో 3.00 ఎకరాలు, మొత్తం కలిపి 3.85 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. తండ్రి మరణానంతరం ఆయన రెండో భార్య బొగ్గల్ల మంగమ్మ అసలైన వారసురాలైన తన పేరును దాచిపెట్టింది. రెవెన్యూ అధికారులకు తప్పుడు వివరాలు సమర్పించి తానే ఏకైక వారసురాలినంటూ ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్, డెత్ సర్టిఫికెట్ పొంది, ఆ మొత్తం భూమిని తన పేరిట 1-బీ, ఆన్‌లైన్ పట్టాదారు పాస్‌బుక్‌గా మార్చుకుంది. అనంతరం 2024లో సర్వే నెంబర్ 200-ఏలోని 3.00 ఎకరాల భూమిని మంగమ్మ తన చెల్లెలు చిన్నం కృష్ణవేణి భర్త చిన్నం రవికుమార్ - స్థానిక పాస్టర్ పేరిట అక్రమంగా గిఫ్ట్ రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చింది. ఇటీవల ల్యాండ్ రీసర్వే సమయంలో ఈ విషయం వెలుగు లోకి రావడంతో వారిని నిలదీశాం. దాంతో ఆగ్రహించిన బొగ్గల్ల మంగమ్మ, చిన్నం కృష్ణవేణి, చిన్నం రవికుమార్ కలిసి తనను దౌర్జన్యంగా బెదిరిస్తూ హత్య చేయడానికి కూడా వెనుకాడబోమని హెచ్చరిస్తున్నారు. వారిపై చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరిం చాలని కోరాడు.

## తప్పుడు పత్రాలతో భూమి ఆక్రమణయత్నం

ఏలూరు జిల్లా ముసునూరు మండలం చెక్కపల్లి గ్రామానికి చెందిన నక్కా వెంకమ్మ గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. గతంలో తాము జీవనోపాధి నిమిత్తం ఏలూరు జిల్లా లింగపాలెం మండలం తోచిలకరావుపాలెంలో ఉండగా ప్రభుత్వం తమకు సర్వే నెం. 192/1 పరిధిలోని 1.80 ఎకరాల భూమిని డీ-ఫారం పట్టా కింద మంజూరు చేసింది. దీనిపై రెవెన్యూ రికార్డులు ఉండటంతో పాటు పంట రుణం కూడా తీసుకుని సాగు చేసుకుం టున్నాం. వయసు పైబడటంతో స్వయంగా సాగు చేసుకోలేక ఆ భూమిని బంధువైన గొల్లపల్లి చిన్న కిట్టయ్యకు కౌలుకు ఇచ్చాం. ఆ తర్వాత గొల్లపల్లి చిన్న కిట్టయ్య, పందేటి ధనమ్మ, గుర్రం నాగమణి అనే వ్యక్తులు దురుద్దేశంతో చనిపోయిన రెడ్డి వెంకమ్మ పేరుతో తప్పుడు పత్రాలు సృష్టించి భూమిని కాజేసేందుకు యత్నించారు. కౌలు ఇవ్వకపోవడమే కాకుండా భూమిని ఆక్రమించుకోవాలని చూడటంతో ఈ విషయాన్ని గ్రామ పెద్దల దృష్టికి తీసుకెళ్లాం. పెద్దల వద్ద పంచాయితీ పెట్టారనే కక్షతో ది. 13.8.2025 సాయంత్రం సమయంలో గొల్లపల్లి పెద్ద కృష్ణ, గొల్లపల్లి చిన్న కృష్ణ, గొల్లపల్లి రమేష్, గుర్రం నాగమణి, పందేటి ధనమ్మలు తమ ఇంటిపైకి వచ్చి దౌర్జన్యానికి దిగారు. "పెద్దలకు చెప్పి మా పరువు తీస్తారా? ఇక్కడే చంపేస్తే అడిగే దిక్కు లేదు, కోర్టులు-స్టేషన్లు మాకు కొత్త కాదు" అంటూ బూతులు తిడుతూ తీవ్రంగా కొట్టారు. అనంతరం వెంట తెచ్చుకున్న కాగితాలపై తమతో బలవంతంగా వేలిముద్రలు వేయించుకున్నారు. ఈ విష యాన్ని ఎవరికైనా చెబితే ప్రాణాలు తీస్తామని బెదిరించారు. వారిపై చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరించాలని కోరారు.

## అధికారుల అండతో భూమి మరొకరికి బదిలీ

శ్రీ సత్యసాయి జిల్లా బుక్కపట్నం మండలం సిద్ధరాంపురం గ్రామానికి చెందిన సి.ఆదినారాయణ గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ తమ గ్రామంలోని సర్వే నెంబర్ 314-2 పరిధిలో ఉన్న సుమారు 4 ఎకరాల భూమిలో గత 40 ఏళ్లుగా తమ కుటుంబం వ్యవసాయం చేసుకుంటూ జీవనం చేస్తున్నాం. ఆరేళ్ల క్రితం తన భార్య కూడా మరణించడంతో బతుకుదెరువు కోసం గ్రామం విడిచి వలస వెళ్లాల్సి వచ్చింది. అదే అదునుగా గ్రామానికి చెంది న నాగలక్ష్మమ్మ, రాజేంద్ర అనే భూస్వాములు స్థానిక రెవెన్యూ అధికారులతో కుమ్మక్కయ్యారు. ఎటువంటి సంతకాలు లేకుండా నే ఆ 4 ఎకరాల భూమికి సంబంధించి ఆన్‌లైన్ రికార్డులు, 1-బీ (పట్టాదారు పాస్‌బుక్)ను అక్రమంగా తమ పేర్ల మీదకు మార్చుకున్నారు. వారిపై చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరించాలని కోరాడు.

## దౌర్జన్యం చేసి స్థలం స్వాధీనం

చిత్తూరు జిల్లా గంగవరం మండలం నాలుగురోడ్ల గ్రామానికి చెందిన సుబ్బమ్మ గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తమ గ్రామంలో తమ కుటుంబం సుమారు 90 ఏళ్లుగా నివాసముంటోంది. తమ ఇంటి వెనుక భాగంలో దాదాపు 5 సెంట్ల నివాస స్థలం ఉంది. ఆ 5 సెంట్ల ఇంటి స్థలాన్ని కబ్జా చేసే ఉద్దేశంతో నరమట్లపల్లికి చెందిన మల్లికార్జున, సూర్యనారాయణరెడ్డి తమపై దౌర్జన్యానికి దిగారు. అంతేకాకుండా బైరెడ్డిపల్లి మండలం అంతిరెడ్డిపల్లికి చెందిన రమణారెడ్డి, కొత్తపల్లికి చెందిన జ్ఞానరెడ్డి అనే వ్యక్తులు రాత్రి వేళల్లో వచ్చి దౌర్జన్యంగా ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆక్రమణలను ప్రశ్నిస్తే తమపై గొడవకు దిగుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. ఈ సమస్యపై ఇప్పటికే పలు మార్లు స్థానిక అధికారుల చుట్టూ తిరిగినా ఎలాంటి పరిష్కారం లభించలేదు. కావున వారిపై చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరించాలని కోరారు.

## భూమి తమది కాదంటూ వీఆర్వో తప్పుడు నివేదిక

సత్యసాయి జిల్లా బుక్కపట్నం మండలం సిద్ధరాంపురం గ్రామానికి చెందిన భార్గవి గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తమ గ్రామంలో సర్వే నెంబర్ 818-2 పరిధిలో ఉన్న 3.16 ఎకరాల విస్తీర్ణంగల భూమిలో తమ కుటుంబం దాదాపు 50 ఏళ్లుగా గుడిసె వేసుకుని సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. ఈ భూమికి సంబంధించి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ చేపట్టాల్సి ఉండగా స్థానిక వీఆర్వో పెద్దన్న నిర్లక్ష్యంగా వ్యవహరిం చారు. క్షేత్రస్థాయిలో వాస్తవాలు పరిశీలించకుండా తన భర్త లేట్ రామమోహన్ అనుభవంలో సదరు భూమి లేదు' అంటూ కలెక్టర్ కు తప్పుడు రిపోర్టు పంపించారు. ఆ అధికారి ఇచ్చిన తప్పుడు సమాచారం కారణంగా 2022 డిసెంబర్ నుంచి రెవెన్యూ కార్యాల యాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నా ఎటువంటి న్యాయం జరగడం లేదు. వారిపై చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరించాలని కోరారు.

## పొలానికి నీరు చేరకుండా అడ్డంకులు

ఏలూరు జిల్లా దెందులూరు మండలం మల్కాపురం గ్రామానికి చెందిన కె.లక్ష్మీనారాయణ గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ..తమ గ్రామంలోని సర్వే నెంబర్ 345/2 పరిధిలో ఉన్న సుమారు 50 సెంట్ల వ్యవసాయ భూమి తన తల్లి నారాయణమ్మ పేరు మీద రిజిస్ట్రేషన్ అయి ఉంది. అదే గ్రామానికి చెందిన బండి బాల చంద్రుడు పొలానికి సాగునీరు చేరకుండా అడ్డంకులు సృష్టిస్తూ తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. దాంతో వరి పంట పూర్తిగా ఎండిపోయి తీవ్ర నష్టం వాటిల్లింది. ఆ వేదన తట్టుకోలేక తన తల్లి నారాయణమ్మ గుండెపోటుతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నా రు. స్థానిక తహశీల్దార్, ఇరిగేషన్ శాఖ అధికారులు, ఏలూరు రూరల్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదులు చేసినా ఎటువంటి పరిష్కారం లభించలేదు. వారిపై చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరించా లని కోరాడు.

## భూ ఆక్రమణ.. ఆపై తప్పుడు కేసు

జోగులాంబ గద్వాల జిల్లా ఉండవెల్లి మండలం బంకూరు గ్రామానికి చెందిన తెలుగు వేణు గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ..కర్నూలు జిల్లా సి.బెళగల్ మండలం బిల్లకల్లు గ్రామంలోని సర్వే నెంబర్ 3 పరిధిలో తమ పూర్వీకుల నుంచి వచ్చిన దాదాపు 38.16 ఎకరాల పట్టా భూమి ఉంది. ఈ క్రమంలో 2022లో పొలకల్లు గ్రామానికి చెందిన దొడ్డ సుంకన్న అనే వ్యక్తి దౌర్జన్యంగా తమ పొలంలోకి చొరబడి దున్నడం మొదలుపెట్టాడు. తమ పొలాన్ని ఎందుకు దున్నుతున్నావని నిలదీయగా సుంకన్న తన భార్య, కుమారుడిని రంగంలోకి దించి ఉద్దేశపూర్వకంగా గొడవకు దిగాడు. ఈ వివాదంపై అప్పట్లోనే బాధితులు పోలీసులకు ఫిర్యా దు చేసినప్పటికీ స్థానిక ఎస్సై శ్రీనివాసరెడ్డి పట్టించుకోలేదు. ఆ తర్వాత సుంకన్న కుటుంబసభ్యులు కుట్రపూరితంగా తమపై తప్పు డు సమాచారంతో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయిం చారు. భూమి ఆక్రమణకు సంబంధించిన ఆధారాలు, ఫొటోలు తమ వద్ద ఉన్నప్పటికీ అప్పటి స్పందన అర్జీలు, కలెక్టరేట్ ఫిర్యాదు లను ఏ అధికారీ పరిష్కరించలేదు. వారిపై చర్యలు తీసుకుని తమ సమస్యను పరిష్కరించాలని కోరాడు.

## రీ సర్వేలో భూమిని తగ్గించి చూపారు

ఏలూరు జిల్లా దెందులూరు మండలం రామారావుగూడెం గ్రామానికి చెందిన పాకనాటి గణేష్ గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ తమ గ్రామంలో సర్వే నెం.235/1, 2.1 ఎకరా ఉండాల్సి ఉండగా కేవలం 85 సెంట్లు మాత్రమే చూపించారు. సర్వే నెం. 241/1బీలో 1.43 ఎకరాలకు గాను 1.40 ఎకరాలు మాత్రమే నమోదు చేశారు. సర్వే నెం.242/1బీలో 60 సెంట్లకు ఇంకా తక్కువగా, 242/1సీలో 3.04 ఎకరాలు ఉండగా 2.80 ఎకరాలుగా నమోదు చేశారు. సర్వే నెం.248/5లో రికార్డుల్లో ఉన్న 5 సెంట్ల భూమి ప్రస్తుతం అసలు లేదని అధికారులు తెలిపారు. భూమి రీసర్వే పేరుతో తగ్గిపోవడం లేదా పక్క రైతుల పరిధిలోకి చేరిపోయింది. వారిపై చర్యలు తీసుకుని తమ సమస్యను పరిష్కరించాలని కోరాడు.



చైతన్యరథం

# మైనింగ్ రంగంలో ఆదాయం పెంపే లక్ష్యం

- జిల్లాల వారీగా నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలి
- ప్రజలకు పారదర్శకమై సేవలు అందించాలి
- ఏపీ టైటానియం అండ్ రేర్ ఎర్త్ మాగ్నెట్ పాలసీతో రూ.లక్ష కోట్లకు పైగా పెట్టుబడులే ప్రభుత్వ లక్ష్యం
- అక్రమ రవాణా, మైనింగ్ అరికట్టేందుకు కెమెరాలు
- గనులు, భూగర్భ వనరుల మంత్రి కొల్లు రవీంద్ర
- మంగళగిరిలో శాఖ డైరెక్టరేట్ కార్యాలయం ప్రారంభం



మంగళగిరి(చైతన్యరథం): రాష్ట్ర మైనింగ్ రంగంలో ఆదా యంతో పాటుగా ప్రజలకు పారదర్శకమై సేవలు అందించాలని గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ఆదేశించారు. మంగళగిరి మయూరి టెక్ పార్కులో ఏర్పాటు చేసిన డైరెక్టరేట్ ఆఫ్ మైన్స్ అండ్ జియాలజీ కార్యాలయాన్ని అధికారికంగా ప్రారంభించారు. కార్యాలయంలో ఏర్పాటు కెమిక ల్ ల్యాబ్, కాన్ఫరెన్స్ హాల్, కమాండ్ కంట్రోల్ రూమ్, రికార్డు రూమ్, మైన్స్ ఎగ్జిబిషన్‌ను పరిశీలించారు. అనంతరం అన్ని జిల్లాల నుంచి వచ్చిన మైనింగ్ అధికారులతో సమావేశమై కీలక సూచనలిచ్చారు. జిల్లాల వారీగా నిర్దేశించిన లక్ష్యాలను సాధించా లని సూచించారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో గనుల శాఖ ఖనిజ ఆదాయం రూపంలో రూ.3,416 కోట్లు వసూలు చేసింద ని, 2024-25తో పోలిస్తే ఇది 32 శాతం వృద్ధి నమోదైంది. డీఎంఎఫ్, ఎంఈఆర్ఐటీ, ఎన్ఎంఈటీ, సెక్యూరిటీ కలుపుకుంటే మొత్తం వసూళ్లు రూ.4,339 కోట్లకు చేరాయని చెప్పారు. గత ఏడాదితో పోలిస్తే ఇది సుమారు 40శాతం ఎక్కువగా తెలిపారు. 2026-27 ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు రూ.1,287.33 కోట్ల ఆదాయం సమకూరింది. ఇది గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 12.9 శాతం వృద్ధి నమోదైంది. ప్రధాన ఖనిజాల ఆదాయం 53.5 శాతం పెరగగా, ఉప ఖనిజాల ఆదా యం 5.8 శాతం పెరిగింది. ఆగస్టు నెలలో మాత్రమే రూ.311.57 కోట్ల ఆదాయం సమకూరింది. గత ఏడాది ఆగస్టు లో వచ్చిన ఆదాయం కంటే ఇది 23.5 శాతం వృద్ధి చూశాం. రాష్ట్ర స్థూల విలువ జోడింపులో గనుల రంగం వాటా 2.00 శాతం నుంచి 2.09 శాతానికి పెరిగిందని పెరగడం అభినంద నీయం. 2028-29 నాటికి ఈ వాటాను 3.5 నుంచి 3.7 శాతానికి పెంచడం లక్ష్యంగా పెట్టుకోవాలని సూచించారు. 2025-26లో 21 ప్రధాన ఖనిజ గనులను వేలం వేశాం. 2015లో ఇ-వేలం విధానం ప్రారంభమైనప్పటి నుంచి ఏ ఒక్క సంవత్సరంలోనూ ఇంత పెద్ద సంఖ్యలో గనుల వేలం జరగలేదని తెలిపారు. ఈ పనితీరుతో ఆంధ్రప్రదేశ్ దేశంలోని అత్యధిక సంఖ్యలో ప్రధాన ఖనిజ గనులను వేలం వేసిన మొదటి నాలుగు రాష్ట్రాల్లో ఒకటిగా నిలిచిందని పేర్కొన్నారు. వేలం ప్రీమియం ద్వారా వచ్చిన ఆదాయం గత ఏడాదితో పోలిస్తే 538 శాతం పెరిగి రూ.75 కోట్లకు చేరింది. వేలం అనంతర ప్రక్రియలో గనులు అనుమతులు, భూమి తదితర అంశాల వద్ద నిలిచిపోకుం డా ఉత్పత్తి దశకు చేరేలా జిల్లా అధికారులు నిరంతరం పర్యవేక్షిం చాలని ఆదేశించారు. ఖనిజాల వేలానికి సుమారు 1,900 కొత్త దరఖాస్తులు అందాయని, రూ.172 కోట్ల ప్రీమియం వసూలైం దని తెలిపారు. గత రెండేళ్లలో సుమారు 450 లీజులు మంజూర య్యాయని తెలిపారు. ప్రతి జిల్లా కార్యాలయం ఈ విధానాన్ని చట్టబద్ధమైన గనుల కార్యకలాపాలను విస్తరించే సాధనంగా ఉప యోగించుకోవాలని, దాని ప్రయోజనాలు అర్హులైన లబ్ధిదారులకు త్వరగా చేరేలా చూడాలని సూచించారు.

### 2.1 కోట్ల మెట్రిక్ టన్నుల ఇసుక సరఫరా

2024 జూలై నుంచి ఉచిత ఇసుక విధానం కింద పూర్తిగా ఆన్‌లైన్ ఏపీ శాండ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ద్వారా సుమారు 2.1 కోట్ల మెట్రిక్ టన్నుల ఇసుకను సరఫరా చేసినట్లు వెల్లడించారు. కేవలం నిర్వహణ ఖర్చులు మాత్రమే వసూలు చేస్తూ ఉచితంగా అందించడం కూటమి ప్రభుత్వ ఘనత అని వివరించారు. ఇసుక లభ్యతపై ప్రజల సంతృప్తి 55 శాతం నుంచి 75శాతానికి పైగా పెరిగిందని తెలిపారు.

### ఖనిజ ప్రాంతాల గుర్తింపు.. అవగాహన ఒప్పందాలు

రాష్ట్రవ్యాప్తంగా రిమోట్ మ్యాపింగ్ ద్వారా 126 ఖనిజ ప్రాంతాలను గుర్తించారు.ఏఐ, మెషిన్ లెర్నింగ్ ఆధారిత అధ్యయనాల ద్వారా మరో 49 ప్రాంతాలను గుర్తించాం.ఎంఈఆర్ ఐటీ కింద ప్రస్తుతం 16 ఖనిజ ప్రాంతాల్లో క్రియాశీల అన్వేషణ కొనసాగుతోంది. కడప బేసిన్‌లో లిథియం, గాలియం ఖనిజాల అవకా శాలను అన్వేషించేందుకు సీఎస్ఐఆర్-ఎన్‌జీఆర్ఐతో రాష్ట్ర ప్రభుత్వం అవగాహన ఒప్పందాలు కుదుర్చు కున్నట్లు తెలిపా రు. ఈ ఒప్పందాల ద్వారా జాతీయ స్థాయి పరిశోధన, సాంకేతిక సంస్థలను ఆంధ్రప్రదేశ్ లోకి తీసుకురావడంతో పాటు వాటిని క్షేత్రస్థాయిలో వాస్తవ అన్వేషణ ఫలితాలు, సాంకేతిక పరిజ్ఞానంగా మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నారు. జొన్నగిరి, చిగురుగుంట-బిస్నితం, బొక్సంపల్లె, రామగిరి ప్రాంతాల్లోని బంగారు గనుల పనులు ముందుకు సాగుతున్నాయని తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం కార్యకలాపాలు సాగిస్తున్న ఏకైక బంగారు గనిగా జొన్నగిరిలో ఈ ఏడాది వాణిజ్య బంగారు ఉత్పత్తి ప్రారం భమైందని వెల్లడించారు. బీచ్ శాండ్ ఖనిజ వనరుల ఆధారంగా ఏపీ టైటానియం అండ్ రేర్ ఎర్త్ మాగ్నెట్ పాలసీ(ఏపీ టీఐ ఆర్ఏఎం)ను రూపొందించినట్లు తెలిపారు. ఈ విధానం ద్వారా రూ.లక్ష కోట్లకు పైగా పెట్టుబడులు, 65,000 ఉద్యోగాలు కల్పించాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ఉందని వివరించారు. రాష్ట్రంలో అక్రమ రవాణా, అక్రమ మైనింగ్‌ను అరికట్టేందుకు సుమారు 18,000 ఏఎన్‌పీఆర్ కెమెరాలను ఏర్పాటు చేయాలని ప్రణాళిక రూపొందించారు. టెక్సమిన్ ఫౌండేషన్ భాగస్వామ్యంతో డ్రోన్ ఆధారిత నిఘా, ఏఐ ఆధారిత అక్రమ మైనింగ్ గుర్తింపు వ్యవస్థలను కూడా అమలు చేస్తున్నారు. దరఖాస్తుల పరిశీలన, తనిఖీలు, కోర్టు కేసుల పర్యవేక్షణ, జిల్లా యంత్రాంగంతో సమన్వ యం, ప్రజలకు జవాబుదారీతనం వంటి కార్యక్రమాల్లో జిల్లా అధికారుల చొరవను మంత్రి కొల్లు రవీంద్ర అభినందించారు. ఈ కార్యక్రమంలో మైన్స్ డైరెక్టర్ చంద్రశేఖర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# పర్యాటక రంగ అభివృద్ధికి ప్రణాళికలు

- ఏడాదంతా పర్యాటక శోభ ఉట్టిపడేలా ఉత్సవాలు
- 27న ఘనంగా 'వరల్డ్ టూరిజం డే' వేడుకలు
- వినూత్న కార్యక్రమాలు, ఈవెంట్లు నిర్వహించాలి
- జిల్లాల 28 ప్రతిపాదనల అమలుకు కార్యాచరణ
- అధికారులకు మంత్రి కందుల దుర్గేష్ ఆదేశం



అమరావతి(చైతన్యరథం): రాష్ట్రంలో పర్యాటక రంగానికి మరింత ఊతమిచ్చేలా వినూత్న కార్యక్రమాలు, మెగా, జిల్లా స్థాయి ఈవెంట్లను నిర్వహించాలని పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ అధికారులను ఆదేశించారు. వెలగపూడి సచివాలయంలోని రెండవ బ్లాక్‌లో మంత్రి అధ్యక్షతన గురువారం టూరిజం డిపార్ట్‌మెంట్ మార్కెటింగ్ కమిటీ ప్రమోషన్ మీటింగ్ జరిగింది. ఏడాదంతా పర్యాటక శోభ ఉట్టిపడేలా జిల్లాస్థాయి పర్యాటక ఉత్సవాలు, రోడ్‌షోలు నిర్వహిం చాలని సూచించారు. జిల్లాల నుంచి అందిన 28 ప్రతిపాదనలకు అనుగుణంగా తెలుగు సంస్కృతిని ప్రతిబింబించేలా ఉత్సవాలకు రూపకల్పన చేయాలన్నారు. సెప్టెంబర్ 27న 'వరల్డ్ టూరిజం డే' వేడుకల నిర్వహణ, రాబోయే గోదావరి పుష్కరాలకు విస్తృత ప్రచారం కల్పించడంతో పాటు భక్తుల సౌకర్యార్థం పర్యాటక శాఖ తరపున అత్యాధునిక టెంట్ సిటీల ఏర్పాటుపై చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన గోదావరి పుష్కరా లు-2027 సందర్భంగా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో దేశ విదేశా ల నుంచి తరలివచ్చే కోట్లాది మంది భక్తులు, పర్యాటకుల కోసం రూపొందించిన విస్తృతస్థాయి బ్రాండింగ్, మార్కెటింగ్ కార్యాచర ణను అధికారులు మంత్రికి అందించారు. యాత్రికుల సౌకర్యార్థం పిలిగ్రిమ్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్, సర్క్యూట్ మ్యాప్స్, ఆకర్షణీయ మైన బ్రోచర్లు, సమగ్ర వివరాలతో కూడిన కంటెంట్ తయారు చేయాలని సూచించారు. గోదావరి నది ప్రాశస్త్యాన్ని,పరివాహక అధ్యాత్మిక ప్రాంతాల ప్రాధాన్యతను, చారిత్రక ఘాట్ల విశిష్టతను చాటేలా వినూత్న డిజిటల్ కంటెంట్, సోషల్ మీడియా ప్రచారా లు, స్టోరీ టెల్లింగ్ కార్యక్రమాలు రూపొందించాలన్నారు. టూర్ ఆపరేటర్లతో ప్రతినెలా క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహిం చడం, హోటల్ అండ్ హాస్పిటాలిటీ వర్క్‌షాప్‌ల ఏర్పాటుపై సూచించగా మంత్రి సానుకూలంగా స్పందించారు. పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి అవసరమైన సమగ్ర ప్రాజెక్ట్ నివేదికలను తక్షణమే సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ఈ ఉన్నతస్థాయి సమావేశంలో పర్యాటక, సాంస్కృతిక శాఖల స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎస్.ఎస్.రావత్, టూరిజం ఎండీ పట్టాన్ శెట్టి రవిసుభాష్, సమాచార పౌర సంబంధాల శాఖ డైరెక్టర్, సినిమా టోగ్రఫీ ఎండీ విశ్వనాథన్, ఏపీటీఏ సీఈవో శ్రీనివాస్, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ రేగుళ్ల మల్లిఖార్జునరావు, ఆర్థిక శాఖ జాయింట్ సెక్రటరీ విజయలక్ష్మి, చీఫ్ మార్కెటింగ్, ఫైనాన్స్ అధికారులు పద్మారాణి, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

చైతన్యరథం



# కొండూరు కిడ్నీ బాధితుల జీవితాల్లో కొత్త ఆశలు

- గ్రామానికి జేజేఎం - అమరజీవి జలధారలు
- ఉద్ధానం తరహా సమస్యకు శాశ్వత పరిష్కారం
- 26 నెలల కాలంలో రూ.49.94 కోట్ల పనులు పూర్తి
- 38 ఆవాసాల పరిధిలో 130 కిలోమీటర్ల పైప్‌లైన్
- ఇంటింటికీ కొళాయిలతో స్వచ్ఛమైన తాగునీరు

అమరావతి(చైతన్యరథం): మూత్రపిండాల వ్యాధి (క్రానిక్ కిడ్నీ డిసీజ్) బారినపడిన ప్రజలతో మరో ఉద్దానాన్ని తలపించే ప్రాంతం ఎన్టీఆర్ జిల్లా, ఎ.కొండూరు మండలం. ఈ మండల పరిధిలో మొత్తం 21 గ్రామ పంచాయతీలు, 38 ఆవాసాలు ఉండగా, దాదాపు అన్ని గ్రామాలు దీర్ఘకాలిక కిడ్నీ వ్యాధి ప్రభావిత ప్రాంతాలుగా ఉన్నాయి. అందులో గిరిజనులు మాత్రమే నివసించే 15 తండాలున్నాయి. తాగేందుకు గుక్కెడు నీరు దొరక్క, ప్రమాద మని తెలిసినా కలుషిత జలాలతో గొంతు తడుపుకునే పరిస్థితి నెలకొంది. 2024 సార్వత్రిక ఎన్నికలకు ముందు ఈ సమస్య పవన్‌కళ్యాణ్ దృష్టికి వచ్చింది. ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే ఎ.కొండూరుకు రక్షిత తాగునీటి సౌకర్యం కల్పించడం ద్వారా ఆ ప్రాంత ప్రజలను కిడ్నీ వ్యాధి బారి నుంచి కాపాడాలని సంకల్పించారు. అధికారం చేపట్టిన 26 నెలల్లోనే తన పరిధిలోని గ్రామీణ తాగునీటి సరఫరా శాఖ ద్వారా జల్ జీవన్ మిషన్-అమరజీవి జలధారల నిధులతో ఎ.కొండూరు తాగునీటి ప్రాజెక్టును పూర్తి చేశారు. రూ.49.94 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టు 100 శాతం పనులు పూర్తి చేసుకుని ఆ ప్రాంత ప్రజల నీటి కష్టాలను తీర్చింది.

## గత ప్రభుత్వం టెండర్ల ప్రక్రియ కూడా మొదలుపెట్టలేదు

ఎ.కొండూరు తాగునీటి ప్రాజెక్టును కూడా గత ప్రభుత్వం ఆర్భాటం చేసి కనీసం టెండర్ ప్రక్రియను కూడా మొదలు పెట్టలేదు. ఒక్క పనీ ప్రారంభించలేదు. జల్ జీవన్ మిషన్ కింద చేపట్టిన ప్రాజెక్టు కావడం, గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో 2024 మార్చి నాటికి గడువు కూడా ముగియడంతో ఈ ప్రాజెక్టుపై నీలినీడలు కమ్ముకున్నాయి. అయితే ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఈ పనులను ముందుకు తీసుకెళ్లారు. ప్రధానమంత్రి మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం జల్ జీవన్ మిషన్‌ను మరో నాలుగేళ్లు పొడిగించగా రాష్ట్ర ప్రభుత్వం వాటా కూడా తక్షణమే విడుదల చేసి పనులను యుద్ధప్రాతిపదికన ముందుకు తీసుకువెళ్లింది. కిడ్నీ వ్యాధితో ప్రజలు పడుతున్న అవస్థలను చూసి చలించిన ఉప ముఖ్యమంత్రి, నిర్దేశిత గడువులోపు పనులు పూర్తి చేయించారు. ఇబ్రహీంపట్నం ఎన్టీపీసీ కాలువ నుంచి కృష్ణా జలాలను స్వీకరించి అక్కడే శుద్ధి చేసి, 130 కిలోమీటర్ల పైప్‌లైన్, 12 ఓవర్‌హెడ్ ట్యాంకుల సహకారంతో దాదాపు 75,000 మందికి ఒక్కొక్కరికి రోజుకు 55 లీటర్ల చొప్పున స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తున్నారు. ఎ.కొండూరు తాగునీటి ప్రాజెక్టుకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి పైప్‌లైన్ నిర్మాణానికి అత్యంత త్వరితగతిన అనుమతులు లభించేలా ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లారు. గతంలో ఎ.కొండూరు మండల పరిధిలోని ప్రజలకు ట్యాంకర్ల సాయంతో తాగునీరు అందించేందుకు ప్రభుత్వం ఏటా రూ.2.5 కోట్లు ఖర్చు చేయాల్సి వచ్చేది. నేడు పవన్‌కళ్యాణ్ ప్రత్యేక శ్రద్ధతో జల్ జీవన్ మిషన్-అమరజీవి జలధారల రూపంలో తాగునీటి సమస్యకు, కిడ్నీ సమస్యలకు శాశ్వత పరిష్కార మార్గం లభించినట్టయింది. త్వరలో ఎ.కొండూరు ప్రాంతంలో పర్యటించి తాగునీటి పథకం పనుల నాణ్యతను పరిశీలించనున్నారు. అందుకు సంబంధించి షెడ్యూల్ సిద్ధం చేయాలని ఇప్పటికే కార్యాలయ అధికారులకు నిర్దేశం చేశారు.



# విశాఖపట్నం వేదికగా టూర్ ఆపరేటర్స్ సదస్సు

- 10 నుంచి 12 వరకు జాతీయస్థాయిలో నిర్వహణ
- రాష్ట్ర పర్యాటక రంగ వర్గాలకు ఐఏటీఓ సభ్యత్వం, రిజిస్ట్రేషన్ రుసుముల్లో బంపర్ రాయితీలు
- ఏపీ భాగస్వాములకు ప్రవేశ రుసుము మినహాయింపు
- సదస్సు రిజిస్ట్రేషన్ ఫీజు రూ.3 వేలకు తగ్గింపు
- పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్




అమరావతి(చైతన్యరథం): ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ నేతృత్వంలో పర్యాటక రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు, స్థానిక పర్యాటక భాగస్వాము లకు జాతీయస్థాయిలో విస్తృత అవకాశాలు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మక నిర్ణయాలు తీసుకుందని పర్యాట క మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. వెలగపూడి సచివాలయంలో ఆయన మాట్లాడుతూ విశాఖపట్నంలో ఈ నెల 10 నుంచి 12 వరకు జరగనున్న 41వ ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ టూర్ ఆపరేటర్స్ జాతీయ వార్షిక సదస్సు విశేషాలను వివ రించారు. దేశవ్యాప్తంగా ప్రముఖ పర్యాటక ప్రతినిధులు, టూర్ ఆపరేటర్లు, హోటల్ నిర్వాహకులు, విధాన నిర్ణేతలను ఒకే వేదికపైకి తీసుకువచ్చే ఈ ప్రతిష్టాత్మక సదస్సుకు విశాఖపట్నం ఆతిథ్యం ఇవ్వడం రాష్ట్ర పర్యాటక రంగానికి దక్కిన గొప్ప అవకాశ మని తెలిపారు. దేశవ్యాప్తంగా 2,068కి పైగా సభ్యులతో ఇన్-బౌండ్ టూరిజంలో అగ్రగామిగా ఉన్న ఐఏటీఓ, ఏపీ పర్యాటక భాగస్వాముల భాగస్వామ్యాన్ని పెంపొందించడానికి ప్రత్యేక డ్రైవ్ ను ప్రారంభించిందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన టూర్ ఆపరేటర్లు, హోటళ్లు, పర్యాటక భాగస్వాములు ఐఏటీఓ సభ్యత్వం పొందేందుకు చెల్లించాల్సిన రూ.10,000 (జీఎస్టీ) వన్‌టైమ్ అడ్మిషన్ ఫీజును పూర్తిగా రద్దు చేయడం జరిగిందన్నారు. ఈ రాయితీ 2026 డిసెంబరు 31 వరకు అందజేసే దరఖాస్తులకు వర్తిస్తుందని వివరించారు. సాధారణంగా ఐఏటీఓ సభ్యులకు రూ.6,000, సభ్యులు కానివారికి రూ.8,500 ఉండే సదస్సు రిజిస్ట్రేషన్ ఫీజును ఏపీ ప్రతినిధులకు కేవలం రూ.3,000కే నిర్ణయించామని వివరించారు. అర్హులైన స్థానిక పర్యాటక ప్రతినిధులు ఎటువంటి ప్రాథమిక ప్రవేశ రుసుము చెల్లించకుండా ఐఏటీఓ అధికారిక పోర్టల్ https://iato.in/Register/form ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.

## దేశం నలుమూలల నుంచి ప్రతినిధులు

ఈ సదస్సుకు దేశ నలుమూలల నుంచి 1,000 మందికి పైగా ప్రముఖ ఇన్-బౌండ్ టూర్ ఆపరేటర్లు, డొమెస్టిక్ ట్రావెల్ కంపెనీలు, డెస్టినేషన్ మేనేజ్‌మెంట్ కంపెనీలు, హోటల్ రంగ ప్రతినిధులు, విమానయాన సంస్థల ప్రతినిధులు హాజరుకానున్నారని తెలిపారు. దీనివల్ల ఏపీలోని హోటళ్లు, రిసార్టులు, పర్యాటక ప్రాంతాలను జాతీయ స్థాయిలో ఉచితంగా ప్రచారం చేసుకునే అవకాశం కలుగుతుందని వివరించారు. అంతేకాకుండా దేశంలోని అగ్రగామి టూర్ ఆపరేటర్లతో నేరుగా వ్యాపార సంబంధాలు నెలకొల్పుకునే అవకాశం లభిస్తుందని వివరించారు. రాష్ట్రంలోని హోటళ్ళు, రిసార్టుల యాజమాన్యాలు, టూర్ ఆపరేటర్లు, ట్రావెల్ ఏజెన్సీలు, హోమ్‌స్టే నిర్వాహకులు, ట్రాన్స్ పోర్ట్ ఆపరేటర్లు, టూరిస్ట్ గైడ్లు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలం దరూ ఈ అపూర్వ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఐఏటీఓ సభ్యత్వం పొందడంతో పాటు సదస్సులో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

# సాగునీటి ప్రాజెక్టులపై గొడ్డలిపార్టీది ధనయజ్ఞమే

- 11 ఏళ్లు పాలించిన వైఎస్ఆర్, జగన్‌లు
- మట్టి పనులు చేసుకుని సొమ్ము చేసుకున్నారు
- ప్రజలను మోసం చేసినందుకే ఎన్నికల్లో ప్రజలు వైసీపీకి గుండు సున్నా ఇచ్చారు
- 30 ఏళ్ల కలను సాకారం చేసి వెలిగొండ పూర్తి చేసి చంద్రబాబు ప్రకాశం జిల్లా రైతులకు నీళ్లు ఇచ్చారు
- పోలవరాన్ని శరవేగంగా పరుగులు పెట్టిస్తున్నారు
- ఏపీ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ

మంగళగిరి(చైతన్యరథం): పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టును పూర్తి చేసి ఆగస్టు 31న కృష్ణా జలాలను విడుదల చేయడం ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల ప్రజల మూడుదశాబ్దాల కలను సాకారం చేశారని ఏపీ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ పేర్కొన్నా రు. 1996 మార్చి 5న ఇదే ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన చంద్రబాబే.. దాదాపు మూడు దశాబ్దాల తర్వాత ప్రాజెక్టును పూర్తి చేసి జాతికి అంకితం చేయడం ఆయన సంకల్పానికి, పట్టుదలకు నిదర్శనమన్నారు. ఒక ప్రాజెక్టును ప్రారంభించడం కంటే దాన్ని పూర్తి చేసి ప్రజలకు ఉపయోగంలోకి తీసుకురావడమే అసలైన నాయకత్వమని చెప్పారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురువా రం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒకవైపు పోలవరం ఎడమ కాలువ ద్వారా నాలుగు జిల్లాల్లో 2.87 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేలా చర్యలు చేపడుతూ.. మరో వైపు వెలిగొండ ద్వారా పశ్చిమ ప్రకాశం ప్రాంత ప్రజల సాగు, తాగునీటి కష్టాలను తీర్చే దిశగా చంద్రబాబు అడుగులు వేస్తున్నా రని తెలిపారు. రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయడం, నదుల అనుసంధానం, నీటి వనరులను సద్వినియోగం చేసుకో వడం ద్వారా చంద్రబాబు సరికొత్త జల విప్లవానికి నాంది పలికారని ప్రశంసించారు. వెలిగొండ ప్రాజెక్టు పూర్తితో ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని, ముఖ్యంగా పశ్చిమ ప్రకాశం ప్రాంత రైతుల జీవితాల్లో ఈ ప్రాజె క్టు కొత్త అధ్యాయాన్ని ప్రారంభించిందని పేర్కొన్నారు.

## పూర్తికాకుండా జాతికి ఎలా అంకితం చేశారు?

గత వైసీపీ ప్రభుత్వం ఎన్నికల ముందు తాత్కాలిక ప్రయోజనా ల కోసం టన్నెల్స్ పూర్తి కాకుండానే టన్నెల్ బోరింగ్ మెషీన్లను సైతం బయటకు తీయకుండా ప్రాజెక్ట్ పూర్తయిపోయిందని అబ ద్ధాలు చెప్పి జాతిని మోసం చేసింది. నీరు వచ్చే మార్గమే లేనప్పు డు ఆనాడు జాతికి ఎలా అంకితం చేశారో ప్రజలకు సమాధానం చెప్పాలి. ఆ మోసాలను గుర్తించే 11 సీట్లకు పరిమితం చేశారు. అధికారంలోకి రాగానే ఇచ్చిన మాటకు కట్టుబడి యుద్ధప్రాతి పదికన పనులు పూర్తి చేయించి వెలిగొండలో నీటిని పారించారు చంద్రబాబు. ఎవరు ప్రాజెక్టును పూర్తి చేశారు, ఎవరు నీళ్లు ఇచ్చారో ఈ ప్రాంత రైతులకు, ప్రజలకు స్పష్టంగా తెలుసునని తెలిపారు.

## వెలిగొండ ప్రాజెక్టుకు బీజం వేసింది ఎన్టీఆర్.. అనుమతులు తెచ్చి శంకుస్థాపన చేసింది చంద్రబాబు

వెలిగొండ ప్రాజెక్టు చరిత్రను, ప్రస్తుత వాస్తవాలను వక్రీకరిస్తూ ప్రతిపక్షం చేస్తున్న దుష్ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. ఈ ప్రాజెక్టు పుట్టుక నుంచి నీరు విడుదల చేసే దాకా ప్రతి అడుగులో తెలుగుదేశం పార్టీ చిత్తశుద్ధి దాగి ఉందని స్పష్టం చేశారు. 1984లోనే ఎన్టీఆర్ జీవో 306 జారీ చేసి రూ.684 కోట్లతో ప్రాజెక్ట్ ఇన్వెస్టిగేషన్ డివిజన్ ఏర్పాటు చేసి వెలిగొండకు పునాది వేశారు. 1996 మార్చి 5న చంద్రబాబు ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. టైగర్ రిజర్వ్, అటవీ, పర్యావరణ అనుమ తులన్నీ సాధించి ప్రాజెక్టు వ్యయాన్ని రూ.950 కోట్లుగా నిర్ణయిం చి తొలిదశలో 13% నిధులు (రూ.138 కోట్లు) ఖర్చు చేసి పనులు పరుగులు పెట్టించారు. 2004 తర్వాత వైఎస్ ప్రభుత్వం ప్రాజెక్ట్ అంచనా వ్యయాన్ని రూ.950 కోట్ల నుంచి రూ.1,750 కోట్లకు పెంచింది. అందులో రూ.1,000 కోట్లు కేవలం మట్టి పనులకే ఖర్చు చేసుకున్నారు తప్ప కీలకమైన హెడ్ వర్క్స్, టన్నెల్ లైనింగ్ పనులు పూర్తి చేయలేదు. నిర్వాసితులకు నయాపైసా పరిహారం ఇవ్వలేదు. 2024 ఎన్నికలకు ముందు జగన్‌రెడ్డి టన్నెల్ మిషన్లను కూడా బయటకు తీయకుండా నిర్వాసితులకు పరిహారం ఇవ్వకుండా అడ్డగోలుగా ప్రాజెక్ట్ ప్రారంభించామని ప్రచారం చేసుకున్నారని మండిపడ్డారు.



## నిర్వాసితులకు అండగా నిలిచాం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కేవలం రెండు నెలల్లోనే నిర్వాసితుల కోసం రూ.1,050 కోట్లు విడుదల చేసిం ది. మూడు దఫాలుగా నిర్వాసితుల ఖాతాల్లో పరిహార సొమ్ము జమ చేసింది. 2019 నాటికి 18 ఏళ్లు నిండిన యువతకు ఒక్కొక్కరికి రూ.2 లక్షల చొప్పున చెల్లింపు, బాధితులకు నెల రోజులకు సరిపడా నిత్యావసర సరుకులు, పశువులకు దాణా పంపిణీ చేసి పూర్తి అండగా నిలిచాం. సభ ప్రారంభం కాకముం దే తీసిన ఖాళీ కుర్చీల ఫొటోలను సాక్షి పత్రికలో అచ్చేసి జనం రాలేదని పైశాచిక ఆనందం పొందుతున్నారు. అసలు వాస్తవం ఏమిటంటే ఆ రోజు వెలిగొండ వద్దకు జనం పోటెత్తారు. చంద్రబాబు పర్యటన ముగిశాక దోర్నాల చేరుకోవడానికి మాకే 2 గంటలకు పైగా ట్రాఫిక్ జామ్ అయింది. 30 ఏళ్ల నిరీక్షణ ఫలిం చి పశ్చిమ ప్రకాశం ఎడారిలో కృష్ణమ్మ ప్రవహిస్తుంటే ముసలి వారు, దివ్యాంగులు పరుగున వచ్చి ఆ నీటిని తలపై చల్లుకుంటూ భావోద్వేగంతో ఆనందభాష్పాలు రాల్చారు. లెక్కలతో సహా వాస్త వాలు చెప్పే దమ్ము మాకుంది. ఇప్పటికైనా అసత్య ప్రచారాలు మానుకోవాలని హితవు పలికారు.

## పనులు పూర్తి చేసింది కూటమి ప్రభుత్వమే.. ఇవిగో వాస్తవాలు

వెలిగొండ ప్రాజెక్టుపై వైసీపీ నాయకులు ప్రెస్‌మీట్‌లు పెట్టి పనికిమాలిన ప్రచారాలు చేయడం సిగ్గుచేటు. చరిత్ర, గణాంకా లు పరిశీలిస్తే ఎవరు ఈ ప్రాజెక్టుకు ఏం చేశారో పచ్చి నిజాలు బయటపడతాయి. 2008 ఆగస్టు 19న వైఎస్సార్ టన్నెల్-1కు, 2009 జూన్ 26న అప్పటి మంత్రి పొన్నాల లక్ష్మయ్య టన్నెల్-2కు శంకుస్థాపనలు చేశారు తప్ప అక్కడ జరిగింది నామమాత్రపు మట్టి పనులే. ఆ తర్వాత రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డిల హయాం లో రూ.2,417 కోట్ల పనులు జరిగాయి. చంద్రబాబు ప్రభుత్వం లో రూ.1,150 కోట్లు వెచ్చించి టన్నెల్-1లో 17.5 కిలోమీటర్లు, టన్నెల్-2లో 11.2 కిలోమీటర్ల మేర కఠినమైన తవ్వకం పనుల ను పూర్తి చేశాం. అంతకుముందు అసలు టన్నెల్ నిర్మాణాలే జరగలేదన్నది కాదనలేని సత్యం. శ్రీశైలం బ్యాక్ వాటర్ టన్నెల్స్ ద్వారా రావాలే తప్ప, ఇది ఆకాశం నుంచి పడే వర్షపు నీటితో నిండే ప్రాజెక్ట్ కాదు. అలాంటిది టన్నెల్ పూర్తి చేయకుండా, నీరు వచ్చే మార్గమే లేనప్పుడు జగన్‌రెడ్డి ప్రాజెక్టును ఎలా ప్రారంభిం చారో ప్రజలకే చెప్పాలి. 2019-24 మధ్య వైకాపా ఖర్చు పెట్టింది కేవలం రూ.850 కోట్లు మాత్రమే. అందులోనూ రూ.140 కోట్ల బిల్లులు కాంట్రాక్టర్లకు చెల్లించకుండా ఎగ్గొట్టి.. నేడు మా ప్రభు త్వంపై భారం మోపారు. టన్నెల్స్ రెండింటిలోనూ తవ్వకాలను అసంపూర్తిగా వదిలేయడమే కాకుండా టన్నెల్ లోపలే సుమారు 1.16 లక్షల టన్నుల మట్టిని తొలగించకుండా గాలికొదిలేశారు. అటు హెడ్ వర్క్స్, టన్నెల్ లైనింగ్ పూర్తి చేయలేదు. ఇటు నిర్వాసితులకు పునరావాసం, నయాపైసా పరిహారం ఇవ్వకుండా జాతికి అంకితం చేశామంటూ ప్రజల చెవుల్లో పూలు పెట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే చంద్రబాబు ఆదేశాలతో పనులు పరుగులు పెట్టాయి. జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు వారం వారం క్షేత్రస్థాయికి వెళ్లి అధికారులతో సమీక్షలు నిర్వహిస్తూ లోపాలను అక్కడికక్కడే పరిష్కరించారు. ఆ కష్టానికి ఫలితంగానే నేడు టన్నెల్స్ క్లియర్ అయి కృష్ణా జలాలు పశ్చిమ ప్రకాశం నేలను ముద్దాడుతున్నాయి. జగన్‌రెడ్డికి నిజంగా చిత్తశుద్ధి, ధైర్యం ఉంటే దోర్నాలకు వచ్చి ప్రజల స్పందన చూడాలి. వారి నిరసన సెగ ఎలా ఉంటుందో అప్పుడు తెలుస్తుంది. గోబెల్స్ తరహా అసత్య ప్రచారాలు మాని వాస్తవాలు తెలుసుకోవాలని హెచ్చరించారు.

## మీది 'ధనయజ్ఞం'.. చంద్రబాబుది 'ప్రజాయజ్ఞం'

వైసీపీ నాయకులు క్రెడిట్ చోరీ పద్ధతులు, తప్పుడు ప్రచారా లను మానుకోవాలి. రివర్స్ టెండరింగ్ పేరుతో బ్రహ్మాండంగా జరుగుతున్న పనులను ఆపేసి ప్రాజెక్టును ఐదేళ్లు నిర్వీర్యం చేసిన వారు ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని మాట్లాడుతున్నారు? జలయ జ్ఞం పేరుతో వారు చేసింది కేవలం 'ధనయజ్ఞం' చేస్తే..చంద్రబాబు చేస్తున్నది ప్రజల గొంతు తడిపే 'ప్రజాయజ్ఞం'. వైఎస్సార్ ఖర్చు పెట్టింది రూ.1,260 కోట్లు, జగన్‌రెడ్డి పెట్టింది కేవలం రూ.850 కోట్లు. తండ్రీకొడుకులు ఇద్దరూ కలిసి ప్రాజెక్టుపై ఖర్చు చేసింది రూ.2,175 కోట్లు మాత్రమే. ఆనాడు రోశయ్య, కిరణ్‌కుమా ర్‌రెడ్డిల హయాంలో రూ.2,417 కోట్ల పనులు జరిగాయి. చంద్రబాబు ప్రభుత్వ హయాంలో ఇప్పటివరకు రూ.3,250 కోట్లు ఖర్చు చేశాం. రాబోయే రెండేళ్లలో ఫేజ్-2 పనుల కోసం మరో రూ.1,906 కోట్లు వెచ్చించనున్నాం. వెలిగొండ ప్రాజెక్టు కోసం ఒక్క చంద్రబాబే మొత్తంగా రూ.5,400 కోట్లు ఖర్చు చేస్తుంటే, తండ్రీకొడుకులు నామమాత్రపు నిధులతో ప్రాజెక్టు అంతా తామే చేశామని చెప్పుకోవడం పచ్చి మోసం కాదా? కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కేవలం రెండేళ్ల వ్యవధిలోనే రూ.2,250 కోట్లు వెచ్చించి రికార్డు వేగంతో పనులు పూర్తి చేసింది. హెడ్ వర్క్స్, టన్నెల్ వర్క్స్, లైనింగ్ పనులను సమగ్రంగా పూర్తి చేశాం. ఆగస్టు 31న 10.4 టీఎంసీల నీటిని విడుదల చేసి తొలి దశలో 1.19 లక్షల ఎకరాలకు సాగునీటిని అందించారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో పెట్టిన నిర్వాసితుల సమస్యను పరిష్కరిస్తూ, రూ. 903 కోట్ల పరిహారాన్ని యుద్ధప్రాతిపదికన అందించాం. రెండో దశ పనులను కూడా అంతే వేగంగా పూర్తి చేసి ఉదయగిరి, నెల్లూరు, కడప జిల్లాలకు సాగు, తాగునీరు అందిస్తామని స్పష్టం చేశారు.

## పోలవరం ఎడమ కాలువతో ఉత్తరాంధ్రకు జలసిరి.. జగన్ విధ్వంసానికి కూటమి ప్రభుత్వ పరిష్కారం

ఒకవైపు రాయలసీమ, ప్రకాశం జిల్లాల దాహార్తిని తీరుస్తూ వెలిగొండ ప్రాజెక్టు ద్వారా 10.4 టీఎంసీల నీటిని విడుదల చేయ గా, మరోవైపు పోలవరం ఎడమ కాలువ పనులను పరుగులు పెట్టించి నాలుగు జిల్లాలకు నీరందించిన ఘనత సీఎం చంద్రబా బు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వానిదే. కాకినాడ, తూర్పు గోదావరి, అనకాపల్లి తదితర జిల్లాల పరిధిలోని 2.87 లక్షల ఎక రాలకు సాగునీటిని అందిస్తూ ఉత్తరాంధ్ర రైతాంగ ముఖాల్లో కూట మి ప్రభుత్వం చిరునవ్వులు పూయించింది. వైసీపీ నాయకులు 79 శాతం పనులు పూర్తి చేసేశామని పచ్చి అబద్ధాలు ప్రచారం చేస్తు న్నారు. అసలు హెడ్ వర్క్స్ చేయకుండా, కాలువల లైనింగ్ పూర్తి చేయకుండా, కొండలు-బండలను తొలగించకుండా, నదులపై ఆక్విడెక్టులు నిర్మించకుండా, నిర్వాసితులకు పునరావాసం కల్పించ కుండా 79 శాతం పనులు ఎలా పూర్తయ్యాయో చెప్పాలి. తమ కమీషన్లు, వాటాల కోసమే 'రివర్స్ టెండరింగ్' పేరుతో పోలవరం పనులను 17 నెలల పాటు అర్ధాంతరంగా నిలిపివేసి జీవనాడి లాంటి డయాఫ్రమ్ వాల్ విధ్వంసానికి జగన్‌రెడ్డి కారణమయ్యా రు. ఐదేళ్ల కాలంలో జగన్ సర్కార్ చేసింది కేవలం 2 శాతం పను లే. నిర్వాసితులకు ఒక్క రూపాయి కూడా పరిహారం ఇవ్వకుండా తీవ్ర అన్యాయం చేశారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే ఎడమ కాలువకు సంబంధించి 91% ఎర్త్ వర్క్స్, 70% లైనింగ్, 56% నిర్మాణాలు పూర్తయ్యాయి. మిగిలిన 30 శాతం పనులను పూర్తి చేయడానికి జగన్‌కు మనసొప్పలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్ల కాలంలోనే రూ.1,800 కోట్లు ఖర్చు చేసి అసంపూర్తిగా ఉన్న అడ్డంకులన్నింటినీ తొలగించింది. పురుషోత్తపట్నం, పుష్కర ఎత్తిపోతల పథకాల ద్వారా రోజుకు 5,000 క్యూసెక్కుల చొప్పున తరలిస్తూ, మొత్తంగా 30 టీఎంసీల గోదావరి జలాలను ఉత్తరాంధ్ర జిల్లాలకు చేరుస్తున్నాం. కాలువల ద్వారా పరవళ్లు తొక్కుతున్న గోదావరి నీటిని చూసి ఉత్తరాంధ్ర ప్రజలు, రైతులు జలహారతులు పడుతూ కూటమి ప్రభుత్వానికి బ్రహ్మరథం పడుతున్నారు. ఐదేళ్ల తన గొడ్డుబోతు పాలనలో రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన జగన్మోహన్ రెడ్డి, ఇప్పుడు కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక విషం చిమ్ముతున్నారు. కడవడు పాలలో ఒక్క విషపు చుక్క పడితే పాలన్నీ విషతుల్యమైనట్లే, రాష్ట్ర వ్యవస్థలను భ్రష్టు పట్టించేందుకు గోబెల్స్ తరహా ప్రచారాలతో వైకాపా కుట్రలు చేస్తోంది. ప్రజలు ఎంతో విజ్ఞులు, అప్రమత్తంగా ఉండి ఈ కుట్రలను తిప్పికొట్టాలి. చేసిన అభివృద్ధికి, ఇచ్చిన నీటికి లెక్కలు మా దగ్గరున్నాయి. ఇప్పటికైనా జగన్ తన క్రెడిట్ చోరీ బుద్ధిని, అబద్ధాల ప్రచారాలను మానుకోవాలని గట్టిగా హెచ్చరిస్తున్నాం.

## అభివృద్ధి నిరోధకుడు జగన్..

బడుగు, బలహీన వర్గాల పక్షపాతి చంద్రబాబు

రాష్ట్ర ప్రజలు ఏమాత్రం ఏమరపాటుతో ఉన్నా మళ్లీ గత వైకాపా పాలన నాటి చీకటి రోజులు దాపురించే ప్రమాదం ఉంది. ప్రజలంతా ఎంతో అప్రమత్తంగా ఉండి వాస్తవాలను గమనించాలి. బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, సమగ్ర అభివృద్ధి ఒక్క విజన రీ లీడర్ చంద్రబాబుతోనే సాధ్యమని నేటి పరిస్థితులు నిరూపి స్తున్నాయి. ఇటు పశ్చిమ ప్రకాశం, అటు ఉత్తరాంధ్రలోనైనా చంద్రబాబు చేస్తున్న ఈ ప్రజాయజ్ఞం వల్లే నేడు పేద ప్రజలు, బడుగు వర్గాలు కడుపునిండా మూడు పూట్లా అన్నం తినగలిగే భరోసా దక్కింది.

బీసీలు, బడుగు బలహీన వర్గాల పట్ల జగన్ రెడ్డిది మొదటి నుంచీ మోసపూరిత వైఖరే. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు ఉన్న 34 శాతం రిజర్వేషన్లను 24 శాతానికి తగ్గించి బడుగు వర్గాల రాజకీయ గొంతును నొక్కింది జగన్మోహన్ రెడ్డి కాదా? కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ముఖ్యమం త్రి చంద్రబాబు తిరిగి ఆ బీసీ రిజర్వేషన్లను 34 శాతానికి పునరు ద్ధరించారు. ఇవాళ స్థానిక సంస్థల ఎన్నికలు జరగకుండా కోర్టుల కు వెళ్లి అడ్డంకులు సృష్టించడం, ప్రాజెక్టుల నిర్మాణాన్ని అడ్డుకోవ డం, రిజర్వేషన్లపై కుట్రలు చేయడం... ఇలా ప్రతి విషయంలోనూ వైకాపా అభివృద్ధి నిరోధక శక్తుల మాదిరిగా వ్యవహరిస్తోంది. ఇకనైనా దుష్ప్రచారాలు మానుకోవాలని హితవుపలికారు.

# కేంద్ర యోగా, ప్రకృతి వైద్య పరిశోధన సంస్థ

- రూ.100 కోట్లు.. 100 పడకలతో ఏర్పాటు
- కేంద్రం నుంచి అధికారికంగా సమాచారం
- రూ.9.94 కోట్లతో త్వరలో ప్రాథమిక పనులు
- వైద్యఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి



అమరావతి(చైతన్యరథం): గుంటూరు నగర సమీపంలోని ప్రత్తిపాడు మండలం నడింపాలెంలో కేంద్ర యోగా-ప్రకృతి వైద్య పరిశోధన సంస్థ (సీఆర్ఐవైఎన్) ఏర్పాటు పనులు వేగం పుంజుకున్నాయి. కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని సెంట్రల్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ ఇన్ యోగా అండ్ నేచురోపతి ద్వారా 100 పడకల ఆసుపత్రితో ఈ సంస్థను ఏర్పాటు చేయనున్నారు. సంస్థ ఏర్పాటుపై కేంద్రం నుంచి అధికారిక సమాచారం వచ్చినట్లు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ తెలిపారు ఇందుకు తగ్గట్లు సంస్థ ఏర్పాటుకు అవస రమైన భూమి, రహదారి, డ్రెయినేజీ, స్థల సమతలీకరణ తదితర ప్రాథమిక పనుల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ. 9.94 కోట్లను మంజూరు చేసినందున తదుపరి పనుల్లో మరింత పెరుగు తుందని చెప్పారు. ప్రతిపాదిత స్థలంలో చేపట్టాల్సిన పనులపై రాష్ట్ర, జిల్లా అధికారులు, సీఆర్ఐవైఎన్, కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ ప్రతినిధులతో ఆగస్టు 4న సంయుక్తంగా పరిశీలించారు. స్థల అనుకూలత, మౌలికవసతులను పరిశీలించిన అనంతరం పలు నిర్ణయాలు తీసుకున్నారు. అంగీకరించిన పనులను మూడు నెలల్లో పూర్తి చేసి భూమిని సీఆర్ఐవైఎన్‌కు అప్పగించేలా చర్యలు చేపట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

### రూ.9.94 కోట్లతో ప్రాథమిక పనులు

మంజూరైన రూ. 9.94 కోట్లలో రూ. 6.74 కోట్లు భూ సంబంధిత అవసరాలకు, రూ. 3.20 కోట్లు స్థల నింపుదల, సమతలీకరణకు కేటాయించారు. ప్రాంగణంలోని కొన్ని ప్రాంతాలు ఎన్‌హెచ్-16స్థాయి కంటే 2-3 మీటర్ల మేర దిగువన ఉండటంతో అవసరమైన మేరకు నాణ్యమైన మట్టితో నింపి నిర్దేశిత స్థాయికి తీసుకురానున్నారు.
వర్షపు నీటి సహజ ప్రవాహా నికి ఆటంకం లేకుండా చర్యలు తీసుకోనున్నారు. సంస్థకు నేరుగా చేరుకునేలా జాతీయ రహదారి-16 నుంచి ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూమి మీదుగా 40 అడుగు ల వెడల్పుతో అప్రోచ్ రోడ్డు నిర్మించనున్నారు.

### కేంద్రం నుంచి రూ.100 కోట్ల గ్రాంట్

సీఆర్ఐవైఎన్ ఏర్పాటుకు కేంద్రఆయుష్ మంత్రిత్వ శాఖ రూ. 100కోట్ల గ్రాంట్ అందించనుంది. సంస్థకు అవసరమైన భూమిని రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చాల్సి ఉండటంతో, ప్రస్తుతం సంస్థ ఏర్పాటుకోసం అవసరమైన ప్రాథమిక పనులను చేపడుతోంది. ఆగస్టు 24న సంయుక్త తనిఖీలో తీసుకున్న నిర్ణ యాలకు కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ ఆమోదం తెలిపింది. ఈ మేరకు ఆగస్టు 25న కేంద్రం రాష్ట్ర ఆయుష్ శాఖ డైరెక్టర్‌కు రాసిన లేఖలో నడింపాలెంలో 100 పడకల ఆసుపత్రితో సీఆర్ఐవైఎన్ ఏర్పాటుకు భూమిని స్వీకరించి తదుపరిచర్యలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు పేర్కొంది. అంగీకరించిన పనులన్నీ మూడు నెలల్లో పూర్తిచేయాలని కోరింది. గుంటూరు నగరానికి సమీపంలో, ఎన్‌హెచ్-16కు ఆనుకుని సంస్థ ఏర్పాటు కానుండటంతో రాకపోకలు సులభతరం కానున్నాయి. అప్రోచ్ రోడ్డు, బస్‌స్టాప్ వంటి సదుపాయాలతో ప్రజలకు అందుబాటు మెరుగుపడనుంది. ప్రాథమిక పనులు పూర్తయిన అనంతరం భూమిని సీఆర్ఐవైఎన్‌కు అప్పగించే ప్రక్రియ పూర్తి చేయనున్నారు. ఆ తర్వాత సంస్థ నిర్మాణానికి సంబంధించిన తదుపరి చర్యలు ప్రారంభమవుతాయి. నిర్మాణం పూర్తయితే 2028 నాటికి సీఆర్ఐవైఎన్ కార్యకలాపాలు ప్రారంభమయ్యే అవకాశం ఉందని ఆయుష్ కమిషనర్ గోపాలకృష్ణ తెలిపారు.

### అందుబాటులోకి రానున్న ప్రత్యేక చికిత్సలు

100 పడకల ఇన్‌పేషెంట్ ఆస్పత్రి, బహుళ విభాగాల పరిశో ధనా కేంద్రంగా దీనిని అభివృద్ధి చేయనున్నారు. పురుషులు, మహిళలకు ప్రత్యేక సాధారణ, ప్రత్యేక వార్డులు ఉంటాయి. లిఔట్ పేషెంట్ విభాగంలో వైద్య సంప్రదింపులు, ఆరోగ్య పరీక్షలు,జీవనశైలి, ఆహార సలహాలు,ఫాలోఅప్, నివారణాత్మక ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తారు. అవస రాన్ని బట్టి రోగులను ఇన్‌పేషెంట్‌గా చేర్చి చికిత్స అందించడం, ల్యాబ్ పరీక్షలు లేదా అవసరమైన ఇతర వైద్య సంస్థలకు రిఫర్ చేస్తారు.మధుమేహం,రక్తపోటు, ఊబకాయం, మెటబాలిక్ సిండ్రోమ్, కీళ్ల వ్యాధులు, దీర్ఘకాలిక నొప్పులు, జీర్ణ-శ్వాసకోశ సమస్యలు, ఒత్తిడి, ఆందోళన, నిద్ర సమస్యలు, మహిళల ఆరోగ్య సమస్యలు, నాడీ సంబంధిత పునరావాస పరిస్థితులకు చికిత్స అందిస్తారు. పురుషులు, మహిళలకు వేర్వేరు నేచురోపతి చికిత్సా విభాగాల్లో హైడ్రోథెరపీ, మసాజ్, మడ్ థెరపీ, మడ్ బాత్, స్టీమ్-సౌనా, హిప్, స్పైనల్ బాత్‌లు, ప్యాక్స్, కంప్రెస్‌లు తదితర చికిత్సలు ఉంటాయి. ఫిజి యోథెరపీ, ఆక్యుపంక్చర్, యోగా సేవలు కూడా అందుబాటులో ఉంటాయి. పురుషులు, మహిళలకు ప్రత్యేక యోగాహాళ్లలో ఆసనాలు, ప్రాణాయామం, ధ్యానం, యోగా నిద్ర, యోగిక్ క్రియాలు నిర్వహిస్తారు. రోగుల ఆరోగ్య అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక నేచురోపతి డైట్‌కిచెన్ ద్వారా చికిత్సా ఆహారం అందిస్తారు. సుమారు 300 మంది సామర్థ్యంతో కాన్ఫరెన్స్ హాల్, వాకింగ్ ట్రాక్‌లు, ఔషధ మొక్కలు, ఓపెన్ ఎయిర్ ఆడిటోరియం ఏర్పాటు చేయనున్నారు.

### పరిశోధన, ఉపాధికి ప్రాధాన్యం

హెమటాలజీ, బయోకెమిస్ట్రీ, న్యూరో-సైకోఫిజియాలజీ, మాలి క్యులర్ బయాలజీ ప్రయోగశాలలతో యోగా-నేచురోపతిపై శాస్త్రీయ పరిశోధనలు, క్లినికల్ అధ్యయనాలు చేపడతారు. సుమా రు 100-120 మందికి ప్రత్యక్ష ఉపాధి, 15-20 మంది బీఎ న్‌వైఎస్ వైద్యులు సహా వివిధ నిపుణులకు అవకాశాలు లభించ నున్నాయి. ఆరోగ్య శిబిరాలు, యోగా, ప్రజా అవగాహన కార్యక్రమాలతో ప్రజలకు సమగ్ర యోగా-నేచురోపతి సేవలు అందుబాటులోకి రానున్నాయి.



---

## ప్రైవేటు, అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో 25 శాతం ఉచిత ప్రవేశాలు

**పకడ్బందీగా అమలు చేసేందుకు కమిటీ**

అమరావతి(చైతన్యరథం): ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం ఉచిత ప్రవేశాల మార్గదర్శకాల సవరణకు రాష్ట్రస్థాయి కమిటీ ఏర్పాటుచేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. విద్యా హక్కు చట్టం 2009 సెక్షన్ 12(1)(సీ) ప్రకారం.. రాష్ట్రంలోని ప్రైవేటు అన్-ఎయిడెడ్ పాఠశాలల్లో నిరుపేద, బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు 25 శాతం ఉచిత ప్రవేశాలు కల్పించేందుకు ఉన్న మార్గదర్శకాలను సవరించే దిశగా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సుప్రీంకోర్టు ఈ ఏడాది జనవరి 13న ఇచ్చిన తీర్పు ప్రకారం... జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ జారీ చేసిన ఆదేశాలకు అనుగుణంగా ప్రస్తుత నిబంధనలను సవరించి, పకడ్బందీగా అమలు చేసేందుకు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ చైర్‌పర్సన్‌గా 16మంది సభ్యులతో కూడిన రాష్ట్ర స్థాయి కమిటీని ప్రభుత్వం




ఏర్పాటు చేసింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి జె. శ్యామలరావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కమిటీకి పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ సమీమ్ అన్సారియా చైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తారు.

## స్నేహితులే కిడ్నాపర్లు

**ముగ్గురు నిందితుల అరెస్ట్**

**యాప్ నిర్వాహకుడికి విముక్తి**

తిరుపతి(చైతన్యరథం): 'నాని క్రికెట్ ప్రిడిక్షన్'టెలిగ్రామ్ యాప్ నిర్వాహకుడు సుమంత్ కిడ్నాప్ కేసును తిరుపతి రూరల్ పోలీసులు ఛేదించారు. ఈ కేసులో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. మరికొందరు పరారీలో ఉన్నారు. వారి కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు తిరుపతి రూరల్ పోలీసులు తెలిపారు. టెలిగ్రామ్ యాప్‌ను నార్త్ ఇండియా వ్యక్తులకు రూ. 6 కోట్లకు సుమంత్ విక్రయించాడని చెప్పారు. ఆ నగదు లావాదేవీలు హవాలా మార్గంలో జరిగాయని వివరించారు. ఈ రూ. 6 కోట్లపై సుమంత్ స్నేహితులు యశ్వంత్, మనోజ్, గౌతమ్, బాలాజీ, చరణ్, వాజిద్‌లు కన్నేశారని పేర్కొన్నారు.

ఈ నేపథ్యంలో సుమంత్ కిడ్నాప్‌కు వారంతా పథక రచన చేశారని పోలీసులు తెలిపారు. దాంతో ఇండోనేషియా నుంచి వచ్చిన సుమంత్‌ను బెంగళూరు సమీపంలో కిడ్నాప్ చేశారని చెప్పారు. అనంతరం అతడిని హైదరాబాద్‌కు తరలించి కేపీహెచ్‌బీ కాలనీలోని అపార్ట్‌మెంట్‌లో బంధించారని వివరించారు. తనను కిడ్నాప్ చేశారంటూ యూరప్‌లోని తన గర్ల్‌ఫ్రెండ్‌కు సుమంత్ వాట్సప్ మెసేజ్ పంపాడని పేర్కొన్నారు. దాంతో కేపీహెచ్‌బీ పోలీసులను ఆమె ఆశ్రయించిందని తెలిపారు. దీంతో బాధితుడు సుమంత్‌కు కిడ్నా పర్ల చెర నుంచి విముక్తి కలిగించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా చంద్రగిరికి చెందిన బాలాజీ, చరణ్, వాజిద్‌లను అరెస్ట్ చేశామని తెలిపారు. పరారీలో ఉన్న యశ్వంత్, మనోజ్, గౌతమ్‌ల కోసం గాలిస్తున్నామని తిరుపతి రూరల్ పోలీసులు వివరించారు.



# ఏపీ బీసీ నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి...
## కొత్త పథకానికి ప్రభుత్వం శ్రీకారం



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బీసీ నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు కొత్త పథకాన్ని ప్రవేశపెట్టింది. జనరిక్ మెడిసిన్ షాపులు ఏర్పాటు చేసి నాణ్యమైన మందులను తక్కువ ధరకే అందించడం ద్వారా ప్రజలకు ఉపయోగపడటమే కాకుండా, ఫార్మసీ చదువు పూర్తి చేసిన యువతకు ఉపాధి మార్గం కల్పించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలు జారీ చేశారు. ఈ పథకం ప్రకారం ప్రతి మండలంలోనూ జనరిక్ మందుల దుకాణాలు ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. బీఫార్మసీ లేదా డీఫార్మసీ పూర్తి చేసిన బీసీ అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చు. ఒక్కో షాపు ఏర్పాటుకు సుమారు రూ.8 లక్షలు అవసరమవుతుంది. అందులో ప్రభుత్వం రూ.4 లక్షలు సబ్సిడీ రూపంలో రాయితీ ఇస్తుంది. మిగతా మొత్తం బ్యాంకు రుణం ద్వారా అందుతుంది. దీనివల్ల లబ్ధిదారులు పెద్ద ఎత్తున స్వంత పెట్టుబడి పెట్టాల్సిన అవసరం లేదు. షాపు స్థలం, గది సమకూర్చుకునే బాధ్యత మాత్రం అభ్యర్థులదే. ఈ చర్య ద్వారా నిరుద్యోగ సమస్య తగ్గడంతో పాటు సాధారణ ప్రజలకు మందుల ఖర్చు తగ్గుతుందని అధికారులు భావిస్తున్నారు. న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం జనరిక్ మందుల వినియోగాన్ని పెంచి పేదలపై వైద్య భారం తగ్గించాలని యువ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తోంది.

**తక్కువ ధరలోనే బ్రాండెడ్ మందులు**

ఈ స్కీం ముఖ్య ఉద్దేశం బీసీ యువతకు స్థిరమైన ఆదాయ మార్గం కల్పించడం. రాష్ట్రంలో అనేక మంది ఫార్మసీ గ్రాడ్యుయేట్లు ఉపాధి కోసం ఎదురుచూస్తున్నారు. వారికి ఈ పథకం గొప్ప అవకాశం. జనరిక్ మందులు బ్రాండెడ్ మందుల కంటే చాలా తక్కువ ధరలో లభిస్తాయి. ఉదాహరణకు సాధారణ మెడికల్ షాపుల్లో రూ.100 నుంచి 130 వరకు ఉండే మందులు జనరిక్ షాపుల్లో రూ.20 నుంచి 30 మధ్యనే అందుతాయి. దీనివల్ల దీర్ఘకాలిక వ్యాధులైన షుగర్, బీపీ వంటి వాటికి నెలవారీ ఖర్చు బాగా తగ్గుతుంది. ప్రభుత్వం ఈ షాపుల ద్వారా నాణ్యమైన మందులు అందుబాటులో ఉంచి ప్రజల ఆరోగ్య భద్రతను కూడా పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది. అదే సమయంలో యువతకు వ్యాపార అనుభవం, స్వతంత్ర ఆదాయం లభిస్తుంది. బీసీ కార్పొరేషన్ ద్వారా ఈ స్కీం అమలు అవుతోంది. దరఖాస్తులు స్వీకరించి అర్హులను ఎంపిక చేసి బ్యాంకు రుణాలు సులభంగా అందేలా చర్యలు తీసుకుంటున్నారు. షాపు ఏర్పాటు తర్వాత సరఫరా గొలుసు, నిర్వహణపై శిక్షణ కూడా ఇవ్వవచ్చని అంచనా. ఈ విధంగా ఒకవైపు ఉపాధి, మరోవైపు సామాజిక సేవ రెండూ జరుగుతాయి.

**ఎవరూ అర్హులు**

అర్హతల విషయంలో స్పష్టమైన నిబంధనలు ఉన్నాయి. బీసీ కులసర్టిఫికేట్ ఉన్నవారు, ఆంధ్రప్రదేశ్ నివాసులు, వయసు 21 నుంచి 60 సంవత్సరాల మధ్య ఉన్నవారు అర్హులు. బీపీఎల్ కేటగిరీలో ఉండాలి. అత్యంత ముఖ్యంగా డీఫార్మసీ లేదా బీఫార్మసీ లేదా ఎంఫార్మసీ పూర్తి చేసి ఉండాలి. ఈ అర్హతలు నెరవేర్చినవారు మాత్రమే జనరిక్ ఫార్మసీ స్కీంకు దరఖాస్తు చేయవచ్చు. సాధారణ స్వయం ఉపాధి స్కీములకు ఇతర నిబంధనలు ఉన్నా, జనరిక్ షాపులకు ఫార్మసీ క్వాలిఫికేషన్ తప్పనిసరి. కులసర్టిఫికేట్, ఆదాయ సర్టిఫికేట్, విద్యా అర్హత పత్రాలు, ఆధార్, బ్యాంకు ఖాతా వివరాలు అవసరం. షాపు కోసం తగిన స్థలం లేదా గది సమకూర్చుకునే సామర్థ్యం ఉండాలి. లబ్ధిదారులు స్థలం ఏర్పాటు చేసుకున్న తర్వాతనే మిగతా ప్రక్రియ ముందుకు సాగుతుంది. ఈ నిబంధనలు అనుసరించి ఎంపిక ప్రక్రియ జరుగుతుంది. అధికారిక పోర్టల్ ద్వారా దరఖాస్తు చేస్తే పారదర్శకత పెరుగుతుంది.

# దేవాలయాన్ని అడ్డుపెట్టుకుని రాజకీయం చేయడం దుర్మార్గం

**●అమ్మవారి మంగళసూత్రం పోవడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉంది : ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్**



పొన్నూరు (చైతన్యరథం): పెదకాకాని శివాలయంలో బంగారు ఆభరణాల చోరీ వివాదాన్ని వైసీపీ రాజకీయ లబ్ధికోసం ప్రయత్నం చేయడం దుర్మార్గమని టీడీపీ సీనియర్ నేత, ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం పెదకాకాని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ... పెదకాకాని శివాలయంలో మంగళసూత్రం చోరీ కేసులో నిందితుడు అరెస్టు చేయడం జరిగిందని, ఆలయ ప్రతిష్ఠ దెబ్బతీసేలా వైసీపీ నేత అంబటి మురళి మాట్లాడుతున్నారని, రాజకీయంగా వాడుకోవాలనే ఉద్దేశం వైసీపీ డీఎన్ఏలో ఉందన్నారు. దొంగ వెనుక అంబటి మురళి ఉండి హెబియస్ కార్పస్ పిటిషన్ వేయించారంటే వారి దురుద్దేశం ఏపాటితో అర్థం చేసుకోవచ్చునన్నారు. అంబటి మురళీ వద్ద సమాచారం ఉంటే అసలు దొంగ ఎవరో బయట పెట్టాలని, కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠ దిగజార్చాలని ఆరోపణలు చేయడం సరికాదన్నారు. నాపై ఆరోపణలు చేయాలి కానీ అమ్మవారి ప్రతిష్ఠ దిగజార్చడం ఎందుకు? అని ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ మండిపడ్డారు. దేవాలయాన్ని అడ్డం పెట్టుకుని రాజకీయం చేయడం ఎందుకు? అమ్మవారిని అపవిత్రం చేసినందుకు అంబటి మురళి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అమ్మవారి మంగళసూత్రం పోవడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని, రణధీర్ అనే వ్యక్తిని వైసీపీ హయాంలో నియమించారని, కుట్రలో రణధీర్ వెనుక ఎవరెవరున్నారో దర్యాప్తు చేయాలన్నారు. 14న చోరీ జరిగితే పోలీసుల కంటే ఎక్కువ సమాచారం మురళి వద్ద ఎలా ఉందో చెప్పాలని, అమ్మవారి ప్రతిష్ఠ దిగజార్చేందుకు ప్రయత్నించిన వారి కఠినంగా శిక్షిస్తామని ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ వెల్లడించారు.

# ఉయ్యూరు మండలంలో ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమం



ఉయ్యూరు (చైతన్యరథం): ఉయ్యూరు మండలం పెద్ద ఓగిరాల గ్రామంలో నిర్వహించిన "ఇంటింటికీ తెలుగుదేశం" కార్యక్రమంలో కృష్ణాజిల్లా తెలుగు యువత అధ్యక్షులు దండమూడిచౌదరి పాల్గొన్నారు. గ్రామంలోని ప్రతి ఇంటినీ సందర్శిస్తూ ప్రజలను ఆత్మీయంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం రాష్ట్రంలో కొనసాగుతున్న అభివృద్ధి, సంక్షేమం, ప్రజా సంక్షేమ విధానాలను ప్రజలకు వివరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, అర్హులైన ప్రతి కుటుంబానికి అందుతున్న ప్రయోజనాలు, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలపై ప్రజలతో విస్తృతంగా చర్చించారు. ప్రజల సమస్యలను నేరుగా వారి ఇళ్ల వద్దే తెలుసుకుంటూ, వారి అభిప్రాయాలను, అవసరాలను, స్థానిక సమస్యలను స్వయంగా విని పరిష్కార దిశగా ముందుకు తీసుకెళ్లడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం. "ప్రజల వద్దకు వెళ్లి వారి మాట వినడం... వారి సమస్యను మన సమస్యగా భావించి పరిష్కారం కోసం కృషి చేయడం" అనే లక్ష్యంతో తెలుగుదేశం పార్టీ ప్రజల మధ్య నిరంతరం పనిచేస్తోంది. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ... ప్రజల సమస్యలకు అండగా నిలుస్తూ... అభివృద్ధిని ప్రతి గడపకు చేర్చే లక్ష్యంతో... ఇంటింటికీ తెలుగుదేశం... ప్రతి గడపకూ అభివృద్ధి – సంక్షేమం! ఈ కార్యక్రమంలో పెద్ద ఓగిరాల గ్రామ పార్టీ అధ్యక్షులు ప్రసాద్ రెడ్డి, పొత్తు రెడ్డి, సాంబశివరావు, సుభాని, అరవింద్, మనోహర్, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాసేవ కోసమే యువత ముందుకు రావాలి

**●టీడీపీలోకి యువనాయకురాలు కొల్లాబత్తుల ప్రసూన.. స్వాగతించిన ఎంపీ శ్రీభరత్**



విశాఖపట్నం (చైతన్యరథం): తెలుగుదేశం పార్టీలోకి యువనాయకురాలు కొల్లాబత్తుల ప్రసూన రాజకీయ రంగప్రవేశం చేయడాన్ని విశాఖపట్నం పార్లమెంట్‌సభ్యులు మతుకుమిల్లి శ్రీభరత్ స్వాగతించారు. విశాఖలోని టీడీపీ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో 47వ వార్డుతో పాటు వివిధ వార్డుల నుంచి వచ్చిన ప్రజాప్రతినిధులు, సీనియర్ కార్యకర్తలు, మహిళా నాయకులు, పార్టీ శ్రేణుల సమక్షంలో జరిగిన కార్యక్రమంలో ప్రసూనతో పాటు ఆమె అనుచరులు 13 మందికి ఎంపీ శ్రీభరత్ పార్టీ కండువా కప్పి ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా శ్రీభరత్ మాట్లాడుతూ... బీటెక్, ఎంబీఏ పూర్తి చేసి దుబాయ్‌లో మంచి ఉద్యోగాన్ని వదులుకుని ప్రజాజీవితంలోకి రావాలనే నిర్ణయం తీసుకోవడం అభినందనీయమన్నారు.

**ప్రజాసేవే రాజకీయాలకు ప్రాథమిక లక్ష్యం**

యువత మంచి నాయకులను స్ఫూర్తిగా తీసుకుని, ప్రజలకు ఉపయోగపడే విధంగా రాజకీయాల్లో ముందుకు సాగాలని శ్రీభరత్ ఆకాంక్షించారు. మంచి పేరు సంపాదించుకునేలా పనిచేస్తేనే రాజకీయ జీవితం సార్థకమవుతుందని అన్నారు.

**అభివృద్ధితో పాటు జీవనశైలిలో మార్పు అవసరం**

రాష్ట్రంలో పెట్టుబడులు రావడం, పరిశ్రమలు ఏర్పడటం, ఉద్యోగాలు లభించడం మాత్రమే అభివృద్ధికి కొలమానం కాదని శ్రీభరత్ అన్నారు. ప్రజల జీవనశైలిలో కూడా సానుకూల మార్పు రావాల్సిన అవసరం ఉందన్నారు. విశాఖపట్నానికి పర్యాటకులు పెద్ద సంఖ్యలో వస్తున్న నేపథ్యంలో నగరాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు.

**చట్టాలను గౌరవించే పౌర సమాజం అవసరం**

ప్రపంచంలోని అభివృద్ధి చెందిన నగరాల్లో ప్రజలు చట్టాలను క్రమశిక్షణతో పాటిస్తున్నారని, మన నగరాల్లో కూడా అదే సంస్కృతి పెంపొందాల్సిన అవసరం ఉందని శ్రీభరత్ అన్నారు. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు అభివృద్ధి కోసం పనిచేస్తున్నప్పటికీ ప్రజల సహకారం లేకుండా సంపూర్ణ మార్పు సాధ్యం కాదన్నారు. మార్పు ఒక్కరోజులో రాదని, నిబద్ధతతో, ఓపికతో నిరంతరం పనిచేస్తే కాలక్రమేణా మంచి ఫలితాలు వస్తాయని శ్రీభరత్ పేర్కొన్నారు.

**పోలవరం పూర్తయితే ఉత్తరాంధ్రకు నీటి భద్రత**

వర్షాలు సక్రమంగా లేకపోవడంతో భూగర్భ జలాలు తగ్గిపోయి అనేక ప్రాంతాల్లో నీటి సమస్య తలెత్తిందని శ్రీభరత్ తెలిపారు. పోలవరం ప్రాజెక్టు పూర్తయితే ఏడాది పొడవునా నీటి లభ్యతకు మరింత భరోసా ఏర్పడుతుందని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయడంపై ప్రత్యేక దృష్టి సారించారని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో ప్రాజెక్టు పనులు ఆలస్యం కావడంతో నిర్మాణ వ్యయం గణనీయంగా పెరిగిందని శ్రీభరత్ పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వం పోలవరం పనులను వేగవంతం చేసి, ఈ టర్మ్‌లో ప్రాజెక్టును పూర్తి చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోందన్నారు. ఇప్పటికే అనకాపల్లి ప్రాంతానికి గోదావరి జలాలు చేరడం శుభపరిణామమని, త్వరలోనే విశాఖపట్నానికి కూడా పోలవరం ఎడమ కాలువ ద్వారా నీరు అందుబాటులోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రానున్న కాలంలో ఉత్తరాంధ్రకు నీటిని తీసుకురావడమే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు లక్ష్యమన్నారు.

**కలిసికట్టుగా పనిచేస్తే వార్డుల అభివృద్ధి వేగవంతం**

కొల్లాబత్తుల ప్రసూన స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమన్వయంతో పనిచేయాలని శ్రీభరత్ సూచించారు. వార్డులోని అన్ని వర్గాలను కలుపుకుని ముందుకు వెళ్లే అభివృద్ధి కార్యక్రమాలను సమన్వయంతో అమలు చేయగలమన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ నాయకులు, కార్యకర్తలు అందరూ కలిసికట్టుగా పనిచేసి వార్డుల అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. "మంచి దారిని ఎంచుకుని, ప్రజలకు సేవ చేస్తూ మంచి పేరు సంపాదించుకోవాలి. ప్రసూనకి, ఆమెతో పాటు పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ తెలుగుదేశం పార్టీలోకి హృదయపూర్వక స్వాగతం" అని ఎంపీ శ్రీభరత్ అన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖ టీడీపీ ఉత్తర నియోజకవర్గం పరిశీలకులు కిమిడి రామ్ మల్లిక్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల వద్దకు వెళ్తున్నాం.. సమస్యలు తీరుస్తాం: ఎమ్మెల్యే యార్లగడ్డ

గన్నవరం (చైతన్యరథం): రామవరప్పాడు గ్రామాన్ని అన్ని రంగాల్లో సమగ్రంగా అభివృద్ధి చేయడమే తమ ధ్యేయమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు స్పష్టం చేశారు. గ్రామంలో రూ.69 లక్షల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించిన రెండు బీటీ రోడ్లను గురువారం ఆయన ప్రారంభించారు. హనుమాన్ నగర్, నెహ్రూ నగర్ ప్రాంతాల్లో "2 ఏళ్ల నమ్మకం – అభివృద్ధి, సంక్షేమం" కార్యక్రమంలో భాగంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందిస్తూ అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యమిస్తూ ఇప్పటివరకు రూ.15.39 కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేపట్టినట్లు వెల్లడించారు. జలజీవన్ మిషన్ కింద రూ.3.31 కోట్లతో ఓహెచ్ఎస్ఆర్ ట్యాంక్, రూ.84 లక్షలతో విలేజ్ హెల్త్ క్లినిక్, ఎలక్ట్రిక్ సబ్ స్టేషన్ల కోసం రూ.8.40 కోట్లు, అంతర్గత సీసీ రోడ్లకు రూ.32 లక్షలు, డ్రైన్ల నిర్మాణానికి రూ.33 లక్షలు కేటాయించి అభివృద్ధి చేశామని వివరించారు.

## గిరిజన సంక్షేమానికి కూటమి ప్రభుత్వం మరో ముందడుగు

**● అచ్చమ్మకుంట తండాకు పశువైద్యశాల... రాష్ట్ర టీడీపీ ఎస్టీ సెల్ అధ్యక్షులు యం. ధారునాయక్**



మాచర్ల (చైతన్యరథం): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధ్యక్షతన రాష్ట్ర సచివాలయంలో జరిగిన 1393వ (56వ) క్యాబినెట్ సమావేశంలో, పల్నాడు జిల్లా, మాచర్ల మండలం, అచ్చమ్మకుంట తండా గ్రామంలో పశువైద్యశాల ఏర్పాటుకు రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం లభించడం పట్ల రాష్ట్ర టీడీపీ ఎస్టీ సెల్ అధ్యక్షులు యం.ధారు నాయక్ హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో గిరిజన అభివృద్ధియే రాష్ట్ర అభివృద్ధిగా భావించి, గిరిజనుల సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి, మంత్రి నారా లోకేష్‌కి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మారుమూల గిరిజన తండాలకు సైతం సమతుల్యమైన అభివృద్ధి ఫలాలు అందే విధంగా చేయడమే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం యొక్క అంతిమ లక్ష్యమని పేర్కొన్నారు. అచ్చమ్మకుంట తండా గ్రామం పరిసర ప్రాంతాల్లో వేలాది ఆవులు, మేకలు, గొర్రెలు మరియు ఇతర పశువులపై ఆధారపడి జీవిస్తున్న గిరిజన పేద ప్రజల జీవనోపాధి పరిరక్షణతో పాటు, పశువుల సంక్షేమాన్ని ప్రధానంగా పరిగణనలోకి తీసుకుని పశువైద్యశాల ఏర్పాటు అత్యంత ఆవశ్యకమని ప్రభుత్వం భావించిందని ఆయన పేర్కొన్నారు. "నా ఎస్సీ.. నా ఎస్టీ" వంటి మాయమాటలతో కాలం గడిపి, ఎటువంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టకుండా ఎస్సీ, ఎస్టీలను ద్రోహం చేసిన వైయస్ జగన్మోహన్ రెడ్డిని ప్రజలు ఇక ఏమాత్రం నమ్మడం లేదని యం. ధారునాయక్ విమర్శించారు. జగన్మోహన్ రెడ్డి ఇకనైనా కుళ్ళు కుతంత్రాలతో కూడిన తన జగన్మోహన రాజకీయ నాటకాన్ని ఆపాలని యం. ధారునాయక్ హితవు పలికారు.

## బాపట్ల ఎమ్మెల్యే నరేంద్ర వర్మకు సినీ నటుల ప్రశంస

**●సినీ నటుడు శ్రీకాంత్, మేజర్ రవి చిత్ర బృందం బాపట్ల సూర్యలంక సందర్శన**

**●పర్యాటక రంగ అభివృద్ధికి ఎమ్మెల్యే నరేంద్ర వర్మ రాజు కృషి ప్రశంసనీయం**



బాపట్ల (చైతన్యరథం): ఎమ్మెల్యేవేగేశన నరేంద్ర వర్మ రాజును సినీ నటులు ప్రశంసించారు. అందమైన సూర్యలంక అభివృద్ధికి అనుబంధమైన అభివృద్ధితో పర్యాటక మణిహారంగా తీర్చిదిద్దుతున్న ఎమ్మెల్యే కృషి అభినందనీయమని అన్నారు. ప్రసిద్ధ పర్యాటక కేంద్రమైన సుందర సూర్యలంక సముద్ర తీరంలో సినీనటులు సందడి చేశారు. ప్రముఖ హీరో శ్రీకాంత్, మలయాళ స్టార్ డైరెక్టర్, నటుడు మేజర్ రవి తమ చిత్ర బృందంతో సూర్యలంక తీరాన్ని సందర్శించారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వీరంతా సూర్యలంక సందర్శించారు. ఈ సందర్భంగా బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు ఘన స్వాగతం పలికారు. యాగంటి రిసార్ట్స్ వేదికగా జరిగిన ఈ ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే నరేంద్రవర్మరాజు, గంటా శ్రీనివాసరావు, హీరో శ్రీకాంత్ తదితరులు సుదీర్ఘంగా సూర్యలంక అభివృద్ధిపై సంభాషించారు. ఈ సందర్భంగా హీరో శ్రీకాంత్ మాట్లాడుతూ... ఒక చక్కటి పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతున్న సముద్ర తీరంలో గడపటం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఇక్కడి ప్రకృతి సౌందర్యం, అలల హోరు మనసుకు ఎంతో ప్రశాంతతను ఇస్తున్నాయని కొనియాడారు. ఈ సుందర తీరం సినిమా షూటింగ్ లొకేషన్స్‌కు ఎంతో అద్భుతంగా, అనుకూలంగా ఉందని పేర్కొన్నారు. బాపట్ల నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి బాటలో నడిపిస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర వర్మ రాజు, సూర్యలంక తీర ప్రాంతాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దేందుకు చేస్తున్న ప్రత్యేక కృషిని ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ ప్రశంసించారు. పర్యాటకులకు అంతర్జాతీయ స్థాయి వసతులు కల్పించడంతో పాటు, ఈ ప్రాంతాన్ని ఒక మేజర్ టూరిజం హబ్‌గా మార్చేందుకు ఎమ్మెల్యే చేస్తున్న నిరంతర ప్రయత్నాలు, ప్రణాళికలను వారు అభినందించారు. ఈ ప్రత్యేక భేటీలో ప్రముఖ మలయాళ నటుడు మహాదేవన్, టాలీవుడ్ నటుడు రాజా రవీంద్ర, సినీ నిర్మాత సురేష్ కొండేటితో ఇతర నటులు పాల్గొన్నారు. రాజకీయ, సినీ రంగాల అగ్రనేతలంతా ఒకే వేదికపై కొద్దిసేపు సరదాగా గడుపుతూ కెమెరాకు ఫోజులివ్వడం అక్కడి పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంది.

## భీమవరం, పాలకొల్లు పట్టణాల్లో వర్షం...

భీమవరం (చైతన్యరథం): భీమవరం, పాలకొల్లు పట్టణాలు, పరిసర ప్రాంతాల్లో బుధవారం ఉదయం కురిసిన వర్షంతో రహదారులు, పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విద్యార్థులు, ఇతర ప్రయాణికులు ఒక్కసారిగా భీమవరం కొత్త, పాత బస్ స్టాండ్లకు చేరుకోవడంతో బస్సుల్లో కిక్కిరిసి ప్రయాణాలు చేశారు. పాలకొల్లులో బస్ స్టాండ్ ప్రాంగణమంతా చెరువుల మారిపోవడంతో ప్రయాణికులు నీటిలోంచే రాకపోకలు సాగించాల్సి వచ్చింది.

## పోలవరం ఆంధ్రప్రదేశ్ ప్రజలకు వరం : దాసరి శ్యామ్ చంద్రశేషు

**●ప్రాజెక్ట్ నిర్మాణం కోసం ఎంతో కృషి చేసిన మాజీ డిసిసిబి చైర్మన్ కరాటం రాంబాబుకి సత్కారం**



జంగారెడ్డిగూడెం (చైతన్యరథం): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లి వరకు జలహారతి ఇచ్చి నీటిని విడుదల చేయడాన్ని హర్షం వ్యక్తం చేస్తూ జంగారెడ్డిగూడెంలోని సౌభాగ్య థియేటర్ వద్ద టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చంద్ర శేషు మీడియా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రాజెక్ట్ నిర్మాణం చేపట్టిన రామయ్యపేట పైడిపాక నిర్వాసితులను తరలించడానికి ముఖ్య భూమిక పోషించి 120 ఎకరాలను ప్రాజెక్ట్ కోసం ఇచ్చిన మాజీ డిసిసిబి చైర్మన్ కరాటం రాంబాబుకి చిరు సత్కారం చేశారు. అనంతరం దాసరి శేషు మాట్లాడుతూ... పోలవరం ప్రాజెక్ట్ ఆంధ్రప్రదేశ్ ప్రజలకు గొప్ప వరం ఇది జీవనాడి దీన్ని గత ప్రభుత్వం గాలికి వదిలేసి ప్రాజెక్టును నాశనం చేసి నిర్వాసితులకు ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా అనేక ఇబ్బందులకు గురి చేస్తే కూటమి ప్రభుత్వం వచ్చాక చంద్రబాబునాయుడు నాయకత్వంలో అద్భుతంగా పనిచేసి 1800 కోట్లతో ఎడమ కాలువ నిర్మాణం చేపట్టి నేడు అనకాపల్లి వరకు నీటిని అందించడం అద్భుతమైన విషయం అని అన్నారు. 2500 కోట్ల రూపాయలను నిర్వాసితులకు అందించారని అన్నారు. 2027 పుష్కరాల నాటికి ప్రాజెక్టుకు పూర్తి చేసి గ్రావిటీ ద్వారా విశాఖకు కూడా నీరు అందిస్తారని తెలిపారు.

సన్మానం అందుకున్న కరాటం రాంబాబు మాట్లాడుతూ... ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విశేష కృషితనే ఇది సాధ్యం అయ్యింది అని 2005 లో ప్రాజెక్ట్ నిర్మాణం కోసం పైడిపాక రామయ్యపేట గ్రామాల ప్రజలను తరలించి ప్రాజెక్ట్ నిర్మాణం కోసం కృషి చేశామని, 120 ఎకరాలను కూడా ఇచ్చామని చెప్పారు. ఎంతో మంది ముఖ్యమంత్రులు వచ్చి శంకుస్థాపన చేయడం తప్ప పని జరగలేదని కానీ చంద్రబాబు నాయుడు పోలవరంపై ప్రత్యేక శ్రద్ధ వహించి అద్భుతంగా పని చేసి దాన్ని పూర్తి చేస్తున్నారు. ఈ దృశ్యాలను చూస్తుంటే చాలా ఆనందంగా ఉందని అన్నారు. ఈ మీడియా సమావేశంలో జనసేన మండల అధ్యక్షుడు ఆకుల రాకేష్, చింతల నాని కసుగుర్తి ఉమా తదితరులు ఉన్నారు.

## గ్రామీణ ఆరోగ్య కేంద్రాలతో మెరుగైన వైద్య సేవలు : ఎమ్మెల్యే వసంత

**●రూ.36 లక్షలతో 15వ ఆర్థిక సంఘం నిధులతో నిర్మాణం**



మైలవరం (చైతన్యరథం): గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రాథమిక వైద్య సేవలను మరింత చేరువ చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మైలవరం ఎమ్మెల్యే, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి వసంత వెంకట కృష్ణప్రసాదు అన్నారు. ఇబ్రహీంపట్నం మండలం దాములూరులో రూ. 36 లక్షల 15వ ఆర్థిక సంఘం నిధులతో నిర్మించిన గ్రామీణ ఆరోగ్య కేంద్ర భవనాన్ని గురువారం ఉదయం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు మాట్లాడుతూ... మైలవరం నియోజకవర్గంలో మౌలిక వసతుల అభివృద్ధితో పాటు ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోనే ప్రాథమిక వైద్యం అందుబాటులో ఉంటే ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గుతుందని తెలిపారు. నూతనంగా నిర్మించిన ఆరోగ్య కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా అధికారులు, వైద్య సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు, ప్రసూతి సేవలు, చిన్నారులకు టీకాలు, పోషకాహార పర్యవేక్షణ వంటి సేవలకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. అవసరమైన మందులు, వైద్య పరికరాలు, పరీక్షల సామగ్రి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా డెంగ్యూ, మలేరియా, వైరల్ జ్వరాలు, డయేరియా వంటి సీజనల్ వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలని, ప్రజల్లో ఆరోగ్య అవగాహన కల్పించేందుకు విస్తృత ప్రచారం నిర్వహించాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ ఆరోగ్య, సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా వైద్య సిబ్బంది కృషి చేయాలని ఎమ్మెల్యే కృష్ణప్రసాదు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక వైద్య వ్యవస్థను బలోపేతం చేయడంలో ఈ ఆరోగ్య కేంద్రాలు కీలకపాత్ర పోషిస్తాయని అన్నారు. దాములూరులో నూతన ఆరోగ్య కేంద్రం అందుబాటులోకి రావడంతో గ్రామస్తులకు వైద్య సేవలు మరింత చేరువ కానున్నాయని స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదుకి గ్రామస్తులు, మహిళలు కృతజ్ఞతలు తెలిపారు. కూటమి నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌ఛార్జ్ అక్కల రామ్మోహన్‌రావు, కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, వైద్య సిబ్బంది, స్థానిక గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ దంత వైద్య కళాశాలలో రూ.60 లక్షలతో అభివృద్ధి పనులు

**●త్వరలో విద్యార్థులకు హాస్టల్ సౌకర్యం: ఎంపీ కేశినేని శివనాథ్ శివనాథ్**

**●ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ప్రభుత్వ సలహాదారు షరీఫ్‌తో కలిసి అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం**



విజయవాడ (చైతన్యరథం): ప్రభుత్వ దంత వైద్య కళాశాల ఆవరణలో సుమారు రూ. 60 లక్షల వ్యయంతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, ప్రభుత్వ సలహాదారుడు షరీఫ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ శివనాథ్ మాట్లాడుతూ... ప్రభుత్వ దంత వైద్య కళాశాలలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కళాశాల ఆవరణలో నూతన డెంటల్ చైర్స్, 24 బెడ్లు, సీసీ రోడ్లు, పార్కింగ్ షెడ్, కాంపౌండ్ వాల్ తదితర అభివృద్ధి పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చామని చెప్పారు. ప్రతిరోజూ సుమారు 500 మంది వరకు ఔట్ పేషెంట్లు (ఓపీ) దంత వైద్య సేవల కోసం ప్రభుత్వ దంత వైద్య కళాశాలకు వస్తున్నారని ఎంపీ తెలిపారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు, వారికి అవసరమైన మౌలిక సదుపాయాలను కూడా కల్పించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. మెడికల్ యూనివర్సిటీలో కూడా అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని కేశినేని శివనాథ్ చిన్ని తెలిపారు. రోగులు, వారి సహాయకుల సౌకర్యార్థం ఆర్.ఓ. ప్లాంట్, పేషెంట్ల కోసం అదనపు షెడ్లు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. అదేవిధంగా దంత వైద్య కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన వసతి సౌకర్యం కల్పించేందుకు హాస్టల్ నిర్మాణం/సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకువచ్చే చర్యలు చేపడుతున్నామని, త్వరలోనే హాస్టల్‌ను కూడా ప్రారంభిస్తామని ఎంపీ కేశినేని శివనాథ్ చిన్ని తెలిపారు. ప్రభుత్వ వైద్య సంస్థల్లో మౌలిక వసతులను బలోపేతం చేసి, పేద, మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చేయడమే తమ లక్ష్యమని ఎంపీ పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన వైద్య సదుపాయాల కల్పనకు నిరంతరం కృషి చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ డెంటల్ కాలేజ్ మరియు హాస్పిటల్ ప్రిన్సిపల్ డాక్టర్ కొలసాని శ్రీనివాసరావు, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెంట్ డాక్టర్ రఘునందన్ రావు హెచ్ డి ఎస్ మెంబర్ గుమ్మడి కృష్ణారావు, వివిధ విభాగాల హెచ్‌ఓడీలు పాల్గొన్నారు

## రాష్ట్ర అభివృద్ధి, రైతు సంక్షేమమే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యం

●రైతుల కష్టాలు జగన్‌కు పబ్లిసిటీ ఈవెంట్లు లాగా అనిపిస్తాయి

●అసత్య ట్వీట్లతో ప్రజలను మభ్యపెట్టలేరంటూ జగన్‌పై దేవినేని ఉమా ఫైర్




విజయవాడ (చైతన్యరథం): రైతుల కష్టాలు, సాగునీటి సమస్యలు గొడ్డలి పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పబ్లిసిటీ ఈవెంట్లలా కనిపిస్తాయని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు మాత్రం రైతు సంక్షేమమే ప్రథమ ప్రాధాన్యమని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. గొల్లపూడి కార్యాలయంలో గురువారం మీడియాతో మాట్లాడిన ఆయన.. నీటిని రాజకీయానికి వాడుకున్నది జగన్ అయితే, నీటిని రైతు పొలాలకు మళ్లిస్తున్నది చంద్రబాబు అని వ్యాఖ్యానించారు. రాష్ట్రానికి మంచి జరుగుతుంటే ఓర్వలేక పోలవరం, అమరావతిపై జగన్ విషప్రచారం చేస్తున్నారని అసత్య ట్వీట్లతో ప్రజలను మభ్యపెట్టలేరని, జగన్ ప్రచారాన్ని ప్రజలు నమ్మే పరిస్థితి లేదని దేవినేని ఉమ విమర్శించారు. 48 ఏళ్ల రాజకీయ, పరిపాలనా అనుభవంతో విపత్కర పరిస్థితుల్లోనూ చంద్రబాబు రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తున్నారని ఉమ అన్నారు. ఎల్‌నినో పరిస్థితుల్లో సైతం నీటిని అన్ని ప్రాంతాలకు తీసుకెళ్లి రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందించారని తెలిపారు. పట్టిసీమ ద్వారా 33 టీఎంసీల నీటిని కృష్ణా డెల్టాకు అందించిన ఘనత చంద్రబాబుదేనన్నారు. పట్టిసీమ దండగ అన్న జగన్.. తాడేపల్లి ప్యాలెస్‌లో నువ్వు వాడుకున్న నీళ్లు ఎక్కడి నుంచి వచ్చాయో చెప్పాలని ప్రశ్నించారు. ప్రాజెక్టులు, సాగునీటి వ్యవస్థపై కనీస అవగాహన లేని జగన్.. నేడు నీటిపారుదల ప్రాజెక్టుల గురించి మాట్లాడటం హాస్యాస్పదమన్నారు. వెలుగొండ ప్రాజెక్టును తానే పూర్తి చేశానని అంటున్న జగన్.. ఐదేళ్ల అధికారంలో ఉండి రైతులకు నీళ్లు ఎందుకు ఇవ్వలేకపోయారని ఉమ ప్రశ్నించారు. పురుషోత్తమపట్నం ప్రాజెక్టును అడ్డుకునేందుకు ఎన్‌జీటీ, కోర్టుల్లో కేసులు వేయించి కుట్రలు చేశారని ఆరోపించారు. సముద్రంలోకి వృథాగా వెళ్లే నీటిని మళ్లించి రాష్ట్రాన్ని కాపాడాలని చంద్రబాబు ప్రయత్నిస్తుంటే.. జగన్ మాత్రం వాటిని పబ్లిసిటీ ఈవెంట్లుగా చిత్రీకరిస్తున్నారని మండిపడ్డారు. పట్టిసీమ, పురుషోత్తమపట్నం ప్రాజెక్టులను నాలుగేళ్లు అడ్డుకున్న జగన్.. ఐదో ఏడాది వాటిని ఆన్ చేయాల్సి రావడం 'దేవుడి స్క్రిప్ట్' అని వ్యాఖ్యానించారు.

## రాజకీయాల్లో మహిళల ప్రాతినిధ్యం పెరగాలి : ఎమ్మెల్యే గళ్ళా మాధవి

●మహిళలు రాజకీయాల్లో వస్తే ప్రోత్సహిస్తామని వెల్లడి



గుంటూరు (చైతన్యరథం): మహిళలు క్రియాశీలక రాజకీయాల్లో భాగస్వామ్యం కావాలని, ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండి పనిచేయాలని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి పిలుపునిచ్చారు. గురువారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మహిళా గ్రీవెన్స్ డే కార్యక్రమంలో మహిళల నుండి వినతిపత్రాలు స్వీకరించిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి, అనంతరం మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ... నేటి సమాజంలో మహిళలు విద్య, ఉపాధి, వ్యాపారం, సేవా రంగాలతో పాటు అన్ని రంగాల్లో తమ ప్రతిభను చాటుకుంటున్నారని, అదే విధంగా రాజకీయాల్లోనూ మహిళల భాగస్వామ్యం మరింత పెరగాల్సిన అవసరం ఉందన్నారు. మహిళలు రాజకీయాల్లోకి రావడం ద్వారా ప్రజా సమస్యలపై మరింత అవగాహన పెంపొందించుకుని, సమాజాభివృద్ధిలో కీలక పాత్ర పోషించగలరని పేర్కొన్నారు.

## తన ఆత్మవంచనపై జగన్ ఆత్మపరిశీలన చేసుకోవాలి

బచంద్రబాబు విజయాల్ని తనవిగా చెప్పుకున్నంత కాలం ప్రజల దృష్టిలో జగన్ అసమర్థుడే. : ప్రత్తిపాటి



చిలకలూరిపేట (చైతన్యరథం): "తన ఆత్మవంచనపై జగన్ ఆత్మపరిశీలన చేసుకోవాలి. నీళ్లు లేకుండా సాగునీటి ప్రాజెక్టుల్ని జాతికి అంకితం చేయడం.. సెట్టింగులు వేసి రైతుల్ని మోసగించడంలో జగన్ సమర్థుడని ప్రజలకు బాగా తెలుసు. అలాంటి నాయకుడు కూటమిప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మంచిని గుర్తించకుండా నిజాల్ని వక్రీకరిస్తూ, ముఖ్యమంత్రి చంద్రబాబును నిందించడాన్ని ప్రజలు ఎట్టి పరిస్థితుల్లో సమర్థించరు. రాష్ట్రప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు, సమృద్ధిగా సాగునీరు అందించాలన్న చంద్రబాబు సంకల్పబలం ముందు జగన్ విషప్రచారం నిలవదు. చంద్రబాబు దూరదృష్టి, పట్టుదల, నిర్విరామ కృషి వల్లే మొన్న వెలిగొండకు కృష్ణా జలాలు, నిన్న అనకాపల్లికి గోదావరి నీళ్లు వచ్చాయన్నది ప్రజలెరిగిన సత్యం. అవినీతి, దోపిడీలు తప్ప రాష్ట్రానికి, తమకు జగన్ ఎప్పటికీ మంచి చేయడని, అసలు కలలో కూడా జగన్‌కు ఆ ఆలోచన రాదని ప్రజల గట్టి నమ్మకం. ఇతరుల విజయాల్ని తనవిగా చెప్పుకున్నంతకాలం ప్రజల దృష్టిలో జగన్ ఎప్పటికీ అసమర్థుడిగానే మిగిలిపోతాడు. తన హయాంలో.. తన తండ్రి హయాంలో ముఖ్యమైన పనులు జరిగాయని అవినీతి పత్రికలో దుష్ప్రచారం తప్ప, ఆధారాలతో కూడిన వాస్తవాల్ని జగన్ ఎందుకు ప్రజల ముందు ఉంచడం లేదు? నిధుల కేటాయింపులు లేకుండా.. క్షేత్రస్థాయిలో పనుల పురోగతి కనిపించకుండా, భూములిచ్చిన నిర్వాసితులకు న్యాయం చేయకుండా అంతా తామే చేశామంటున్న జగన్ అజ్ఞానాన్ని ప్రజలు అసహ్యించుకుంటున్నారు." అని ప్రత్తిపాటి పుల్లారావు గురువారం ఒక ప్రకటనలో ఎద్దేవా చేశారు.

## గుండ్లకమ్మకు త్రాగునీరు విడుదల చేస్తాం : ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ



వినుకొండ (చైతన్యరథం): ఈనెల 7,8 తేదీలలో గుండ్లకమ్మకు త్రాగునీరు విడుదల చేయడం జరుగుతుందని ప్రభుత్వ చీఫ్ విప్, సీనియర్ శాసనసభ్యులు జీవి ఆంజనేయులు తెలిపారు. గురువారం స్థానిక చీఫ్ విప్ కార్యాలయంలో ఆర్డబ్ల్యూఎస్, ఎన్ఎస్పి, మైనర్ ఇరిగేషన్ అధికారులతో తాగునీటి సమస్యపై సమీక్ష నిర్వహించారు. గుండ్లకమ్మ నది పరివాహక ప్రాంతం నూజెండ్ల, వినుకొండ మండలాల పరిధిలో గల రక్షిత మంచినీటి పథకాలు గుండ్లకమ్మ నదిలో నీళ్లు లేక నిలిచిపోయి ఆయా గ్రామాలు త్రాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆర్డబ్ల్యూఎస్ అధికారులు చీఫ్ విప్ జీవి దృష్టికి తీసుకొచ్చారు. పల్నాడు జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా, ఎన్ ఎస్ పి ఎస్ ఇ తో ఆయన ఫోన్లో మాట్లాడారు. ఎన్ఎస్పి గుట్లపల్లి ఎస్కేప్ ఛానల్ వద్ద నుండి గుండ్లకమ్మ నదికి వెంటనే త్రాగునీరు విడుదల చేయాలని కోరారు. స్పందించిన అధికారులు ఈనెల 7,8 తేదీలలో త్రాగునీరు విడుదల చేస్తామని హామీ ఇవ్వడం జరిగిందని, ప్రజలు ఆందోళన చెందవద్దని చీఫ్ విప్ జీవి తెలిపారు. నియోజకవర్గంలో త్రాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. తాగునీటి ఇబ్బందులు నెలకొన్నాయని చెప్పగానే కృష్ణా బోర్డు రివర్ అధికారులతో మాట్లాడి సాగర్ కుడికాలువకు తాగునీరు విడుదల చేయించి చెరువులు నింపుతున్న ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయుడుకు ఆయన అభినందనలు తెలిపారు. నియోజకవర్గంలోని చెరువులన్నీ సాగర్ జలాలతో నింపి త్రాగునీటి సమస్యను పరిష్కరించడం జరుగుతుందన్నారు. సమావేశంలో ఆర్డబ్ల్యూఎస్, ఎన్ఎస్పి, మైనర్ ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

## ఇంటింటికీ కూటమి అభివృద్ధి.. ప్రజల ముంగిట ఎమ్మెల్యే సౌమ్య



నందిగామ (చైతన్యరథం): కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ప్రజల్లోకి విస్తృతంగా వెళ్తున్నారు. ఇందులో భాగంగా గురువారం నందిగామ పట్టణం అనాసాగరం గ్రామంలో కూటమి నేతలతో కలిసి డోర్ టు డోర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ, కూటమి ప్రభుత్వం రెండేళ్ల కాలంలో నందిగామ నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాల వివరాలను తెలియజేశారు. నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన కరపత్రాలను ప్రజలకు అందజేస్తూ, ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను వారికి వివరించారు. నియోజకవర్గంలో ప్రజల అవసరాలు, స్థానిక సమస్యలను గుర్తించి వాటికి అనుగుణంగా అభివృద్ధి పనులను ప్రాధాన్యత క్రమంలో ఒక్కొక్కటిగా చేపడుతూ ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య తెలిపారు. రెండేళ్లలో చేపట్టిన పనులతో పాటు భవిష్యత్తులో చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాలపై కూడా ప్రజలకు అవగాహన కల్పించారు. అభివృద్ధి పనులకు ప్రాధాన్యత.. సంక్షేమానికి పెద్దపీట కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి, సంక్షేమానికి సమాన ప్రాధాన్యతనిస్తూ పాలన సాగిస్తోందని ఎమ్మెల్యే సౌమ్య పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు, స్థానికులు పెద్ద ఎత్తున గ్రామస్తులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ పచ్చదనమే మా లక్ష్యం

●సూర్యలంకలో ఆటవీశాఖ ఆధ్వర్యంలో నగరవనం సమీపంలో మొక్కలు నాటిన ఎమ్మెల్సీ నాగబాబు, ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర



బాపట్ల (చైతన్యరథం): పర్యావరణ పరిరక్షణ, తీరప్రాంత పచ్చదనమే లక్ష్యంగా బాపట్ల మండలం సూర్యలంకలోని అటవీశాఖ ఆధ్వర్యంలో నగరవనం సమీపంలో విస్తృతంగా మొక్కలు నాటే కార్యక్రమం గురువారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గ్రీన్ కార్పొరేషన్ కార్యనిర్వాహక కమిటీ చైర్మన్ కొణిదెల నాగబాబు, బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వాసుదేవ వినోద్ కుమార్, బాపట్ల నియోజకవర్గ శాసనసభ్యులు వేగేశన నరేంద్రవర్మరాజు, కలిసి స్వయంగా మొక్కలు నాటారు. అనంతరం ముఖ్య అతిథులు బోటులో ప్రయాణించి తీరప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సూర్యలంక బీచ్ దిబ్బ సమీప ప్రాంతంలో తీర కోతను నివారించేందుకు, పచ్చదనం పెంపొందించేందుకు తాటి విత్తనాలు నాటారు. తీరం వెంబడి గల పలు ప్రాంతాల్లో కలియదిరిగి, అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నరేంద్ర వర్మ రాజు మాట్లాడుతూ... భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. ప్రకృతి సంపదను కాపాడుకోవడం కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదు, సమాజంలోని ప్రతి పౌరుడి నైతిక కర్తవ్యం. తీరప్రాంతాల్లో తుపానులు, బలమైన గాలులు, సముద్రపు కోత నుంచి తీరాన్ని కాపాడటంలో తాటి చెట్లు, అడవుల పెంపకం రక్షణ కవచంలా పనిచేస్తాయి. బాపట్ల నియోజకవర్గాన్ని పర్యావరణహిత పర్యాటక కేంద్రంగా, పచ్చదనానికి చిరునామాగా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోంది. అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు సమిష్టిగా పనిచేసి మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణను కూడా బాధ్యతగా తీసుకోవాలి" అని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్దే కూటమి ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే భాష్యం



పెదకూరపాడు (చైతన్యరథం): గ్రామాల అభివృద్ధి, ప్రజలకు మెరుగైన మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని గుంటూరుపెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. పెదకూరపాడు మండలంలో మొత్తం రూ. 1.68 కోట్ల విలువైన అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ప్రారంభించి, పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. పెదకూరపాడు మండలంలో రూ. 1.08 కోట్లతో నిర్మించిన మూడు విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఇందులో ఒక్కో క్లినిక్‌కు రూ. 36 లక్షల చొప్పున వెచ్చించగా, పెదకూరపాడు గ్రామంలో రెండు, హుస్సేన్‌నగర్‌లో ఒక విలేజ్ హెల్త్ క్లినిక్ భవనం నిర్మించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలను మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో ఈ క్లినిక్‌లను ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం గారపాడు గ్రామంలో రూ. 40 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న ఎస్టీ కమ్యూనిటీ హాల్ భవనానికి ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ శంకుస్థాపన చేశారు.

జోన్-4
(ఒంగోలు, నెల్లూరు, రాజంపేట, తిరుపతి, చిత్తూరు)
చైతన్యరథం

# చరిత్రలో నిలిచిపోయేలా సంక్షేమాభివృద్ధి

## సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి



సర్వేపల్లి (చైతన్యరథం): ముత్తుకూరు మండలం మల్లూరులో రూ.1.26 కోట్లతో పూర్తయిన అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పాల్గొన్నారు. రూ.30.80 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్లు, అంగన్ వాడీ భవనం, శ్మశానం ప్రహరీని ప్రారంభించారు. ఆర్డీఎస్ఎస్‌లో భాగంగా రూ.95 లక్షలతో పూర్తి చేసిన త్రీఫేజ్ విద్యుత్ లైన్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న పంచాయతీ మల్లూరులో రూ.1.26 కోట్లతో చేసిన అభివృద్ధి పనులను ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందన్నారు. ప్రతి ఊరిలో ఇదే స్థాయిలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. చరిత్రలో నిలిచిపోయేలా సంక్షేమ పథకాల అమలవుతున్నాయన్నారు. ఒక్క పింఛన్ల పథకానికే నెలకు రూ.2750 కోట్లు ఖర్చుపెట్టే రాష్ట్రం దేశంలో ఏపీ తప్ప మరొకటి లేదన్నారు. రూ.4 వేలు, రూ.6 వేలు, రూ.10 వేలు, రూ.15 వేలు పింఛన్లు అందజేయడం ఒక చరిత్రగా అభివర్ణించారు. ఇంట్లో ఎంత మంది పిల్లలు బడికి పోయినా అందరికీ తల్లికి వందనం పథకం కింద రూ.13 వేలు చొప్పున అందుతున్నాయన్నారు. వైసీపీ పాలనలో ఆ లబ్ధిని ఇంట్లో ఒక బిడ్డకే పరిమితం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఇప్పుడు ఒకరు, ఇద్దరు కాదు...ఐదుగురు, ఆరుగురు ఉన్నా రూ.13 వేలు చొప్పున ఇస్తున్నామన్నారు. ఇటీవల బిరదవోలు పంచాయతీలోని ఒక గిరిజన కుటుంబానికి ఐదుగురు పిల్లలకు రూ.65 వేలు రావడం ప్రత్యక్ష తార్కాణమన్నారు. అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు ఏడాదికి రూ.20 వేలు అందిస్తున్నామన్నారు. గతంలో కేవలం రూ.13 వేలు మాత్రమే వచ్చేదన్నారు. స్త్రీశక్తి పథకంలో భాగంగా మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం చేస్తున్నారన్నారు. దీపం పథకంలో భాగంగా ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందుకుంటున్నారన్నారు. వైసీపీ ప్రభుత్వంలో జగన్ రెడ్డి బటన్ నొక్కుళ్లకు మాత్రమే పరిమితమై కీలకమైన శాఖలను మూసి అభివృద్ధికి పాతరేశారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక వ్యవసాయ, ఇరిగేషన్, ఆర్ అండ్ బీ, పంచాయతీ రాజ్ వంటి కీలకశాఖల్లో బడ్జెట్ కేటాయింపుల ప్రకారం పనులు జరిగిపోతున్నాయన్నారు. అప్పట్లో అసెంబ్లీ ఆమోదించిన బడ్జెట్ కేటాయింపుల్లో 50 శాతం కూడా ఖర్చుపెట్టిన పాపాన పోలేదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఇరిగేషన్ పరంగా చరిత్ర సృష్టిస్తున్నామని పేర్కొన్నారు. మొన్న వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభమవగా నిన్న ఉత్తరాంధ్రకు గోదావరి జలాలు అందించారని వివరించారు. వాస్తవాన్ని వాస్తవంగా ఒప్పుకునే అలవాటు జగన్ రెడ్డికి మొదట నుంచి లేదన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆశీస్సులు, నారా లోకేష్ బాబు పట్టుదల, చంద్రబాబు అనుభవం, పవన్ కళ్యాణ్ సహకారం, అన్నీ కలిపి టీం వర్క్‌గా రాష్ట్రాభివృద్ధికి దోహదపడుతున్నాయన్నారు.



# మాట నిలబెట్టుకున్న మంత్రి నారాయణ

## సర్వేపల్లి కాలువకట్ట భూ సమస్యకు శాశ్వత పరిష్కారం

నెల్లూరు (చైతన్యరథం): నగరాభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ చొరవతో సర్వేపల్లి కాలువకట్ట ప్రాంతంలో 60 ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. భగత్ సింగ్ కాలనీ తరహాలోనే కాలువకట్ట నిర్వాసితులకు శాశ్వత పట్టాలు ఇప్పిస్తానని చెప్పిన మంత్రి, మున్సిపల్, ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులను స్వయంగా సమన్వయపరిచి ఇచ్చిన హామీని కేవలం నెల రోజుల్లోనే నెరవేర్చి తన మార్క్ చూపించారు. 1,215 పేద కుటుంబాలకు శాశ్వత ఇంటి పట్టాలు మంజూరు చేస్తూ రాష్ట్ర క్యాబినెట్‌చే ఆమోదం తింపించడంలో కీలక పాత్ర పోషించిన నారాయణను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా అభినందించారు. టీడీపీ అంటే మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వమని మరోసారి నిరూపించిన మంత్రి నారాయణకు ఆజన్మాంతం రుణపడి ఉంటామని నివాసితులు హర్షం వ్యక్తం చేస్తుండగా, త్వరలోనే ఆయన చేతుల మీదుగా పట్టాల పంపిణీ జరగనుంది.

# మాజీమంత్రి అనిల్ డైవర్షన్ పాలిటిక్స్



నెల్లూరు (చైతన్యరథం): మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో వైఎస్సార్సీపీ నేతలు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని నగం టీడీపీ మహిళా అధ్యక్షురాలు కప్పిర రేవతి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్‌లపై తీవ్ర ఆరోపణలు చేస్తూ సవాల్ విసిరారు..నెల్లూరు టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కప్పిర రేవతి మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికలు దగ్గర పడుతుండటంతో అనిల్ కుమార్ యాదవ్ ఉద్దేశపూర్వకంగానే డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని, అందుకే తాను మీడియా ముందుకు రావాల్సి వచ్చిందని తెలిపారు. సినీ హీరోయిన్ల చుట్టూ తిరిగిన చరిత్ర ఉన్న మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి, వయసు పైబడ్డాక మహిళలపై విమర్శలు చేయడమే ధ్యేయంగా పెట్టుకున్నారని మండిపడ్డారు. ప్రసన్నకుమార్ రెడ్డి రోడ్ల కాంట్రాక్టర్ల వద్ద కమీషన్లు తీసుకుంటూ, ఎంపీ శ్రీనివాసులురెడ్డి నుంచి పర్సంటేజీలు మింగేశారని ఆరోపించారు. చిన్న వయసులోనే కష్టపడి సంపాదించి, వేల కోట్లు ప్రజల సేవకే ఖర్చు చేసిన ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిపై అనిల్ పదే పదే విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. వైసీపీ ప్రభుత్వంలో మైనింగ్, గ్రావెల్ ల్యాండ్లలో కమీషన్లు తింటూ వేల కోట్ల అవినీతికి పాల్పడింది అనిల్ కుమార్ యాదవేనని ఆరోపించారు. గతంలో మున్సిపల్ ఎన్నికల సమయంలో తన ఇంట్లో కూర్చుని 1.5 కోట్లు ఆఫర్ ఇచ్చారని, తన భర్తపై అక్రమంగా సెక్షన్ 307 కేసు పెట్టి జైలుకు పంపించారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళనైన తనను కూడా కొట్టించడమే కాకుండా, కరోనా లాక్‌డౌన్ సమయంలో తాను 15 లక్షల నుండి 20 లక్షల వ్యయంతో నిర్మించుకున్న కేఫ్‌ను 60 మంది పోలీసులతో నెలమట్టం చేయించారన్నారు. అనిల్ కుమార్‌కు ధైర్యముంటే ఏ గుడికైనా వచ్చి ప్రమాణం చేయడానికి సిద్ధమా అని సవాల్ విసిరారు. తన గొంతులో ప్రాణం ఉన్నంతవరకు అనిల్ అక్రమాలను నిలదీస్తూనే ఉంటానని, నెల్లూరు అభివృద్ధికి మంత్రి నారాయణ, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని ఆమె స్పష్టం చేశారు.

## జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోండి : ఎరిక్సన్‌బాబు

యర్రగొండపాలెం (చైతన్యరథం): పట్టణంలోని అంబేద్కర్ ఆడిటోరియంలో స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్ మేళాలో ముఖ్య అతిధిగా యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎరిక్షన్ బాబు మాట్లాడుతూ ప్రతి నెల నిర్వహించే ఈ జాబ్ మేళాలో ఇప్పటి వరకు 430 మందికి పైగా ఉద్యోగాలు సాధించారని వెల్లడించారు. ప్రతి నిరుద్యోగ యువతి, యువకులు ఈ జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో స్కిల్ డెవలప్మెంట్ జిల్లా అధికారి కంచి బాబు గారు, మండల టీడీపీ అధ్యక్షులు చిట్యాల వెంగళరెడ్డి, అధికారులు, కూటమి నాయకులు, నిరుద్యోగ యువతి, యువకులు పాల్గొన్నారు.







# వెలుగొండ జలాల విడుదలపై విషం కక్కుతున్న వైసీపీ మూర్ఖులు

## ఎంపీ మాగుంటపై విమర్శలకు ఎమ్మెల్యే ముత్తుముల ఖండన

గిద్దలూరు (చైతన్యరథం): ఒంగోలు పార్లమెంటు సభ్యుడు మాగుంట శ్రీనివాసులు రెడ్డిపై వైకాపా నేతలు చేసిన అనుచిత వ్యాఖ్యలను, విమర్శలను గిద్దలూరు శాసనసభ్యుడు ముత్తుముల అశోక్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. బుధవారం ఉదయం గిద్దలూరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే అశోక్ రెడ్డి మాట్లాడుతూ వైకాపా నేతల రాజకీయ తీరు పై ఆగ్రహం వ్యక్తం చేశారు. గత నెల 31వ తేదీన వెలుగొండ జలాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి పశ్చిమ ప్రకాశం ప్రాంత అభివృద్ధి, ఈ ప్రాంత ప్రజలపై ఉన్న తీవ్రమైన ప్రేమ భావోద్వేగంతో మాట్లాడుతూ, గత వైకాపా పాలనలో వెలుగొండ ప్రాజెక్టుకు జరిగిన అన్యాయాన్ని గుర్తు చేసుకుంటూ వైఎస్ జగన్ రెడ్డి వైఖరిపై విమర్శలు చేశారన్నారు. అయితే, ఆ సమయంలో భావోద్వేగపూరితంగా జరిగిన అంశాన్ని వైకాపా నాయకులు బూతద్దంలో చూపిస్తూ, మాగుంట శ్రీనివాసులు రెడ్డి వంటి సీనియర్ నాయకుడి పై అనుచిత వ్యాఖ్యలు చేయడం, విమర్శలకు దిగడం సరికాదని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన మాట ప్రకారమే వెలుగొండ జలాలను విడుదల చేసి పశ్చిమ ప్రకాశం ప్రజల కళ్ళల్లో ఆనందం నింపారని, జలాల విడుదల వల్ల పశ్చిమ ప్రకాశ ప్రాంతమంతా ప్రకాశిస్తుంటే వైకాపా నేతలకు మింగుడు పడటం లేదని అశోక్ రెడ్డి అన్నారు. ఆ ఓర్వలేనితనంతోనే ఎంపీ మాగుంటపై లేనిపోని విమర్శలు చేస్తున్నారన్నారు. మాగుంట శ్రీనివాసులు రెడ్డి దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ చరిత్ర కలిగిన వారని, వారి కుటుంబం పశ్చిమ ప్రకాశంతో పాటు ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించి ప్రజల మన్ననలు పొందిందని గుర్తుచేశారు. అలాంటి మచ్చలేని కుటుంబంపై వైకాపా నేతలు తమ అక్కసు వెళ్లగక్కడం సరికాదన్నారు. ప్రభుత్వం వెలుగొండ ప్రాజెక్టును పూర్తి చేసి ప్రజలకు నీరు అందించిన అంశం నుంచి ప్రజల దృష్టిని పక్కదారి పట్టించేందుకే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇటువంటి 'టాపిక్ డైవర్షన్' రాజకీయాలకు పాల్పడుతోందని ధ్వజమెత్తారు. వైకాపా నాయకులది నీచ సంస్కృతి అని, గత ఐదేళ్ల పాలనలో వారు చేసిన అరాచకాలు, అసభ్యకర వ్యాఖ్యలు, బూతు పురాణాల చరిత్రను రాష్ట్ర ప్రజలు ఎవరూ మర్చిపోలేదని, ఇతరులను విమర్శించే ముందు తమ గత చరిత్రను ఒకసారి గుర్తు చేసుకోవాలని హితవు పలికారు. ఇకనైనా వైకాపా నేతలు తమ వైఖరిని మార్చుకుని హుందా రాజకీయాలు చేయాలని, లేనిపక్షంలో రాష్ట్ర ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు.

# రాజముద్రతో పాసుపుస్తకాల పంపిణీ

## పాల్గొన్న టీడీపీ ఇన్‌చార్జి మంచూరు సూర్యనారాయణ రెడ్డి, బద్వేలు ఆర్డీఓ చంద్రమోహన్




బద్వేల్ (చైతన్యరథం): గోపవరం మండలం ఎన్. రామాపురం గ్రామంలో "మీ భూమి మీ హక్కు" కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ రాజముద్రతో కూడిన పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బద్వేలు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి మంచూరు సూర్యనారాయణ రెడ్డి, బద్వేలు ఆర్డీఓ చంద్రమోహన్ పాల్గొని రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టీడీపీ ఇన్‌చార్జి మంచూరు సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ రైతుల భూములకు సంబంధించిన హక్కులను మరింత పటిష్టం చేయడంతో పాటు, ఎటువంటి అవకతవకలకు తావులేకుండా బార్‌కోడ్ ద్వారా భూ యజమాని వివరాలను పొందుపరిచి, భూమిపై రైతులకు పూర్తి భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. "మీ భూమి మీ హక్కు" కార్యక్రమం ద్వారా ప్రభుత్వ రాజముద్రతో కూడిన పట్టాదారు పాసుపుస్తకాలను రైతులకు అందించడం సంతోషకరమైన విషయమని పేర్కొన్నారు. రైతుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తూ, రాష్ట్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో గోపవరం మండల తహసీల్దార్, రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధులు, బద్వేలు నియోజకవర్గ కూటమి నాయకులు, గోపవరం మండల నాయకులు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## రైతు సంక్షేమమే కూటమి ధ్యేయం : ఎమ్మెల్యే దస్తగిరి



కోడుమూరు (చైతన్యరథం): రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. బుధవారం ఎర్రదొడ్డి గ్రామంలో రైతులకు పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాజముద్రతో కూడిన పాసు పుస్తకాలను రైతులకు అందిస్తోందన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో జగన తన బొమ్మను ముద్రించి రైతులను మోసం చేశారన్నారు. గత తప్పిదాలు లేకుండా రైతుల ఆస్తికి పూర్తి భద్రత కల్పిస్తూ సీఎం చంద్రబాబు రాజముద్రతో కూడిన పాసుపుస్తకాలు పంపిణీకి శ్రీకారం చుట్టారని సంతోషం వ్యక్తం చేశారు. తహసీల్దార్ నాగరాజు మాట్లాడుతూ 4,600 ఎకరాలకు సంబంధించి 1,526 పాసు పుస్తకాలు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో డీటీ కృష్ణమూర్తి ఆర్ఐ అశోక్, సీనియర్ అసిస్టెంట్ విష్ణుయాదవ్, వీఆర్వో నాగేంద్ర, పంచాయతీ కార్యదర్శి మాధవి పాల్గొన్నారు.



కడపలో నూతనంగా నిర్మిస్తున్న కడప జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయం పనులను కడప జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చదిపిరాళ్ళ భూపేష్ సుబ్బరామిరెడ్డి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు పుత్తా లక్ష్మీరెడ్డి పాల్గొన్నారు.

## మాజీమంత్రి అనిల్ ఉడత ఊపులు




ఆధారాలు లేని విమర్శలు చేస్తున్న మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్‌పై పఠాన్ సాబీర్ ఖాన్ విరుచుకుపడ్డారు. గత ప్రభుత్వ హయాంలో 2019 .24 మధ్యలో అనిల్ కుమార్ యాదవ్ కి ఇచ్చిన ఇరిగేషన్ శాఖ అని వదిలేసి సకల శాఖ మంత్రిగా ఉన్న సజ్జల రామకృష్ణారెడ్డి కి నెల్లూరు జిల్లాలో మైనింగ్ చేస్తున్న వాళ్ళని బెదిరించి ముడుపులు ఇచ్చినది నువ్వు కాదా అనిల్ కుమార్ యాదవ్ అని నిలదీశారు. గత ప్రభుత్వ హయాంలో అనిల్ కుమార్ యాదవ్ మంత్రిగా ఉండి, అక్రమాలు దౌర్జన్యాలు బెదిరింపులకు పాల్పడటం విమర్శించిన వాళ్ళని కొట్టడం కేసులు పెట్టడం జైలకు పంపించడం అనుకూలంగా లేని వాళ్ళ ఇల్లులు కూల్చడం తప్ప నువ్వు చేసిన అభివృద్ధి ఏంటో చెప్పు అని అన్నారు. పైగా నువ్వు చేసే తప్పుడు ఆరో ఆరోపణలకు బదులుగా సమాధానం ఇవ్వడం కోసం మీ పార్టీలో ఉన్న మైనార్టీలను ఎస్సీలను చెప్పి తెలుగుదేశం వాళ్లను తిట్టించి వాళ్ళని బలి పశువులు చేస్తున్నావు అని అన్నారు. నువ్వు చెన్నైలో విల్లా కట్టుకొని ఉన్నావు కదా, తమిళనాడులో అనిల్ అనే పదానికి ఒక అర్ధం ఉందని ముందు అది తెలుసుకోవాలన్నారు. తమిళనాడులో అనిల్‌ని ఉడతా అని పిలుస్తారని మా నాయకులపై చేసే నీ ఉడుత బెదిరింపులు ఇక్కడేవరూ లెక్క చేయరని ఎద్దేవా చేశారు. నెల్లూరు జిల్లాలో తెలుగుదేశం పార్టీ నాయకులు మంత్రి ఎంపీ ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు జిల్లా పార్టీ అధ్యక్షులు అందరూ కలిసికట్టుగా ఉన్నారన్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో లాగా అంతర్గత కలహాలు లేవన్నారు. అందులో నీకు జిల్లాలో ఎంట్రీ ఏ లేదన్నారు. నెల్లూరు రూరల్‌కు వెళ్తే విజయ్ కుమార్ రెడ్డి ఒప్పుకోరూ సిటీ లో వెళ్తే చంద్రశేఖర్ రెడ్డి ఒప్పుకోరు, నెల్లూరు జిల్లాకు వస్తే కాకాని గోవర్ధన్ రెడ్డి ఒప్పుకోరు, ఇవన్నీ వదిలేసి పెన్నా దాటి ఒక మాజీ మంత్రి మనిషి చూస్తే పర్సనాలిటీ నోరు చూస్తే మున్సిపాలిటీ అని పిలవబడే ప్రసన్నకుమార్ రెడ్డి చెంత చేరావు అని అన్నారు. ఈ నెల్లూరు జిల్లాలో ఒక మహిళ జీవిత కాలం అనేక కష్టాలు ఎదుర్కొని కోవూరు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి ప్రసన్న కుమార్ రెడ్డిని చిత్తుచిత్తుగా తుక్కుతుక్కుగా ఓడించిన నీకు సిగ్గు రాలేదు ప్రసన్ కుమార్ రెడ్డి ఆ మెజారిటీని చూసి నీకు మైండ్ దొబ్బి పిచ్చి పిచ్చి మాటలు మాట్లాడుతున్నావ్ అని అన్నారు. ఈ జిల్లాలో ఎంట్రీ లేని అనిల్ కుమార్ యాదవ్‌కు ఏదో ఒక సందర్భంలో రావడం ఆధారాలు లేని ఆరోపణలు చేయడంతో మీ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తలలు పట్టుకునే పరిస్థితుల్లో అనిల్ కుమార్ యాదవ్ దిగజారిపోయాడని అన్నారు.

# యుద్ధ ప్రాతిపదికన జల్‌జీవన్ పనులు పూర్తి చేయాలి

## ఎమ్మెల్యే పరిటాల సునీత పిలుపు



అనంతపురం (చైతన్యరథం): అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం రాప్తాడు నియోజకవర్గంలో త్రాగునీటి సరఫరా కోసం చేపట్టిన జల్ జీవన్ మిషన్ పనులపై ఆర్‌డబ్ల్యు.ఎస్ ఎస్‌ఈ, అధికారులు, సంబంధిత కాంట్రాక్టర్లతో రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాప్తాడు నియోజకవర్గంలోని ఆత్మకూరు, అనంతపురం రూరల్, రాప్తాడు మండలాల్లో చేపట్టిన పనుల పురోగతి, ఎంతవరకు పనులు పూర్తయ్యాయి, ఎక్కడెక్కడ పనులు చేపట్టాలి, తదితర అంశాలపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ జల్ జీవన్ మిషన్ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి వీలైనంత త్వరగా గ్రామాలకు త్రాగునీరు అందించాలన్నారు. జల జీవన్ పథకం కింద అనంతపురము రూరల్ మండలంలో సాయి పావని కంపెనీ 40 కోట్ల రూపాయలతో పనులు ప్రారంభించగా, ఇప్పటివరకు రూ.18 కోట్ల పనులు చేశారన్నారు. అందులో ఇప్పటివరకు 15 కోట్ల 50 లక్షల రూపాయల బిల్స్ ఇచ్చారని, 2 కోట్ల 50 లక్షలు బిల్స్ ఇవ్వాల్సి ఉందన్నారు. ఇందులో ఇంకా 22 కోట్ల రూపాయల పనులు చేయాలన్నారు. ఆత్మకూరు మండలంలో సరస్వతి కంపెనీ 50 కోట్ల 43 లక్షల రూపాయలతో పనులు ప్రారంభించగా, రూ.38 కోట్ల పనులు చేశారని, వారికి 34 కోట్ల బిల్స్ ఇచ్చారని, ఇంకా 12 కోట్ల 43 లక్షల రూపాయల పనులు చేయాలన్నారు. వారు ఆత్మకూరులో 10 గ్రామాలు, అనంతపురము రూరల్ పరిధిలో 4 గ్రామాలు, రాప్తాడులో 6 గ్రామాలలో పనులు చేస్తున్నారని, 50 శాతం పనులు చేసి మిగిలిన పనులు కాంట్రాక్టర్ పూర్తి చేయలేదన్నారు. సాయి పావని కాంట్రాక్టర్ వారు 31 గ్రామాలలో (కక్కలపల్లి కాలనీ, పాపంపేట, సజ్జల కాలువ, చిన్నంపల్లి, ఆలమూరు, కాటిగానికాలువ, రాచానపల్లి, ఎా.ఖ.యూనివర్సిటీ చుట్టూ గ్రామాలు వీటితో పాటు 19 గ్రామాలు) పనులు చేస్తున్నారని, ఇందులో 50 శాతం పనులు చేశారని, మిగిలిన పనులు పూర్తి చేయాల్సి ఉందన్నారు. పీఏబీఆర్ డ్యాం దగ్గర మెయిన్ పైప్ లైన్ 600 మీటర్లు పెండింగ్‌లో ఉందన్నారు. పీఏబీఆర్ డ్యాం దగ్గర ఫిల్టర్ బెడ్స్ పనులు ఇప్పటివరకు మొదలు కాలేదని, డ్యాం దగ్గర క్లియర్ వాటర్ సంపు నుండి ఆత్మకూరుకు పంపింగ్ చేసే మోటర్లు ఇప్పటివరకు ఆర్డర్ పెట్టలేదని, పి.నారాయణపురం మరియు పి.యాలేరు మధ్య హెచ్.ఎన్.ఎస్.ఎస్ కెనాల్ బ్రిడ్జి పనులు పూర్తికాలేదని, 50 శాతం పనులు జరిగాయని, ఆత్మకూరు గ్రామంలో ఓ.హెచ్.ఎస్.ఆర్ ట్యాంక్ పనులు సంపు పనులు ఇంకా పూర్తి కాలేదని, పంపురూము మరియు మోటర్లు పనులు కూడా పూర్తి కాలేదని, పంపనూరు మరియు చిన్నంపల్లి దగ్గర కట్టాల్సిన మినీ ట్యాంకుల పనులు కూడా పూర్తి కాలేదని, సత్యసాయి కార్మికులు జీతాలు రావట్లేదని, జీతాలు చెల్లించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. త్రాగునీటి సరఫరా పనులు వేగవంతంగా చేపట్టినందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ మాట్లాడుతూ జల్ జీవన్ మిషన్ కింద త్రాగునీటి సరఫరా పనులను రెండు నెలల్లో వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. ప్రస్తుతం నెలకొన్న ఎల్.నినో విపత్కర పరిస్థితుల్లో జల్ జీవన్ మిషన్ పనులను రెండు నెలలలోగా వేగవంతంగా పూర్తి చేసి 30 గ్రామాలకు త్రాగునీరు అందించాలని ఆదేశించారు. మౌలిక వసతుల పనులను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని అధికారులను మరియు కాంట్రాక్టర్లను ఆదేశించారు. ప్రధానంగా పంపింగ్ హౌస్ వద్ద 60 లక్షల రూపాయల అంచనా వ్యయంతో పంపింగ్ హౌస్ వద్ద కొత్త సాండ్ ఫిల్టర్లను అమర్చేందుకు చర్యలు చేపట్టాలని, దీనికి సంబంధించిన ఆర్డర్లను వెంటనే పూర్తి చేసి, రాబోయే 2 నెలల్లో పనులను చేపట్టాలని లక్ష్యంగా పెట్టుకుని పూర్తి చేయాలన్నారు. సబ్‌కాంట్రాక్టర్ ద్వారా కిర్లోస్కర్ కంపెనీ పంప్ సెట్ల కోసం ఆర్డర్ ప్రక్రియ వేగవంతం చేయాలని, రాబోయే 3-4 రోజుల్లో పేమెంట్లు పూర్తి చేసి, అధికారికంగా ఆర్డర్ ఖరారు చేయాలన్నారు. సాండ్ ఫిల్టర్లు, పైప్‌లైన్ల డయామీటర్ పెంపు మరియు ఇతర సాంకేతిక మార్పులకు సంబంధించిన రివైజ్డ్ వర్కింగ్ ఎస్టిమేట్లకు వారంలోగా ఎస్‌ఈ / సీఈ స్థాయి అధికారుల నుండి ఆమోదం లభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కురుగుంట, సిండికేట్ నగర్ పరిధిలోని మిగిలి ఉన్న 350 మీటర్ల చొప్పున పైప్‌లైన్ పనులను నెల రోజుల్లో పూర్తి చేయాలన్నారు. ఇబ్బందులు ఏవైనా ఉంటే స్థానిక ప్రజాప్రతినిధులు మరియు అధికారుల సమన్వయంతో వెంటనే పరిష్కరించాలన్నారు.?తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్నందున, పిఏఆర్‌బి డ్యామ్ నుండే మనకు ప్రధాన నీటి సరఫరా ఆధారపడి ఉందన్నారు. ప్రతినెల ఈ పనుల పురోగతిపై సమీక్ష నిర్వహిస్తామన్నారు. ప్రజలకు త్రాగునీటి ఎద్దడి కలగకుండా ఈ పనులన్నింటినీ నిర్దేశిత గడువులోగా పూర్తి చేయడమే ప్రాథమిక లక్ష్యంగా పనిచేయాలని ఆదేశించారు. ఈ పనులకు సంబంధించి పీఏబిఆర్ దగ్గర 2.5 ఎకరాల భూమి కావలసి ఉండగా, అందులో 75 సెంట్లు ఇవ్వడం జరగగా, ఇంకా 1.75 ఎకరాలు ఇవ్వాల్సి ఉండగా, వెంటనే త్వరగా ఇవ్వాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. దానితో పాటు ఒడ్డుపల్లి సబ్ స్టేషన్ వెనుకాల పిపిటి కట్టేందుకు 10 సెంట్లు కావలసి ఉండగా వెంటనే ఇవ్వాలని రెవెన్యూ అధికారులని ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్డబ్ల్యుఎస్ ఎస్‌ఈ కె.శ్రీనివాసులు, రాప్తాడు డిఈ శ్రీధర్, ఏఈలు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

### టొరంటోలో వైభవంగా

# తెలుగు భాషా దినోత్సవం

### ప్రముఖ రచయిత బండ్ల మాధవరావుకు ఘన సన్మానం

**టొరంటో (కెనడా):** గ్రేటర్ టొరంటో తెలుగు సాంస్కృతిక సంఘం (TCAGT) ఆధ్వర్యంలో 'తెలుగు భాషా దినోత్సవం', వ్యవహారిక భాషా ఉద్యమ పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి పంతులు జయంతి వేడుక కెనడాలో అత్యంత వైభవంగా జరిగింది. మిస్సిసాగా వ్యాలీ కమ్యూనిటీ సెంటర్ ఆడిటోరియంలో నిర్వహించిన వేడుకకు గ్రేటర్ టొరంటో పరిధిలోని తెలుగు కుటుంబాలు పెద్ద సంఖ్యలో హాజరయ్యాయి. ప్రముఖ కవి, రచయిత, విద్యావేత్త, సామాజిక ఆలోచనాపరుడు బండ్ల మాధవరావు ముఖ్య అతిథిగా హాజరు కాగా, రియాజ్ అలీ విశిష్ట అతిథిగా విచ్చేశారు. సంస్థ కార్యదర్శి ప్రవళిక కూన స్వాగతోపన్యాసంతో సభను ప్రారంభించి విశిష్ట అతిథులను వేదికపైకి ఆహ్వానించారు.

సంస్థ అధ్యక్షుడు శివ యల్లాలు మాట్లాడుతూ... కెనడాలో తెలుగు భాష, సంస్కృతి, సాహిత్య సంప్రదాయాలను భావితరాలకు అందించడమే తమ సంస్థ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. సామాన్యులకు తెలుగును చేరువ చేసిన గిడుగు రామమూర్తి పంతులు సేవలను ఈ సందర్భంగా ఆయన స్మరించుకున్నారు. అనంతరం ట్రస్టీ బోర్డు సభ్యురాలు దేవి చౌదరి మాట్లాడుతూ... బండ్ల మాధవరావు రచించిన 'పొలంగట్ల వెంట' కవితా సంపుటి విశిష్టతను కొనియాడుతూ అందులోని కొన్ని కవితలను రసవత్తరంగా పఠించారు.

ముఖ్య అతిథి బండ్ల మాధవరావును సీనియర్ అడ్వైజర్ సూర్య బెజవాడ సభకు పరిచయం చేశారు. ప్రముఖ సాంస్కృతిక రథసారధి తోటకూర ప్రసాద్ (యూఎస్ఏ) సూచన, ప్రోత్సాహంతో మాధవరావును ఈ వేడుకకు ఆహ్వానించినట్టు వెల్లడించారు. అనంతరం మాధవరావు కీలక ప్రసంగం చేస్తూ... విదేశాల్లో ఉంటూ మాతృభాషను, సంస్కృతిని కాపాడుకుంటున్న 'టీసీఏజీటీ' ప్రతినిధులను, కార్యకర్తలను అభినందించారు. తన "పొలంగట్ల వెంట" పుస్తకంలోని 'ఏడాదికొకసారైనా', 'బతుకు తెరువైంది' కవితల అంతరార్థాలను, సామాజిక-తత్త్వచింతనలను వివరించి సభికులను ఆకట్టుకున్నారు. అనంతరం నిర్వహించిన ప్రశ్నోత్తరాల ముఖాముఖి సదస్సు రంజింపజేసింది. సాహిత్య రంగానికి చేసిన సేవలకు గుర్తింపుగా బండ్ల మాధవరావు-డాక్టర్ ఉమారాణి దంపతులకు సంస్థ అధ్యక్షుడు శివ యల్లాలు, సీనియర్ అడ్వైజర్ సూర్య బెజవాడ, కార్యదర్శి ప్రవళిక కూన, ట్రస్టీ దేవి చౌదరి సంప్రదాయ శాలువా కప్పి పుష్పగుచ్ఛాలతో ఘనంగా సత్కరించారు.

ఈ కార్యక్రమం విజయవంతానికి కృషి చేసిన ట్రెజరర్ తేజ వజ్జారు, పద్మిని యల్లాలు, మౌనిక, నవీన్ వడ్లమూడి, శ్రీనివాస్ కడి, శరత్ కూన, సూరజ్ పెందం తదితర వాలంటీర్లకు, విందు సహకారం అందించిన బంజారా రెస్టారెంట్ అధినేత రాజేష్ విరెళ్ల, బెజ్‌బజార్ గ్రోసరీ అధినేత అనితా బెజవాడలకు కార్యదర్శి ప్రవళిక కూన ధన్యవాదాలు తెలిపారు.















### తానా మిడ్-అట్లాంటిక్ ఆధ్వర్యంలో

# 'విల్ అండ్ ట్రస్ట్ డ్రైవ్' విజయవంతం

**ఫిలడెల్ఫియా:** ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) మిడ్ అట్లాంటిక్ విభాగం ఆధ్వర్యంలో కమ్యూనిటీకి ఉపయోగపడేలా ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా ఫిలడెల్ఫియాలోని కింగ్ ఆఫ్ ప్రష్యాలో తానా మిడ్ అట్లాంటిక్ విభాగం ఏర్పాటుచేసిన 'విల్ అండ్ ట్రస్ట్ డ్రైవ్' విజయవంతమైంది. ఈ కార్యక్రమానికి 60 మందికి పైగా హాజరై వివరాలను తెలుసుకున్నారు. తానా సభ్యులతో పాటు సభ్యులు కాని వారికి కూడా ఇందులో ప్రవేశం కల్పించారు. 'చుగ్ ఫైనాన్షియల్ సర్వీసెస్' వారు ఉదారంగా ఈ కార్యక్రమ నిర్వహణకు సహకరించారు. ఉచితంగా తమ 'విల్ అండ్ ట్రస్ట్ డ్రైవ్' ప్లానింగ్ పూర్తి చేసుకునే అవకాశాన్ని కల్పించారని తానా బెనిఫిట్స్ కో-ఆర్డినేటర్ వెంకట్ సింగు తెలిపారు. ఈ కార్యక్రమంలో విల్ అండ్ ట్రస్ట్ ప్రాముఖ్యతను తెలియజేశారు. ఈవెంట్‌ను ఎంతో పక్కాగా ప్లాన్ చేసి ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు సమర్థవంతంగా నిర్వహించారు. పాల్గొన్న కుటుంబాలకు ప్రత్యేక సమయ స్లాట్‌లను కేటాయించి, ఎటువంటి ఇబ్బంది లేకుండా ప్రశాంతమైన వాతావరణంలో ప్రక్రియ పూర్తయ్యేలా చూశారు. కార్యక్రమాన్ని చక్కగా నిర్వహించడంతో పాటు విజయవంతం చేసిన తానా మిడ్ అట్లాంటిక్ టీమ్‌ను తానా బోర్డు డైరెక్టర్ రవి పొట్లూరి అభినందించారు. 'చుగ్ ఫైనాన్షియల్ సర్వీసెస్' ద్వారా సమాజానికి నిరంతరం సేవలు అందిస్తూ ఈ ఈవెంట్‌కు ఉదారంగా స్పాన్సర్‌షిప్ అందించిన సతీష్ నల్లాను ఆయన సత్కరించారు. కార్యక్రమ విజయానికి విశేష సహకారం, సేవలు అందించిన రంజిత్ మామిడికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

'తానా' అధ్యక్షుడు డాక్టర్ నరేన్ కొడాలి, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ లావు, బోర్డు డైరెక్టర్ రవి పొట్లూరి, మిడ్-అట్లాంటిక్ రీజినల్ రిప్రజెంటేటివ్ ఫణి కంతేటి, బెనిఫిట్స్ కో-ఆర్డినేటర్ వెంకట్ సింగు ఈ కార్యక్రమం విజయవంతమయ్యేందుకు మార్గదర్శకత్వం చేశారు.








# జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో 'అడాప్టివ్ టెస్టింగ్'

జేఈఈ అడ్వాన్స్‌డ్ అసెస్మెట్ విధానాన్ని మార్చే ఆలోచన ప్రతిపాదన దశను దాటి పైలట్ దశకు చేరుకుంది. విద్యార్థుల సామర్థ్యాన్ని కొలిచేందుకు, కోచింగ్‌పై ఆధారపడటాన్ని తగ్గించేందుకు అడాప్టివ్ టెస్టింగ్ మెరుగ్గా ఉంటుందని భావిస్తున్నారు. నూతన అసెస్మెంట్ విధానంలో ప్రశ్నల సంక్లిష్టత అభ్యర్థుల పెర్ఫార్మెన్స్‌కు అనుగుణంగా ఉంటుంది. తాజాగా చేపట్టిన పైలట్ ప్రాజెక్టులో వివిధ ఐఐటీల్లోని 4 వేల మంది మొదటి సంవత్సరం విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థుల స్పందనలు, పెర్ఫార్మెన్స్‌లు సేకరించామని, ప్రస్తుతం వాటిని ప్రాసెస్ చేస్తున్నామని ఐఐటీ కాన్పూర్ ప్రొఫెసర్ మనీంద అగర్వాల్ తెలిపారు. 2030కల్లా ఈ విధానాన్ని అందుబాటులోకి తీసుకురావాలని భావిస్తున్నారు. ప్రతిపాదిత అడాప్టివ్ విధానంలో విద్యార్థులకు తొలుత విభిన్న రకాల ప్రశ్నలు సంధిస్తారు. పరీక్షలో ముందుకుసాగుతున్న కొద్దీ వారి పెర్ఫార్మెన్స్ ఆధారంగా సామర్థ్య స్థాయిలను నిర్ణయిస్తారు. వివిధ సామర్థ్య స్థాయిలలో ఆటోమేటిక్‌గా ప్రశ్నలను సంధించే అంశాన్ని కూడా ఐఐటీ కాన్పూర్ పరిశీలిస్తోంది. ఇందులో విద్యార్థులకు ఎప్పటికప్పుడు ఆటోమేటిక్‌గా తాజా ప్రశ్నలు వచ్చేలా డేటాబ్య?సను రూపొందిస్తారు.

# అభిషేక్ బెనర్జీ కార్యాలయంపై దుండగులు దాడి



కోల్‌కతాలో టీఎంసీ నేత, ఎంపీ అభిషేక్ బెనర్జీ కార్యాలయంపై దుండగులు దాడి చేశారు. గురువారం తెల్లవారుజామున మాస్కులు, హెల్మెట్లు ధరించిన దుండగులు కార్యాలయంలోకి ప్రవేశించి నానా రభసా సృష్టించారు. వస్తువులను చెల్లాచెదురుగా పడేసి, అద్దాలను పగలగొట్టారు. కొన్నింటి వస్తువులను తమ వెంట తీసుకెళ్లిపోయారు. ఇందుకు సంబంధించిన వీడియోను అభిషేక్ బెనర్జీ షేర్ చేశారు. ఈ దాడి వెనుక బీజేపీ ఉందని ఆయన ఆరోపించారు. ఈ ఘటనపై పశ్చిమబెంగాల్ గవర్నర్, హోం మంత్రి అమిత్ షా చర్యలు తీసుకుంటారా? అని ప్రశ్నించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి సువేందు అధికారి తనపై బెదిరింపులకు దిగుతున్నారని ఎంపీ అభిషేక్ బెనర్జీ ఆరోపించారు. టీఎంసీ పార్టీని, తనను చూసి సీఎం భయపడుతున్నారని అన్నారు. 'రాష్ట్రంలోని ప్రతిపక్షం హింసాత్మ ఘటనలు, దాడులు, బెదిరింపులు గురవుతుంటే సీఎంకు అధికారంలో కొనసాగే నైతిక హక్కు లేనట్టే అని తేల్చి చెప్పారు. ఇందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనను తాము ఎన్నటికీ మర్చిపోబోమని కూడా చెప్పారు.



# ఏబీసీ చైర్మన్‌గా మోహిత్ జైన్

## డిప్యూటీ చైర్మన్‌గా విక్రమ్ సఖుజా ఎన్నిక

ఆడిట్ బ్యూరో ఆఫ్ సర్క్యులేషన్స్ (ఏబీసీ) చైర్మన్‌గా మోహిత్ జైన్ ఎన్నికయ్యారు. బెన్నెట్ కోల్మన్ అండ్ కో లిమిటెడ్ (బీసీసీఎల్) చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ (పబ్లిషింగ్), బోర్డు సభ్యుడిగా ఉన్న మోహిత్ జైన్ 2026–27 సంవత్సరానికి ఏబీసీ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దీంతో 43 ఏళ్ల తర్వాత బీసీసీఎల్‌కు చెందిన ప్రతినిధి మరోసారి ఏబీసీ చైర్మన్ పదవిని చేపట్టినట్లయింది. ప్రింట్ మీడియా రంగంలో రెండు దశాబ్దాలకు పైగా అనుభవం ఉన్న మోహిత్ జైన్.. ప్రచురణ, వ్యాపార కార్యకలాపాలు, పరిశ్రమ వ్యవహారాల్లో కీలక బాధ్యతలు నిర్వహించారు. కెమికల్ ఇంజనీరింగ్‌తో పాటు ఎంబీఏ చదివిన జైన్, 2021–22లో ఇండియన్ న్యూస్‌పేపర్ సొసైటీ (ఐఎన్ఎస్) అధ్యక్షుడిగా సేవలందించారు. రెండు దశాబ్దాలకు పైగా ఐఎన్ఎతో అనుబంధాన్ని కొనసాగిస్తున్నారు. ప్రపంచ న్యూస్ పబ్లిషర్స్ అసోసియేషన్ గ్లోబల్ సూపర్‌వైజరీ బోర్డులోనూ మోహిత్ జైన్ మూడేళ్లు పనిచేశారు. ప్రస్తుతం ఇంటర్నేషనల్ న్యూస్ మీడియా అసోసియేషన్ దక్షిణాసియా విభాగం బోర్డు వైస్ ప్రెసిడెంట్‌గా ఉన్నారు. కాగా, ఏబీసీ డిప్యూటీ చైర్మన్‌గా విక్రమ్ సఖుజా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

# ఎంకే స్టాలిన్‌కు ఎదురుదెబ్బ

## ఎన్నికల పిటిషన్‌ను కొట్టేసిన మద్రాస్ హైకోర్టు



తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి, డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్‌కు కోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఇటీవల ఎన్నికల్లో కొళత్తూర్ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన ఆయన ఓట్ల కౌంటింగ్‌పై పలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ కోర్టును ఆశ్రయించారు. అయితే, ఆయన పిటిషన్‌ను మద్రాస్ హైకోర్టు కొట్టేసింది. పిటిషన్ విచారణకు అర్హమైనది కాదని చీఫ్ జస్టిస్ ఎస్ఏ ధర్మాధికారి, జస్టిస్ జీ అరుల్ మురుగన్‌లతో కూడిన ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఎన్నికల్లో స్టాలిన్‌కు 74,202 ఓట్లు పోలయ్యాయి. ప్రత్యర్థి టీవీకే పార్టీకి చెందిన వీఎస్ బాబు 82,997 ఓట్లతో విజయం సాధించారు. ఫలితాలపై సందేహాలు వ్యక్తం చేసిన డీఎంకే అధినేత మే7 ఈవీఎంల బర్న్ మెమరీ, మైక్రోకంట్రోలర్ పరిశీలను దరఖాస్తు చేసుకున్నారు. జూలై 29న జరిగిన పరిశీలన సందర్భంగా కొన్ని ఈవీఎంలు పనిచేయకపోవడాన్ని స్టాలిన్ గుర్తించారని ఆయన తరఫు సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ పేర్కొన్నారు. నిజానిజాలు తెలుసుకునేందుకు నియోజకవర్గంలోని 100 శాతం వీవీప్యాట్‌లను మళ్లీ పరిశీలించాలని కోరారు. ఎలక్షన్ కమిషన్ తరఫున సీనియర్ అడ్వకేట్స్ న్యాయవాదులు జీ రాజగోపాల్, దామా శేషాద్రినాయుడు హాజరయ్యారు. వారు తమ వాదనలు వినిపిస్తూ ఎన్నికల కౌంటింగ్‌పై అభ్యంతరాలను ఈసీఐకి పిటిషన్ ద్వారానే పరిష్కరించాలని చెప్పారు. ప్రజాప్రతినిధుల చట్టం ప్రకారం ఈ పిటిషన్‌ను కొనసాగించే అవకాశం లేదని అన్నారు. ఈ కేసులో ఇటీవలే వాదనలు ముగిశాయి. తాజాగా మద్రాస్ హైకోర్టు మాజీ సీఎం స్టాలిన్ పిటిషన్‌ను కొట్టేసింది.

# పంజాబ్ సీఎం సతీమణిపై అవినీతి ఆరోపణలు




పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ భార్య గుర్‌ప్రీత్ కౌర్‌పై బీజేపీ సంచలన ఆరోపణలు చేసింది. రూ.5 కోట్లతో అత్యాచారం కేసులను పరిష్కరించేందుకు సీఎం భార్య గుర్‌ప్రీత్ కౌర్ సిండికేట్‌ను నడుపుతున్నారని బీజేపీ ఆరోపించింది. మధ్యవర్తుల ద్వారా ఈ దందాను నడుపుతున్నట్లు బీజేపీ నేతలు విమర్శించారు. బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారీ మీడియాతో మాట్లాడుతూ.. సీఎం భార్య గుర్ ప్రీత్ కౌర్.. అత్యాచార, క్రిమినల్ కేసులను పరిష్కరించడానికి తన రాజకీయ పలుకుబడిన ఉపయోగిస్తుందని తెలిపాడు. తనకు ముఖ్యనేతలతో సంబంధాల ఉన్నాయని, అత్యాచార కేసును పరిష్కరిస్తానంటూ ఓ మధ్యవర్తి మాట్లాడిన ఆడియో క్లిప్‌లను కూడా ప్రదీప్ విడుదల చేశాడు. అయితే ఆ ఆడియోలో సీఎం లేదా ఆయన భార్య పేరు ఎక్కడా ప్రస్తావన రాలేదు.



# ప్రపంచ క్రీడా నగరిగా చెన్నై

## తమిళనాడు శాసన సభలో ప్రకటించిన సీఎం విజయ్

తమిళనాడు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. చెన్నై నగరాన్ని ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ సెంటర్‌గా తీర్చిదిద్దే దిశగా ముందడుగు వేసింది. ఈ మేరకు రాష్ట్ర అసెంబ్లీలోని 110వ నిబంధన కింద ఒలింపిక్ సిటీని ఏర్పాటు చేయనున్నట్టు సీఎం జోసెఫ్ విజయ్ ప్రకటించారు. రాష్ట్ర క్రీడా అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్మించనున్న ఈ ప్రాజెక్టులో ప్రపంచ స్థాయి క్రీడా వేదికలు, ఆధునిక శిక్షణ పరికరాలు, హై పర్ఫార్మెన్స్ ట్రైనింగ్ సెంటర్, స్పోర్ట్స్ సైన్స్, స్పోర్ట్స్ మెడిసిన్ కేంద్రాలు వంటివాటిని నిర్మించనున్నట్టు పేర్కొన్నారు. అంతేకాకుండా క్రీడాకారులు, కోచ్‌ల కోసం వసతి సదుపాయాలతో కూడిన సమగ్ర క్రీడా కేంద్రంగానూ చెన్నైని అభివృద్ధి చేయనున్నట్టు తెలుస్తోంది. దేశంలోకి ఫార్ములా వన్ రేసింగ్‌ను తిరిగి తీసుకురావడం సహా అంతర్జాతీయ పోటీల్లో రాష్ట్ర క్రీడాకారులు మరిన్ని పతకాలు సాధించేలా అత్యుత్తమ శిక్షణ, సహాయక సదుపాయాలు కల్పించడమే ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యమని ప్రభుత్వం స్పష్టం చేసింది. '2028 నాటికి భారత్‌లోకి ఎఫ్–1ను తిరిగి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తాం. ఇందుకోసం దేశంలో మోటార్ స్పోర్ట్స్‌ను పర్యవేక్షించి, మంత్రిత్వ శాఖకు నివేదిక సమర్పించేందుకు ఓ టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటుచేశాం' అని యువజన, క్రీడా మంత్రిత్వ శాఖ తెలిపింది. అదే సమయంలో చెన్నైలో ప్రత్యేకంగా మోటార్ స్పోర్ట్స్ సిటీని ఏర్పాటు చేసి ఫార్ములా–1 నుంచి ఎఫ్–4 వరకు రేసులు నిర్వహించేందుకు ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. భారత్‌లో 2030 నాటికి ఫార్ములా–1 రేస్, 2028 నాటికి వరల్డ్ ర్యాలీ ఛాంపియన్‌షిప్‌లో ఒక రౌండ్ సహా మోటోజీపీని నిర్వహించే దిశగా కేంద్రం చర్యలు చేపట్టినట్టు ఫెడరేషన్ ఆఫ్ మోటార్ స్పోర్ట్స్ క్లబ్స్ ఆఫ్ ఇండియా(ఎఫ్ఎమ్ఎస్‌సీఐ) ప్రెసిడెంట్ అరిందమ్ ఘోష్ ఇదివరకే వెల్లడించిన సంగతి తెలిసిందే.

## రష్యా-ఉక్రెయిన్..

# శాంతి యత్నాలకు భారత్ సిద్ధమే!



రష్యా- ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికేందుకు మధ్యవర్తిత్వం సహా ఎలాంటి సహాయం అందించేందుకైనా భారత్ సిద్ధంగా ఉందని విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ పేర్కొన్నారు. ఆ రెండు దేశాలు కోరితే శాంతి స్థాపనకు కృషి చేస్తామన్నారు. యుద్ధక్షేత్రంలో ఈ వివాదం పరిష్కారం కాదు. ఏదైనా చర్చల ద్వారానే పరిష్కారం అవుతుందనేది భారత్ వైఖరి అని మరోసారి స్పష్టం చేశారు. సంప్రదింపులు, దౌత్యపరమైన చర్చలతోనే వీటికి ముగింపు ఉంటుందన్నారు. షాంగై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ (ఎస్‌సీఓ) సదస్సులో రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో ప్రధాని మోదీ భేటీ అయిన కొన్ని రోజులకే విదేశాంగ మంత్రి ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.

ప్రస్తుతం ఉక్రెయిన్ పర్యటనలో ఉన్న ఎస్ జైశంకర్.. ఆ దేశ విదేశాంగ మంత్రితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వాణిజ్య నౌకలపై ఇటీవల జరుగుతున్న దాడులు, నల్ల సముద్రంలో భద్రతా పరిస్థితులపై ఇరువురు చర్చించారు. ఈ సందర్భంగా భారత నావికులపై జరుగుతున్న దాడులపై జైశంకర్ ఆందోళన వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఇదిలాఉంటే, మూడు రోజుల పర్యటనలో భాగంగా విదేశాంగ మంత్రి జైశంకర్ సెప్టెంబర్ 3 నుంచి 5వ తేదీ వరకు ఉక్రెయిన్, పోలాండ్‌లో పర్యటించనున్నారు. ద్వైపాక్షిక సంబంధాల బలోపేతం.. ప్రాంతీయ, అంతర్జాతీయ భద్రతా పరిస్థితులపై ఆయా దేశాల దౌత్యవేత్తలతో చర్చించనున్నారు.

# ట్రంప్‌నకు కోర్టులో చుక్కెదురు!

అమెరికాలో పుట్టిన వారికి లభించే జన్మతః పౌరసత్వంపై పరిమితులు విధించేందుకు ప్రయత్నిస్తున్న ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు మరోసారి చుక్కెదురైంది. ఈ అంశంపై ఆయన గతంలో జారీ చేసిన కార్యనిర్వాహక ఉత్తర్వులను మేరీలాండ్ డిస్ట్రిక్ట్ కోర్టు నిలుపుదల చేసింది. విదేశీ వలసదారుల పిల్లలకు జన్మతః లభించే పౌరసత్వాన్ని పరిమితం చేసేలా, బర్త్ టూరిజాన్ని నిషేధించాలనే లక్ష్యంతో ఇటీవల ట్రంప్ కొత్త ఉత్తర్వులపై ట్రంప్ ఆగస్టు 6న ఈ ఆదేశాలు జారీ చేశారు. ఈ తీరును (బర్త్ టూరిజం) అనుమతించేదే లేదని అప్పట్లో తేల్చి చెప్పారు. కోర్టు మాత్రం ట్రంప్ తాజా ఆదేశాలను కూడా నిలుపుదల చేసింది. జన్మతః పౌరసత్వంపై అంతకుముందు సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును న్యాయమూర్తి ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఈ అంశంపై పరిమితులు విధించడం రాజ్యాంగాన్ని ఉల్లంఘించడమేనని స్పష్టం చేశారు.

**వరుసగా ఎదురుదెబ్బలు..**

రెండోసారి అధికారంలోకి వచ్చిన కొద్ది కాలానికే ట్రంప్ జన్మతః పౌరసత్వాన్ని లక్ష్యంగా చేసుకుని పలు ఆంక్షలు విధించారు. అక్రమంగా యూఎస్‌లో ఉంటున్న వారు, తాత్కాలిక ప్రాతిపదికన (ఉద్యోగ ఆధారిత, టూరిస్టు వీసాలు) అమెరికాలో ఉంటున్న వారికి సంతానం కలిగితే అమెరికా పౌరసత్వం రాదంటూ విస్తృత స్థాయి ఆదేశాలు జారీ చేశారు. ఈ ఆదేశాలు చెల్లవని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. దీంతో పిల్లల్ని కనేందుకే అమెరికా వస్తున్న వారిని ట్రంప్ టార్గెట్ చేశారు. బర్త్ టూరిజంను అడ్డుకుంటామంటూ కార్యనిర్వాహక ఆదేశాలు జారీ చేశారు. ఈ ప్రయత్నాలకు కూడా కోర్టులో చుక్కెదురైంది.

1868లో ఆమోదించిన 14వ రాజ్యాంగ సవరణ ప్రకారం అమెరికాలో పుట్టేవారందరికీ (వారి తల్లిదండ్రులు ఆ దేశంలో అక్రమంగా లేదా తాత్కాలికంగా ఉంటున్నా సరే) ఆ దేశ పౌరసత్వం లభిస్తుంది. విదేశీ దౌత్యవేత్తలు, శత్రుదేశాల వారికి మాత్రం ఈ నిబంధన వర్తించదు. అయితే బర్త్ టూరిజం పేరిట దీనిని దుర్వినియోగం చేస్తున్నారని.. ఇది దేశానికి అవమానకరమని ట్రంప్ వాదిస్తున్నారు. పుట్టబోయే బిడ్డకు విదేశీ



పౌరసత్వం పొందాలనే లక్ష్యంతో నెలలు నిండే సమయంలో గర్భిణీలు వేరే దేశానికి ప్రయాణించి అక్కడ ప్రసవించడాన్ని బర్త్ టూరిజంగా పేర్కొంటున్నారు.

# కొత్త వ్యూహంతో అమెరికా పునాదులు కదిలిస్తాం!



అమెరికాతో గత ఆరు నెలలుగా సాగుతున్న యుద్ధంలో ఇక నుంచి సరికొత్త వ్యూహాన్ని అమలు చేయబోతున్నామని ఇరాన్ సంచలన ప్రకటన చేసింది. ఇరు దేశాల మధ్య దాడులు, ప్రతిదాడులు తీవ్ర రూపం దాల్చిన నేపథ్యంలో ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ కార్యదర్శి మొహసిన్ రెజాయ్ ఈ హెచ్చరికలు జారీ చేశారు. సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ఆయన స్పందిస్తూ.. యుద్ధ క్షేత్రం, డిప్లొమసీ, ఆర్థిక ఆంక్షలను ఎదుర్కొనే విషయాల్లో ఇరాన్ కొత్త వ్యూహం త్వరలోనే మీ పునాదులను కదిలిస్తుంది. మీరు ఎంత ప్రయత్నించినా, మీరే సృష్టించుకున్న నరకం నుంచి బయటపడలేరని తీవ్ర స్థాయిలో వ్యాఖ్యానించారు.

ఇలాఉంటే ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ పశ్చిమాసియాలోని అమెరికా సైనిక స్థావరాలపై విరుచుకుపడ్డాయి. జోర్డాన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, కువైట్, బహ్రెయిన్, ఇరాక్‌లోని కుర్దిస్తాన్ రీజియన్‌లో ఉన్న యూఎస్ బలగాలే లక్ష్యంగా డ్రోన్లు, మిసైళ్లతో దాడులు నిర్వహించాయి.

**ఇరాన్ తీవ్ర ఆగ్రహం**

దక్షిణ ఇరాన్‌లోని సిరిక్ నగరంలో జరుగుతోన్న ఓ పెళ్లి వేడుకపై జరిగిన క్షిపణి దాడిలో ఒక చిన్నారితో సహా నలుగురు ప్రాణాలు కోల్పోగా, 50 మందికి పైగా గాయపడ్డారు. ఈ దాడికి అమెరికాయే కారణమని, ఇది ముమ్మాటికీ 'యుద్ధ నేరం' అని ఇరాన్ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి ఇస్మాయిల్ బాకాయ్ మండిపడ్డారు. ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ బాకర్ బాలిఘాఫ్ అమెరికాను 'సైతాన్'గా అభివర్ణించారు.

**అమెరికా సైన్యం వివరణ**

కాగా పౌరులను ఇరాన్ విప్లవాత్మక గార్డ్స్ తరహాలో అమెరికా సైన్యం ఎప్పుడూ లక్ష్యంగా చేసుకోదని యూఎస్ సెంట్రల్ కమాండ్ ప్రతినిధి టిమ్ హాకిన్స్ స్పష్టం చేశారు. హార్ముజ్ జలసంధిలో ఇరాన్ మందుపాతరలు ఏర్పాటు చేయడం, యుఎస్ సిబ్బందిపై దాడులు చేయడమే కారణమని చెబుతూ అమెరికా.. ఇరాన్ స్థావరాలపై దాడులు జరిపింది. ఈ దాడుల్లో 18 మంది మరణించడంతో ఇరాన్ ప్రతీకార దాడులను మరింత ముమ్మరం చేసింది. మరోవైపు, సౌదీ అరేబియాకు చెందిన రెండు ఆయిల్ ట్యాంకర్లపై జరిగిన దాడిలో ఇద్దరు ఫిలిప్పీన్స్ నావికులు ప్రాణాలు కోల్పోయారు.

**ట్రంప్ హెచ్చరికలు**

ఇరాన్ మరింతగా ప్రతీకార దాడులకు దిగితే కోలుకోలేని దెబ్బతీస్తామని యూఎస్ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సామాజిక మాధ్యమం 'ట్రూత్ సోషల్' వేదికగా హెచ్చరించారు. 'ఇలాగే కొనసాగితే ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ అనేదే మిగలదు' అని వ్యాఖ్యానించారు.

ఇంతటి తీవ్ర ఉద్రిక్తతల నడుమ కూడా, యుద్ధానికి స్వస్తి చెప్పేలా అమెరికా దౌత్యపరమైన ఒప్పందానికి ముందుకొస్తే తాము సానుకూలంగా స్పందిస్తామని ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ స్పష్టం చేశారు.



## ఇరాన్‌కు రష్యా సూపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణులు?

రష్యా, ఇరాన్ మధ్య సైనిక సహకారం మరింత బలపడనున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు తాజాగా వెలువడిన వార్త సంచలనం రేపుతోంది. అమెరికా యుద్ధనౌకలు, విమాన వాహక నౌకలను లక్ష్యంగా చేసుకోగల సూపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణుల అభివృద్ధిలో ఇరాన్‌కు రష్యా రహస్యంగా సహాయం చేస్తున్నట్లు 'ఫైనాన్షియల్ టైమ్స్' ఓ కథనాన్ని వెలువరించింది.

ఈ రహస్య ప్రాజెక్టుకు సీ 430ఎల్ అనే కోడ్‌నేమ్ పెట్టినట్లు సమాచారం. 2023లో ఈ కార్యక్రమం ప్రారంభమైనట్లు 'ఫైనాన్షియల్ టైమ్స్' పేర్కొంది. రష్యాకు చెందిన ప్రముఖ క్షిపణి నిపుణులు ఈ ప్రాజెక్టులో భాగస్వాములయ్యారని తెలిపింది. లీకైన పత్రాలు, ప్రయాణ రికార్డులు, సైనిక పేటెంట్ల ఆధారంగా రష్యా నుంచి ఇరాన్‌కు సాంకేతిక సహకారం అందుతున్నట్లు బయటపడిందని పేర్కొంది. ప్రధానంగా 'రామ్‌జెట్ ప్రొపల్షన్' సాంకేతికతను ఇరాన్‌తో రష్యా పంచుకున్నట్టు సమాచారం.

ఈ టెక్నాలజీని ఉపయోగించే క్షిపణులు శబ్ద వేగం కంటే పలురెట్లు అధిక వేగంతో ప్రయాణించగలవు. తక్కువ ఎత్తులో అధిక వేగంతో ప్రయాణించే క్షిపణులను గుర్తించి అడ్డుకోవడానికి ప్రత్యర్థి రక్షణ వ్యవస్థలకు చాలా తక్కువ సమయం మాత్రమే ఉంటుంది. అందుకే ఈ టెక్నాలజీ అమెరికా నౌకాదళానికి ఆందోళన కలిగించే అంశంగా మారుతోంది.

రష్యా సాంకేతిక సహకారంతో ఇరాన్ సూపర్‌సోనిక్ యాంటీ-షిప్ క్షిపణులను అభివృద్ధి చేయగలిగితే, పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలో ఉన్న అమెరికా యుద్ధనౌకలకు కొత్త ముప్పు ఏర్పడే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు. రిపోర్టుల ప్రకారం, ఇరాన్ ఇప్పటికే రామ్‌జెట్ ప్రొపల్షన్ వ్యవస్థను తయారు చేసి పరీక్షించింది.

## హర్మూజ్‌లో నౌకలకు అమెరికా రక్షణ



పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తీవ్రరూపం దాల్చిన వేళ కీలకమైన అమెరికా సైన్యం రక్షణతో 40 వాణిజ్య నౌకలకు హర్మూజ్ జలసంధిని దాటించింది. ఈ ఆపరేషన్లో సుమారు 18 మిలియన్ బ్యారెళ్ల చమురును తరలిస్తున్న నౌకలు సురక్షితంగా జలసంధిని దాటినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. యుద్ధం వేళ ఒక రోజులో హర్మూజ్ మీదుగా ఇంత భారీ సంఖ్యలో నౌకలకు అమెరికా నౌకాదళం రక్షణ కల్పించడం ఇదే తొలిసారి.

అమెరికా-ఇరాన్ మధ్య మరోసారి సైనిక ఘర్షణలు చోటుచేసుకోవడంతో హర్మూజ్ జలసంధిలో నౌకల రాకపోకలకు ముప్పు పెరిగింది. ఇటీవల అమెరికా బలగాలు.. ఇరాన్‌కు చెందిన రాడార్, క్షిపణి వ్యవస్థలతోపాటు తీర ప్రాంతంలోని పలు లక్ష్యాలపై దాడులు చేపట్టాయి. అటు ఇరాన్ కూడా ప్రతిదాడులకు పాల్పడుతోంది. దీంతో అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు మళ్లీ భగ్గుమంటున్నాయి. ఈ నేపథ్యంలోనే హర్మూజ్ నుంచి చమురు రవాణాకు అమెరికా ఈ ఆపరేషన్ చేపట్టింది.

అయితే తాజా పరిణామాలను చూస్తుంటే యుద్ధం ముగిసే అవకాశాలు కన్పించట్లేదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ క్రమంలోనే హర్మూజ్ జలసంధిని పూర్తిగా తమ నియంత్రణలోకి తీసుకురావడం అమెరికాకు అత్యంత కీలకంగా మారిందని విశ్లేషిస్తున్నారు. ఇదిలా ఉండగా.. గతంలో సైనిక లక్ష్యాలపై విస్తృతంగా దాడులు చేసిన అమెరికా.. ఇప్పుడు ఈ జలసంధిలో వాణిజ్య నౌకలకు ముప్పును తొలగించడంపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది.

# పూర్తిస్థాయి ఆటగాడిగానే...



ఐపీఎల్‌లో విజయవంతమైన జట్లలో చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్కే) ఒకటి. ఈ జట్టు పేరు చెప్పగానే గుర్తుకు వచ్చేది.. మిస్టర్ కూల్, టీమిండియా మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ. అతడు టీమిండియా బ్లూ జెర్సీలో ఎంత ప్రభావం చూపించాడో.. సీఎస్కే ఎల్లో జెర్సీలో కూడా అంతే స్థాయిలో తన సత్తా చూపించాడు. గత ఐపీఎల్‌లో పూర్తిస్థాయి ప్లేయర్‌గా ధోనీ మైదానంలోకి దిగకపోవడంతో అభిమానులు నిరుత్సాహానికి గురయ్యారు. ఈ సారి కూడా అతడు ఇంపాక్ట్ ప్లేయర్‌గానే జట్టులో ఉంటాడనే టాక్ వినిపిస్తోంది.

ఈ నేపథ్యంలో సీఎస్కే మాజీ ప్లేయర్ బద్రినాథ్.. ధోని అభిమానులకు గుడ్ న్యూస్ చెప్పాడు. ఐపీఎల్ 2027లో తలా (ధోనీ) తప్పకుండా ఆడతాడని వెల్లడించాడు. బద్రినాథ్ తన యూట్యూబ్ ఛానల్‌లో మాట్లాడుతూ.. ధోనీ నాతో వ్యక్తిగతంగా ఓ మాట చెప్పాడు. ఇంపాక్ట్ ప్లేయర్‌గా కాదు.. ఫుల్‌టైమ్ వికెట్ కీపర్‌గానే ఆడతానని అన్నాడు. అంటే ధోనీ 20 ఓవర్లు మైదానంలోనే ఉంటాడు. ఒకవేళ నిజంగానే ధోనీ బరిలోకి దిగితే చెన్నై జట్టుకు ప్రయోజనం ఉంటుంది. కానీ, ధోనీ శరీరం అంత సమయం సహకరిస్తుందా? అనేది అనుమానం. ధోనీ ఎక్కువగా 16 లేదా 17వ ఓవర్ తర్వాత బ్యాటింగ్‌కు వస్తుంటాడు. బ్యాటింగ్ సమయంలో అతడి పాత్ర చాలా పరిమితంగానే ఉంటుందని బద్రినాథ్ తెలిపాడు.

ఇదే సమయంలో యువ ఆల్‌రౌండర్ శివమ్ దూబే గురించి బద్రినాథ్ ప్రస్తావించాడు. అతడి బౌలింగ్ టీమిండియాకు అవసరం కానీ, సీఎస్కేకు కాదని అభిప్రాయపడ్డాడు. దూబే విషయంలో ఇంపాక్ట్ రూల్‌ను వినియోగించాల్సిన పనిలేదని తెలిపాడు. అలాగే విండీస్ ఆటగాడు అకీల్ హుస్సేన్‌ను తప్పకుండా తుది జట్టులో ఉంచాలని, సీఎస్కే మాత్రం అతడిని ఇంప్టాక్‌గానే తీసుకొస్తోందని బద్రినాథ్ తెలిపాడు. ఇక్కడ ఇంపాక్ట్ రూల్‌ను తప్పుబట్టేందుకు ఏమీ లేదని, సరిగ్గా ఉపయోగించుకునే వ్యూహం ఆయా జట్లకే ఉండాలని బద్రినాథ్ వ్యాఖ్యానించాడు.

# ఆసియా క్రీడలకు టీమిండియా కోచ్‌గా లక్ష్మణ్

మరో రెండు వారాల్లో మొదలయ్యే ఆసియా క్రీడల్లో తలపడనున్న టీమిండియా క్రికెట్ జట్టు కోచ్‌గా వీవీఎస్ లక్ష్మణ్‌ను నియమించారు. ఈ మేరకు కేంద్ర క్రీడల శాఖ ఆమోదం తెలిపింది. టీమ్ ఇండియా ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ స్థానంలో లక్ష్మణ్ ఈ బాధ్యతలను నిర్వర్తిస్తాడు. దాదాపు అదే సమయంలో వెస్టిండీస్‌లో వన్డే సిరీస్‌లో భారత్ తలపడనుంది. అందుకే, గంభీర్ స్వదేశంలోనే ఉంటాడని బీసీసీఐ పేర్కొంది. జపాన్ వేదికగా జరగనున్న ఈ క్రీడల్లో నేరుగా క్వార్టర్ ఫైనల్లో భారత్ తలపడనుంది. ఆసియా క్రీడలకు లక్ష్మణ్ కోచ్‌గా వెళ్లడం ఇది వరుసగా రెండోసారి. 2023లో చైనా వేదికగా జరిగిన పోటీలకూ లక్ష్మణే మార్గదర్శకుడు. అప్పుడు టీమిండియా బంగారు పతకం నెగ్గింది. ఆ తర్వాత పలు సిరీస్‌లకూ గంభీర్ స్థానంలో లక్ష్మణ్ కోచ్‌గా వెళ్లాడు. ఈసారి ఆసియా క్రీడలకు కోచింగ్ బృందంలో మాజీ క్రికెటర్లు సునీల్ జోషి, హృషికేశ్ కనిత్కర్, శుభదీప్ ఘోష్‌కు అవకాశం దక్కింది. మరూఫ్ ఫజందార్‌ను టీమ్ లీడర్‌గా కేంద్రం నియమించింది. ఇప్పటికే టీ20 జట్టును ప్రకటించిన సంగతి తెలిసిందే. శ్రేయస్ అయ్యర్  నాయకత్వం వహిస్తుండగా.. అతడికి డిప్యూటీగా తెలుగు కుర్రాడు తిలక్ వర్మకు అవకాశం దక్కింది. ఇందులో వైభవ్ సూర్యవంశీ, జస్ప్రీత్ బుమ్రా కూడా ఉన్నారు. ఆసియా క్రీడల్లో అతిపిన్న వయస్కుడైన క్రికెటర్‌గా వైభవ్ నిలిచాడు. మరోవైపు హెడ్ కోచ్ అమోల్ ముజుందార్, అవిష్కార్ సాల్వి నేతృత్వంలోనే భారత అమ్మాయిల క్రికెట్ జట్టు ఆసియా క్రీడల బరిలోకి దిగనుంది.



# సౌతాఫ్రికా గడ్డపై భారత్ ముందస్తు 'వేట'

సౌతాఫ్రికా వేదికగా జరగనున్న వన్డే ప్రపంచకప్‌-2027కు ఇంకా చాలా సమయం ఉన్నప్పటికి.. బీసీసీఐ మాత్రం ముందు నుంచే పక్కా వ్యూహంతో సిద్ధమవుతోంది.  ఇందులో భాగంగా ఆ మెగా టోర్నీకి ముందు ఆటగాళ్లను అక్కడి పరిస్థితులను అలవాటు చేసేందుకు, ఆతిథ్య జట్టు దక్షిణాఫ్రికాతో 4 నుంచి 6 వన్డేల సిరీస్ ఆడేలా బీసీసీఐ ప్రణాళికలు రూపొందిస్తోంది. ఇదే విషయంపై ఇప్పటికే బీసీసీఐ పెద్దలు సౌతాఫ్రికా క్రికెట్ బోర్డుతో చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. కాగా భారత జట్టు చివరిసారిగా 2024లో టీ20 సిరీస్ కోసం దక్షిణాఫ్రికా పర్యటనకు వెళ్ళింది. ప్రస్తుత అంతర్జాతీయ క్రికెట్ షెడ్యూల్లో భారత్‌-సౌతాఫ్రికాల మధ్య వన్డే సిరీస్ అనేది లేదు. అయితే భారత టీమ్ మేనేజ్‌మెంట్ అభ్యర్థన మేరకు ఈ ప్రత్యేక సిరీస్ ను ఏర్పాటు చేయనున్నట్లు బీసీసీఐ అధికారి ఒకరు తెలిపారు. నూతన అంతర్జాతీయ షెడ్యూల్ ఇంకా ఖరారు కాలేదు. కాబట్టి ప్రపంచకప్‌నకు ముందు ఈ వన్డే సిరీస్ నిర్వహించడానికి ఎలాంటి అడ్డంకులు ఉండబోవని సదరు అధికారి పేర్కొన్నారు. కాగా సవాలుతో కూడుకున్న దక్షిణాఫ్రికా వాతావరణ పిరిస్థితుల్లో ముందస్తుగా వన్‌డే సిరీస్ ఆడటం వరల్డ్ కప్ నాటికి భారత్‌కు ఎంతో ప్రయోజనకరంగా మారనుంది.

ఇక గత ప్రపంచకప్‌లో అజేయంగా ఫైనల్ చేరిన టీమిండియా తుది మెట్టుపై ఆస్ట్రేలియా చేతిలో బోల్తా పడగా.. ఈసారి మాత్రం ఎలాగైనా టైటిల్ గెలిచి తమ 15 ఏళ్ల నిరీక్షణకు తెరదించాలని పట్టుదలతో ఉంది. దక్షిణాఫ్రికా వేదికగా వన్డే ప్రపంచకప్ జరగనుండడం 24 ఏళ్ల తర్వాత ఇదే తొలిసారి కావడం గమనార్హం. చివరిగా 2003లో పూర్తిస్థాయిలో వన్డే వరల్డ్ కప్‌నకు దక్షిణాఫ్రికా ఆతిథ్యమిచ్చింది.

# చిత్తుగా ఓడినా... భారత్‌పై పాక్ అక్కసు!

ఇంగ్లాండ్ చేతిలో వరుసగా రెండు టెస్టుల్లో ఘోర ఓటమిపాలైన పాకిస్థాన్ జట్టుపై ఆ దేశ మాజీలు విమర్శల వర్షం కురిపిస్తున్నారు. మరోపక్క పాకిస్థాన్ క్రికెట్‌లోనూ అనుహ్య పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఇంగ్లాండ్‌తో జరగాల్సిన మూడో టెస్టుకు ముందే జట్టులోని మొత్తం ఏడుగురు ఆటగాళ్లపై వేటుపడింది. అంతేకాక కోచ్‌లు సర్ఫరాజ్ అహ్మద్, ఉమర్ గుల్‌ను పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) వెనక్కి పిలిపించింది. దీంతో పాకిస్థాన్.. క్రీడా ప్రపంచం ముందు నవ్వుల పాలైంది. పీసీబీ తీరు సరిగా లేకపోవడం వల్లే పాక్ క్రికెట్ పతనమవుతోందంటూ పలువురు మాజీలు మండిపడ్డారు.

అయితే తమ జట్టులోని లోపాలను సరిదిద్దుకోలేని పీసీబీ చైర్మన్ మోసిన్ నఖ్వీ ఇతర జట్లపై తన అసహనాన్ని వెళ్లగక్కుతున్నాడు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న అతడు కీలక వ్యాఖ్యలు చేశాడు. ఎంతటి బలమైన జట్లయినా అప్పుడప్పుడు ఊహించని ఓటములను చవిచూడటం సాధారణమంటూ తమ లోపాలను కప్పిపుచ్చే ప్రయత్నం చేశాడు.  ఇటీవల కొన్ని పెద్ద జట్లు.. చిన్న దేశాల చేతిలో ఓడిన విషయాన్ని ప్రస్తావించాడు. మిమ్మల్ని ఒక విషయం అడగాలి అనుకుంటున్నాను. నమీబియా చేతిలో దక్షిణాఫ్రికా ఓడలేదా.. అలానే ఐర్లాండ్ చేతిలో భారత్ ఓడిపోలేదా.. అంతమాత్రాన అక్కడితో క్రికెట్ ముగిసిపోయిందా.. ఆటల్లో జయాపజయాలు సహజం. మాకు ఎవరైతే అవసరమో వారిని కచ్చితంగా జట్టులోకి తీసుకుంటాం. అంతే తప్ప వరుసగా విఫలమయ్యే వారిని ఇకపై జట్టులో కొనసాగించం. మాకు ప్రతీ మ్యాచ్, ప్రతీ సిరీస్ కూడా చాలా ముఖ్యమని నఖ్వీ పేర్కొన్నాడు. నేను పీసీబీ చైర్మన్‌గా రాకముందు వన్డేల్లో ఎనిమిదో స్థానంలో ఉండేవాళ్లం. ఇప్పుడు ఐదో స్థానంలో ఉన్నాం. అలాగే టీ20ల్లో తొమ్మిదో స్థానం నుంచి ఆరో స్థానానికి వచ్చామని మోసిన్ నఖ్వీ చెప్పుకొచ్చాడు.

ఈ ఏడాది జూన్‌లో ఐర్లాండ్ జరిగిన టీ20 సిరీస్‌లో భారత్ ఓటమిపాలైన విషయం తెలిసిందే. కొన్ని రోజుల క్రితం ముక్కోణపు టీ20 సిరీస్‌లో నమీబియాతో జరిగిన మ్యాచ్‌లో సౌతాఫ్రికాకు చుక్కెదురైంది. ఈ ఫలితాలను ఉద్దేశించే మోసిన్ నఖ్వీ తాజాగా ఈ తరహా వ్యాఖ్యలు చేశాడని, పీసీబీ చీఫ్ జట్టును సరైన దారిలో నడిపించకుండా భారత్‌పై అక్కసు వెళ్లగక్కడం సరికాదంటూ క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## భారత్‌లో మహిళల చాంపియన్స్ ట్రోఫీ



మొట్ట మొదటి మహిళల చాంపియన్స్ ట్రోఫీని భారత్ నిర్వహించనుంది. ఈ మేరకు ఐసీసీ బుధవారం ప్రకటించింది. ఆరు జట్లు పాల్గొనే ఈ టోర్నీ వచ్చే ఏడాది ఫిబ్రవరి 14 నుంచి 28 వరకు ముంబై, వడోదర వేదికలుగా జరగనుంది. వాస్తవంగా ఈ టోర్నీ హక్కులను తొలుత శ్రీలంక దక్కించుకుంది. కానీ శ్రీలంక క్రికెట్‌లో ఆ దేశ ప్రభుత్వ జోక్యం దరిమిలా..ఆతిథ్యం నుంచి శ్రీలంకను ఐసీసీ తప్పించిన సంగతి తెలిసిందే. తర్వాత బంగ్లాదేశ్, భారత్, దక్షిణాఫ్రికా బోర్డులను పరిశీలించిన ఐసీసీ.. చివరకు భారత్‌కు ఆతిథ్యాన్ని కేటాయిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయాన్ని ఐసీసీ బోర్డు ఆమోదించింది జూలై ఆరు నాటికి ఐసీసీ టీ20 ర్యాంకుల్లో తొలి ఆరు స్థానాల్లో ఉన్న ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, భారత్, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా, శ్రీలంక చాంపియన్స్ ట్రోఫీకి అర్హత సాధించాయి. రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో జరిగే టోర్నీలో తొలి రెండు స్థానాలలో నిలిచే జట్లు ఫైనల్‌కు చేరతాయి.

## ఇదే భారత్‌లో అయితే ఎన్నో విమర్శలు..



ఇండోనేషియా మాస్టర్స్  వేదిక వద్ద వాతావరణంపై భారత షట్లర్ అస్మిత చాలిహా తీవ్ర విమర్శలు చేసింది. పొగమంచుతో ఇబ్బంది పడినట్లు తన సోషల్ మీడియా ఖాతాలో ఓ వీడియోను షేర్ చేసింది. భారత్‌లో గాలి నాణ్యత, కాలుష్యంపై విమర్శలు గుప్పించిన వారు.. ఇప్పుడు మాత్రం నోరు మెదపడం లేదని ఆక్షేపించింది. ఒకవేళ ఇదే టోర్నీ భారత్‌లో జరుగుతూ ఉంటే.. ఇప్పటికే ఎన్నో ఫిర్యాదులు, వివాదాస్పద కామెంట్లు వచ్చేవి. ఇప్పుడు చూడండి ఇక్కడి గాలి నాణ్యత, పొగమంచు, కాలుష్యం..అంటూ చాలిహా వీడియో పోస్ట్ చేసింది. ఇప్పుడీ వ్యాఖ్యలు నెట్టింట వైరల్గా మారాయి.

చైతన్య రథం
సినిమా
శుక్రవారం 4 సెప్టెంబరు 2026 X

# నేటినుంచి 'టాక్సిక్' ఇంగ్లీష్ వెర్షన్

రాకింగ్ స్టార్ యష్ హీరోగా భారీ అంచనాల నడుమ ప్రతిష్టాత్మకంగా పాన్ ఇండియా స్థాయిలో విడుదలైన గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలోని యాక్షన్ డ్రామా 'టాక్సిక్: ఏ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్-అప్స్' తీవ్ర నిరాశనే మిగిల్చింది. యష్ హీరోగా తెలుగు, కన్నడ, తమిళ, హిందీ, మలయాళ భాషల్లో గ్రాండ్‌గా థియేటర్లలోకి వచ్చిన ఈ చిత్రానికి మొదటి ఆట నుంచే నెగిటివ్ టాక్ వచ్చింది. భారీ తారాగణం, భారీ బడ్జెట్‌తో నిర్మించినప్పటికీ.. కథనంలో పట్టు లేకపోవడం, సాగదీసిన సన్నివేశాలు ప్రేక్షకులను నిరాశపరిచాయి. దీంతో దేశవ్యాప్తంగా బాక్సాఫీస్ వద్ద ఈ సినిమా పరాజయాన్ని చవిచూడాల్సి వచ్చింది. భారతీయ భాషలన్నింటిలోనూ ఆశించిన స్థాయిలో కలెక్షన్లు రాబట్టలేక బోల్తా కొట్టిన ఈ చిత్రంపై ట్రేడ్ వర్గాల్లోనూ తీవ్రమైన చర్చ సాగింది.

ఈ నేపథ్యంలో చిత్ర నిర్మాతలు అనూహ్యమైన నిర్ణయంతో ప్రేక్షకుల




ముందుకు వస్తున్నారు. 'టాక్సిక్' చిత్రాన్ని అంతర్జాతీయ ప్రేక్షకులను దృష్టిలో పెట్టుకుని ప్రత్యేకంగా 'ఇంగ్లీష్' వెర్షన్‌లో థియేటర్లలో విడుదల చేసేందుకు సిద్ధమయ్యారు. ఈ సినిమాను రూపొందించే క్రమంలో వాస్తవానికి ఇంగ్లీష్‌లోనే కథను రాయడంతో పాటు పలు కీలక సన్నివేశాలను కూడా ఇంగ్లీష్‌లోనే షూట్ చేశామని మేకర్స్ వెల్లడించారు. అంతేకాకుండా, భారతీయ భాషల్లో విడుదలైన లెంగ్తీ వెర్షన్‌లా కాకుండా, అంతర్జాతీయ అభిరుచులకు తగినట్లుగా నిడివి తగ్గించి, షార్ట్ కట్‌తో ఎడిట్ చేసి ఈ సరికొత్త ఇంగ్లీష్ వెర్షన్‌ను సిద్ధం చేశారు. ఇంగ్లీష్ వెర్షన్ సెప్టెంబర్ 4 నుంచి ప్రపంచ వ్యాప్తంగా థియేటర్లలోకి అందుబాటులోకి రానుందని తెలుపుతూ, మేకర్స్ అధికారికంగా ఓ పోస్టర్ విడుదల చేశారు. భారతీయ భాషల్లో భారీ ఎదురుదెబ్బ తిన్న తర్వాత, ఇలా ప్రత్యేకంగా ఇంగ్లీష్‌లో కుదించిన రన్‌టైమ్‌తో తీసుకురావడం నిజంగా నిర్మాతలు చేస్తోన్న పెద్ద ప్రయోగమనే చెప్పాలి. కనీసం ఈ ట్రిమ్ చేసిన ఇంగ్లీష్ కట్‌తోనైనా గ్లోబల్ ఆడియన్స్‌ను మెప్పించి నష్టాలను కొంతవరకైనా భర్తీ చేసుకుంటుందా లేదా పాత ఫలితం పునరావృతమవుతుందా అనేది వేచి చూడాలి.

# నెంబర్ వన్ హీరోయిన్ రష్మిక



రష్మిక మందన్న దేశంలోనే నెంబర్ వన్ హీరోయిన్‌గా నిలిచింది. ఓ మీడియా సంస్థ నిర్వహించిన 'మూడ్ ఆఫ్ ద నేషన్'లో ఇంతకు ముందు అగ్రస్థానంలో నిలిచిన దీపికా పదుకొనేను అధిగమించి ఆల్ ఇండియాలో నంబర్ వన్ హీరోయిన్ గా రష్మిక మందన్న నిలవడం విశేషంగా మారింది. అలియా భట్, శ్రద్ధా కపూర్ సైతం రష్మిక తరువాతి స్థానాల్లోనే సరిపుచ్చుకోవడం గమనార్హం. 'రామాయణ' భారీ చిత్రంలో నటించిన సాయిపల్లవి నాలుగో స్థానంలో నిలిచారు. తెలుగులో 'హలో'తో తొలి విజయం అందుకున్నప్పటికీ 'గీత గోవిందం' సినిమాతో రష్మిక పాపులారిటీ అమాంతం పెరిగిపోయింది. ఇక 'పుష్ప' సిరీస్ తో రష్మిక మందన్నకు నార్త్‌లో ఓ స్పెషల్ క్రేజ్ లభించింది. హిందీలో రష్మిక నటించిన 'ఛావా, యానిమల్' చిత్రాలు బంపర్ హిట్స్‌గా నిలిచాయి. మిషన్ మజ్ను, సికందర్, కాక్ టెయిల్ 2 వంటి సినిమాలు అంతగా అలరించక పోయినా రష్మిక అందం, అభినయం ఆల్ ఇండియా లెవల్లో యువతను విశేషంగా ఆకట్టుకుంది. రశ్మిక నటించిన 'తమ్మా' పాన్ ఇండియా మూవీగా రిలీజై అలరించింది. ఇప్పుడు రష్మిక ప్రధాన పాత్రలో రూపొందిన 'మైసా' నవంబర్ లో జనం ముందుకు రానుంది. ఈ సినిమాలోని రష్మిక లుక్ ఈ మధ్య విడుదలయి జనాన్ని విశేషంగా ఆకర్షిస్తోంది.

ఇలాఉంటే 'గీత గోవిందం' ఘనవిజయం తరువాత రష్మిక – విజయ్ దేవరకొండ ప్రేమాయణం మొదలయింది. పెళ్ళయిన తరువాత విజయ్– రష్మిక జోడీగా నటించిన 'రణబాలి' కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అక్టోబర్ 16న విడుదల కానున్న ఈ సినిమా మళ్ళీ 'గీత గోవిందం' రేంజ్ లో ఆకట్టుకుంటుందని ఫ్యాన్స్ ఆశిస్తున్నారు.

# దళపతి చూసి పేరు మార్చుకుని...

తమిళ నటుడు సూరి.. తెలుగు నటుడు సుహాస్‌తో కలిసి నటిస్తున్న స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా 'మండాడి'. ఈ నెల 10న సినిమా విడుదల కానున్న నేపథ్యంలో ఒక ఇంటర్వ్యూలో తన సినీ జీవిత విశేషాలను సూరి పంచుకున్నారు.

సినీ తెరపై వెలుగులీనాలనే ఆశ ప్రతి ఒక్కరికీ ఉంటుంది. కానీ, ఎలాంటి నేప థ్యం లేకుండా, తినడానికి తిండి లేని పరి స్థితుల నుంచి వచ్చి ఇండస్ట్రీలో గుర్తింపు తెచ్చుకునే స్థాయికి రావడం సామాన్య విషయం కాదు. అలాంటి ఒక స్ఫూర్తిదా యక కథే సూరి జీవితం. సూరి అసలు పేరు రామలక్ష్మణన్. చిన్నప్పటి నుంచే రజనీకాంత్‌కు వీరాభిమాని. 'దళపతి' సినిమా చూసి, అందులో రజనీ చేసిన 'సూర్య' పాత్రకు ఫిదా అయ్యారు. ఆ ఇష్టంతోనే తన పేరును 'సూర్య'గా మార్చుకున్నారు.. అదే తర్వాత 'సూరి'గా స్థిరపడింది.



16 ఏళ్ల వయసులో తిరుప్పూర్‌లో దినసరి కూలీగా పనిచేశారు. అప్పట్లో ఆయన రోజువారీ వేతనం రూ.20.వారం చివర్లోవచ్చే కూలీడబ్బుల నుంచి రూ.70. మదురైలోని తన కుటుంబానికి పంపే వారు. మిగిలిన దాంతోనే తాను బతికే వారు. ఒక్కోసారి తినేందుకు డబ్బు ల్లేక, రోజులు తరబడి టీ మాత్రమే తాగుతూ ఆకలితో గడిపిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి.

నటుడు కావాలనే బలమైన కోరికతో 1996లో సూరి చెన్నై చేరుకున్నారు. అక్కడ తెలిసిన వారు లేకపోవడంతో పెయింటింగ్, క్లీనింగ్ వంటి పనులు చేస్తూ... వచ్చిన డబ్బుతో అవకాశాల కోసం నిర్మాణ సంస్థల చుట్టూ తిరిగారు. 13ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత 2009లో వచ్చిన 'వెన్నిల కబడ్డీ కుజు' చిత్రం ఆయన జీవితాన్ని మలుపు తిప్పింది. ఆ సినిమాతో ఆయన పేరు 'పరోటా సూరి'గా మారింది. అక్కడి నుంచి వరుస అవకాశాలు తలుపుతట్టాయి. తరువాతి రోజుల్లో తమిళ చిత్రసీమలో టాప్ కమెడియన్‌లో ఒకరిగా పేరొందారు. 2021లో తన ఆరాధ్య నటుడు రజనీకాంత్‌తో కలిసి 'అన్నాత్తే' చిత్రంలో నటించి తన కల నెరవేర్చుకున్నారు.

### 'విడుదలై'.. నటుడిగా మంచి పేరు

కేవలం హాస్య నటుడిగానే మిగిలిపోకుండా, 2023లో ప్రముఖ దర్శకుడు వెట్రిమారన్ తెరకెక్కించిన 'విడుదలై పార్ట్-1'తో కథానాయకుడిగా పరిచయమయ్యారు. పోలీస్ కానిస్టేబుల్ కౌమారేశన్ పాత్రలో ఆయన ప్రదర్శించిన నటన విమర్శకుల ప్రశంసలు అందుకుంది. నటుడిగా ఆయన స్థాయిని పెంచింది. ఆ తర్వాత వచ్చిన 'విడుదలై పార్ట్-2లో కూడా ఆయన నటనకు మంచి గుర్తింపు లభించింది. ఈ గుర్తింపే పాన్. ఇండియా సినిమాలో అవకాశం కల్పించింది. త్వరలో విడుదల కాబోయే 'మండాడ' సినిమా కోసం ఆయన రూ. కోట్లలో పారితోషికం అందుకున్నారని సమాచారం.

# 'హనుమాన్ అంశ్' అద్భుతం: సెహ్వాగ్




'హనుమాన్ అంశ్' సినిమాపై టీమ్ ఇండియా మాజీ డాషింగ్ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ ప్రశంసలు కురిపించారు. ఎలాంటి స్టార్స్ లేకుండా బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని అందుకున్న తాజా చిత్రం 'హనుమాన్ అంశ్'. ఇటీవల హిందీలో విడుదలైన ఈ మూవీ కేవలం మౌత్ టాక్ తోనే రూ.70 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టింది. ప్రముఖ ఆధ్యాత్మిక గురువు, హనుమాన్ భక్తుడు నీమ్ కరోలి బాబా (మహరాజ్ జీ) జీవితం, ఆయన బోధనల ఆధారంగా ఈ సినిమాను విశాల్ చతుర్వేది తెరకెక్కించారు.

తాజాగా ఈ సినిమా చూసిన వీరేంద్ర సెహ్వాగ్ సోషల్ మీడియాలో ఎమోషనల్ పోస్ట్ పెట్టారు. ఈ మూవీ మహరాజ్‌కు భక్తిపూర్వక వందన సమర్పణ అని కొనియాడారు. కొన్ని అనుభూతులు, కొందరు వ్యక్తులను వర్ణించడానికి మాటలు సరిపోవు. వారి గురించి ఎంత చెప్పినా తక్కువే నా స్నేహితుల్లో కొందరు నీమ్ కరోలి బాబాకు భక్తులుగా ఉన్నారు. పదేళ్ల కిందట ఆయన గురించి నాకు చెప్పారు. అప్పటి నుంచి ఆయన గురించి వింటూ, చదువుతున్నా, మహరాజ్ జీ వ్యక్తిత్వం, ఆయన భక్తి నన్నెంతో ఆకర్షించాయి. ఆయన ఆశీస్సులు ఎంతో మంది జీవితాలు మార్చేశాయి. ఆయన జీవిత కథ ఆధారంగా రూపొందిన 'హనుమాన్ అంశ్ చూశా. ఆయన జీవితాన్ని ఒకే ఒక సినిమాలో చూపించడం అసాధ్యం. అయినా కూడా దీనిని చాలా అద్భుతంగా, అందంగా చూపించారు. మహరాజ్ జీకి ఇది నిజమైన వందనం. మన దేశ చరిత్రలో ఇలాంటి సాధువులు అరుదుగా జన్మిస్తారు. ఆయనను అర్థం చేసుకోవడం అసాధ్యం, మీకు ఆయన గురించి తెలిసినా, తెలియకపోయినా ఈ సినిమా చూడండి.. అని సెహ్వాగ్ అన్నారు.

ఇప్పుడు ఈ సినిమాను ప్రపంచ ప్రేక్షకులకు అందించడానికి హోంబలే ఫిల్మ్స్ ముందుకు వచ్చింది. సెప్టెంబరు 11వ తేదీన ఈ సినిమాని ఓవర్సీస్ లోనూ విడుదల చేయనుంది. 'కేజీయఫ్', 'కాంతార' వంటి చిత్రాలను ప్రేక్షకులకు అందించిన హోంబలే ఫిల్మ్స్ ఇప్పుడు చిన్న మూవీ హనుమాన్ అంశ్‌నె ప్రోత్సహించడం గమనార్హం.

# ట్రెండింగ్‌లో 'ఏష నాగుల' పాట

నాని హీరోగా వస్తున్న భారీ సినిమా 'ది ప్యారడైజ్' సినిమా నుండి విడుదలైన 'ఏష నాగుల' పాట ప్రస్తుతం సోషల్ మీడియా సహా యూట్యూబ్‌ను ఓ ఊపు ఊపేస్తోంది. షార్ట్స్, రీల్స్, మీమ్స్ ఒక్కటేంటి ఎక్కడా చూసినా ఇదే ట్రెండ్ నడుస్తోంది. అంతేకాదు, ఇప్పుడు ఈ పాట మరో రికార్డును సృష్టించింది. విడుదలైన 5 రోజుల్లోనే యూట్యూబ్ వేదికగా 50 మిలియన్లకు పైగా వ్యూస్‌ను దాటేసిన తొలి తెలుగు పాటగా రికార్డు సృష్టించింది. చిత్ర బృందం ఈ విషయాన్ని తెలియజేస్తూ పోస్ట్ పెట్టింది. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్ థ్రిల్లర్ 'ది ప్యారడైజ్. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ సెప్టెంబరు 24న ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రచారంలో భాగంగా 'ఏషనాగుల' మాస్ పాటను చిత్ర బృందం విడుదల చేసింది. అనిరుధ్ మ్యూజిక్, నాని, కీర్తి సురేష్ మాస్ డ్యాన్స్ అలరిస్తున్నాయి.

